Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 | సంచిక : 164 | ఆదివారం | అక్టోబర్ 4, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 15 | Issue No : 164 | Sunday | 4 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన



ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ : డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

- మిగతా 2లో..

## అమిత్‌షా తెలంగాణ పర్యటన రద్దు..

- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ



ప్రజాభూమి ప్రతినిధి, తెలంగాణ : కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని..

2 మిగతా..



## చంద్రబాబుకు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

- పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి
- పరిశ్రమదారులను మేం జాతి నిర్మాణకర్తలుగా భావిస్తున్నాం
- పాన్ ఐఐటి సమ్మిట్
- 2026లో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: భారతదేశం ఇప్పటివరకు చూడని మార్పు, అభివృద్ధి, సుపరిపాలనని తీసుకురావడానికి మేము తపన పడుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు మా టీం ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తోందని ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు.

పాన్ ఐఐటి సమ్మిట్ - 2026లో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మేము అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి... మోదీజీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి మా వంతు సహకారం అందించాలన్నదే మా ధ్యేయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం 4.0 ఆపరేటింగ్



సిస్టమ్ తో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. ఆయనకు ఇప్పుడు ఒక యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది. 50% శాసనసభ్యులు మొదటిసారి గెలిచినవారే, 25 మంది మంత్రులలో 17 మంది మొదటిసారి మంత్రులైనవారు.

వివరాలు 2లో..

## బిసి రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఎపి ప్రభుత్వం

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల వ్యవహారం పై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో బిసి లకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ... ప్రభుత్వం గతంలో జారీ చేసిన జిఒ లను

2 పేజీలో..





## వికారాబాద్ అనంతగిరి వద్ద లోయలో పడిన బస్సు..

4గురు మృతి

ప్రజాభూమి ప్రతినిధి, అనంతగిరి : వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అనంతగిరి సమీపంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా సుకెళ్లింది.

2 లో



## రుషికొండ బీచ్‌లో విషాదం..

ముగ్గురు విద్యార్థుల మృతి

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : విశాఖపట్నం రుషికొండ బీచ్‌లో సముద్రంలో గల్లంతైన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి.

2 లో

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

- మల్లికార్జున ఖర్గే
- దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే
- మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య
- ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు

- మిగతా 2లో..



## సామాన్య భక్తులే కేంద్రంగా ఉత్సవాల ఏర్పాట్లు

- వినూత్న కార్యాచరణతో సమగ్ర సౌకర్యాలు
- ఏఐ డిస్‌ప్లే బోర్డులు, చైల్డ్ ట్యాగ్స్, బూమ్ బ్యారియర్స్
- 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రం
- మొత్తం 3,500 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు
- మూడు హోల్డింగ్ ఏరియాల్లోనూ భక్తులకు సౌకర్యాలు
- క్రౌడ్ అనలిటిక్స్ ద్వారా నిరంతర చర్యలు
- ఉత్సవాల విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు, వీఎంసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం, ఈవో వీకే శీనా నాయక్

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ : ఈ నెల 11వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20వ తేదీ ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు జరిగే దసరా మహోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో శీనా నాయక్.. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, దేవాదాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సంయుక్త తనిఖీలు నిర్వహించారు.

2 పేజీలో..

## ఎన్నికలకు లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

జిల్లా స్థాయిలో లీగల్ టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయాలి

- నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు అభ్యర్థులకు అండగా నిలవాలి
- చంద్రబాబు ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొందాం
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు నామినేషన్ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని దశల్లో న్యాయపరమైన అండ అందించేందుకు పార్టీ లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు.



వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు లీగల్ సెల్ గట్టిగా అండగా

2 పేజీలో..

## శ్రీసిటీలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్'లో బాయిలర్ పేలుడు

- ఐదుగురు మృతి
- బాధితులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్ట పరిహారం..
- ప్రమాద ఘటన పై విచారణకు ఆదేశం..
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్





ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి (శ్రీసిటీ ) : శ్రీసిటీ పరిధిలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్' (TIL) పరిశ్రమలో శనివారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఆకస్మిక పేలుడు సంభవించడంతో దురదృష్టవశాత్తు 5 మంది మరణించారని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శ్రీ సిటీ పరిధిలో గల విదేశీ ఎగుమతులు చేపట్టే ఔషధాల తయారీ పరిశ్రమలోని 2 టన్నుల సామర్థ్యం గల బాయిలర్ ఆకస్మికంగా పేలిపోవడంతో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయా రన్నారు. పేలుడు ధాటికి బాయిలర్ వద్ద పనిచేస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, ఎగసిపడిన శిథిలాలు తగలడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

2 లో

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

- మంత్రి నారాయణ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వం
- బీసీ రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- గత ప్రభుత్వం వల్లే అమరావతి అభివృద్ధి ఆగిపోయిందని విమర్శ



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పందించారు. అమరావతిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే 123 మున్సిపాలిటీలకు

2 పేజీలో..

ప్రజాభూమి
ఆదివారం, అక్టోబర్ 4, 2026


## వికారాబాద్ అనంతగిరి వద్ద లోయలో పడిన బస్సు..

ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పలువురికి గాయాలైనట్లు సమాచారం. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని కేసారం నుంచి వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం చింతకుంటకు 54 మంది ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వారంతా వెళ్లారు. ఈ క్రమంలో అనంతగిరి కొండ పైనుంచి కిందికి దిగే క్రమంలో ఘాట్ రోడ్డులో బస్సు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## రుషికొండ బీచ్‌లో విషాదం..

శుక్రవారం సాయంత్రం ప్రశాంత్ మృతదేహం లభించగా.. శనివారం ఉదయం మరో ఇద్దరి మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మధురవాడ, వాంబే కాలనీ, మల్లయ్యపాలెంకు చెందిన ప్రశాంత్, నితీష్, సూర్యప్రకాష్ స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లారు. సముద్రంలో సరదాగా గడుపుతుండగా భారీ అల, రిప్ కరెంట్ ప్రభావంతో ముగ్గురూ గల్లంతయ్యారు. గాలింపు చర్యల్లో భాగంగా నేవీ హెలికాప్టర్, స్పీడ్‌బోట్లు, లైఫ్‌గార్డులు పాల్గొని మృతదేహాలను బయటకు తీసుకువచ్చారు.

## పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్

హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జిమెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.

## ఎన్నికలకు లీగల్ సెల్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

నిలిచిందని అభినందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకునేలా సహకరించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలింగ్ సందర్భంగా ఎదురయ్యే సమస్యలపై వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్నింటిలోనూ విఫలమై సజావుగా స్థానిక ఎన్నికలు జరిగితే వైఎస్సార్సీపీని ఎదుర్కోలేమన్న కారణంతో పోలీసులను, అధికారులను ఉపయోగించి అక్రమ కేసులు, వేధింపుల ద్వారా భయభ్రాంతులకు గురిచేసినా ధీటుగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్సీపీ లీగల్ సెల్ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని లీగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట న్యాయవాదులను అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా సెంట్రల్ ఆఫీస్‌లో లీగల్ వార్‌రూమ్ తరహా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. లీగల్ సెల్ నాయకులు టీమ్ స్పిరిట్‌తో పనిచేయాలని, యువ న్యాయవాదులతో పాటు పార్టీ పట్ల సానుభూతి కలిగిన అనుభవజ్ఞులైన న్యాయవాదుల సేవలను కూడా వినియోగించుకోవాలని కోరారు.

## సుప్రీం తీర్పు తర్వాతే మున్సిపల్ ఎన్నికలు

ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి నారాయణ వివరించారు. ఇందుకోసం సుమారు రూ.2,000 కోట్లు కేటాయించామని, ఇందులో ఒక్క రాజమండ్రి అభివృద్ధి పనులకే రూ.1,000 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నప్పటికీ, పుష్కరాల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన రూ.5,350 కోట్ల నిధులు వినియోగించుకోకపోవడంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను కేంద్రం సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు.అమరావతి అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోని ఐదు ఉత్తమ రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం అమరావతి అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో 2028 చివరినాటికి నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడిం చారు. 2027లో 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో రోడ్లు, ఘాట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల పనులను వివిధ శాఖలు సమన్వయంతో చేపడుతున్నాయి.

## బిసి రిజర్వేషన్ల పై సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఎపి ప్రభుత్వం

ఎపి హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి విదితమే. ఆ తీర్పును సవాలు చేస్తూ ఎపి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసుకు సంబంధించి గతంలో విచారణ జరిపిన హైకోర్టు, బిసి లకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వల్ల మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి మించిపోతుందని వ్యాఖ్యానించింది. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు, మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ జిఒ లు ఉన్నాయని పేర్కొంటూ ... 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జిఒ లను హైకోర్టు రద్దు చేసింది. అదే సమయంలో ... రిజర్వేషన్ల అంశంపై తుది నిర్ణయం తేలే వరకు ఎన్నికలు ఆపాల్సిన అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఓటర్ల జాబితా నమోదు (సర్ ప్రక్రియ) తో సంబంధం లేకుండా, నిర్దేశిత గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేస్తూ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని, బిసి రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వం తన పిటిషన్‌లో కోరింది. దీనిపై సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉంది.

## లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి

అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్టేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# చంద్రబాబుకు యంగ్ హార్డ్ వేర్ టీమ్ అండగా ఉంది

అనుభవజ్ఞమైన సాఫ్ట్‌వేర్‌కు యువ, డైనమిక్ హార్డ్‌వేర్ కలయికే నేటి ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా, విభిన్నంగా నిలబెడుతోంది. మా టీమ్‌కు ఒక స్పష్టమైన విజన్ ఉంది. ఏ రంగమైనా ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలి. నా దృష్టిలో పాన్ ఐఐటీ అంటే కంపెనీలు, టెక్నాలజీలు, పరిశోధనా సంస్థలు మొత్తం పరిశ్రమలను నిర్మించిన వ్యక్తులు. పాన్ ఐఐటీ 23 ఐఐటీల పూర్వ విద్యార్థులందరినీ ఒకచోట చేర్చుతుంది. భారతదేశం అంతటా, ప్రపంచ ప్రధాన టెక్నాలజీ హబ్ లలో 5 లక్షలకు పైగా ఐఐటీ గ్రాడ్యుయేట్లను కలుపుతుంది. ఈ కమ్యూనిటీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో సమావేశం కావడం ఆనందంగా ఉంది.

**భారత్ అభివృద్ధికి దశాబ్దం చాలు :** అమెరికా, యూరప్ దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా మారడానికి దాదాపు 100 సంవత్సరాలు పట్టింది. దుబాయ్ దాదాపు 30 సంవత్సరాల్లో, సింగపూర్ సుమారు 25 సంవత్సరాల్లో ఆ స్థాయికి చేరుకున్నాయి. భారత్ ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది, అభివృద్ధి సాధించడానికి ఒక దశాబ్దం సరిపోతుందని నేను నమ్ముతున్నాను. ఆ 'గోల్డెన్ డికేడ్' మనదే కావాలి. దీనికి త్రీ "ఎస్" మంత్రమే ఆధారం. మొదటిది – స్పీడ్, రెండవది – సర్వీస్, మూడవది – స్టెబిలిటీ. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వేగాన్ని చూస్తే స్పీడ్ కు అర్థం తెలుస్తుంది. మా టీమ్ ఇప్పుడు ఆతృతతో ఉంది. ప్రజలు మాకు ఇచ్చింది ఐదు సంవత్సరాల సమయం. ఆ సమయంలోనే ఫలితాలు చూపించాలి. కేవలం ఎంఓయులు కుదుర్చుకుని వాటిని మర్చిపోయే పని మాది కాదు. ప్రాజెక్టులకు వాస్తవ రూపమిచ్చి, వాటి ద్వారా ఉద్యోగాలు సృష్టించాలన్న తపన మాది. రెండోది సర్వీస్. పరిశ్రమల అభివృద్ధిలో ప్రభుత్వానిది ఎంతో కీలకమైన పాత్ర ఉందని మేము నమ్ముతున్నాం. వ్యవస్థాపకులు, పరిశ్రమలను మేము 'జాతి నిర్మాణకర్తలు'గా భావిస్తున్నాం. మీతో కలిసి పనిచేయాలి, ప్రతి పాలసీని మీతో కలిసి రూపొందించాలి. ప్రపంచ స్థాయి పాలనను అందించాలి. అదే మా సేవా దృక్పథం. నిజానికి, రాష్ట్రంలోని టాప్ ప్రాజెక్టులపై వ్యక్తిగతంగా నేను శ్రద్ధ వహిస్తాను. ప్రతి శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఉదయం ప్రమోటర్లకు వారి ప్రాజెక్టులపై వ్యక్తిగత అప్‌డేట్ పంపుతాను. ఆ సమయంలో వారు తమ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్ట్ గురించి చదివే సమయం ఉంటుంది. ఇదే ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ పెట్టుబడిదారులకు మేము అందిస్తున్న సేవ. మూడవది స్టెబిలిటీ. పాలసీ స్థిరత్వం, పాలసీ ఫ్రేమ్‌వర్క్ చాలా ముఖ్యమైనవి. పాలసీలు కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి.

**ఏఐ ద్వారా అధికారులకు దిశానిర్దేశం :** ఇప్పుడు ఐఏఎస్ అధికారులకు సహాయం చేయడానికి ఏఐని కూడా ఉపయోగిస్తున్నాం. వారు రూపొందించే పాలసీలు, ప్రభుత్వ ఉత్తర్వులు గత అనుభవాల ఆధారంగా రూపొందించబడుతూ, చట్టపరమైన, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి. దీనికి ఒక మంచి ఉదాహరణ టీచర్ రిక్రూట్‌మెంట్. మేము 16వేల మంది ఉపాధ్యాయులను నియమించుకున్నాం. ఈ ప్రక్రియ చట్టపరమైన పరిశీలనను తట్టుకునేలా ఉండాలని నేను మా కమిషనర్‌కు ఆదేశాలిచ్చాను. ఆయన గతంలో వచ్చిన అన్ని కేసులను ఏఐ ఇంజిన్‌లో విశ్లేషించి, గత ఉత్తర్వులు ఎందుకు నిలిచిపోయాయో అర్థం చేసుకున్నారు. దాని ఆధారంగా అత్యుత్తమ రిక్రూట్‌మెంట్ పాలసీలలో ఒకదాన్ని, చట్టపరమైన పరిశీలనను తట్టుకునేలా ఉత్తమమైన ప్రభుత్వ ఉత్తర్వును రూపొందించాం. మనమంతా కలిసి ఆలోచిస్తే స్థిరత్వాన్ని అందించగలం. మాకు క్వాంటం ఎంత ముఖ్యమో, అగ్రికల్చర్, హార్టికల్చర్ కూడా అంతే ముఖ్యం. మా ప్రభుత్వం మీ ప్రయాణంలో ఒక ఉత్ప్రేరకంగా పనిచేయగలదు.

**ఎంఓయులపై కాదు..అమలుపైనే దృష్టి :** నేను ఇప్పుడు చెప్పబోయే ఉదాహరణలు కేవలం ఎంఓయులు లేదా కాగితాలపై ఉన్న హామీలు కాదు. వాస్తవంగా అమలు జరుగుతున్న ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నాను. మా ముఖ్యమంత్రికి ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచ హార్టికల్చర్ హబ్‌గా మార్చాలనే విజన్ ఉంది. ఆయన ముఖేష్ అంబానీ గారిని ఒప్పించి రాయలసీమలోని మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (×ూూ) ఏర్పాటు చేయించారు. నిన్న దానికి శంకుస్థాపన చేశాం. ఇది హార్టికల్చర్ ఎకోసిస్టమ్‌లో దాదాపు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను సాధిస్తుంది. పరిశోధన నుంచి ప్రాసెసింగ్ వరకు, మెకనైజేషన్ నుంచి వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి అందించడం వరకు, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం వరకు మొత్తం వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం. రెండవది స్టీల్ రంగం. గతంలో మనకు కేవలం రెండు స్టీల్ ప్లాంట్లు మాత్రమే ఉండేవి. ఇటీవల ఆర్సెలర్ మిట్టల్ 17 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు పునాది వేశాం. ఇతర రాష్ట్రాల్లో దాదాపు ఒక దశాబ్దం పాటు నిలిచిపోయిన ప్రాజెక్ట్ ఇది. నేను ఆదిత్య మిట్టల్‌తో మొదటి జూమ్ కాల్ చేసినప్పటి నుంచి పునాది వేసే దశకు పర్యావరణ అనుమతులతో సహా చేరుకోవడానికి కేవలం 17 నెలలు పట్టింది. ఇదే మా వేగానికి నిదర్శనం.

**ఏపీని ప్రపంచపటంలో నిలిపిన గూగుల్ :** మూడోది డేటా సెంటర్ ఎకోసిస్టమ్. విశాఖపట్నంలో '+' అంటే గూగుల్ లోగో గుర్తొచ్చే స్థాయిలో అది విశాఖను ప్రపంచ పటంలో నిలబెట్టింది. గూగుల్ తో మొదటిసారి మాట్లాడినప్పుడు రెగ్యులేటరీ క్లారిటీ, పర్మినెంట్ ఎస్టాబిష్‌మెంట్, ట్యాక్సేషన్ వంటి అంశాలపై వారికి కొన్ని ప్రత్యేక విధానాలు అవసరమయ్యాయి. మేము కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ గారితో మాట్లాడి స్పష్టత తీసుకువచ్చాం. అలా కేవలం 13 నెలల్లో గూగుల్ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్‌లో పునాది పడింది. మీరంతా నమో అంటే నరేంద్ర మోడీ అని అనుకుంటారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నమో అంటే నాయుడు జీ, మోదీజీ జోడి. ఎందుకంటే ఇక్కడ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉంది. అందుకే ఇక్కడ పనులు వేగంగా జరుగుతున్నాయి.

**ప్రపంచానికి దిశానిర్దేశం స్థాయిలో ఎకోసిస్టమ్ :** ఈరోజు మనం స్కైరూట్ గురించి మాట్లాడుతున్నాం. కానీ ఒక సంవత్సరం క్రితం చాలా మందికి ఆ ప్రాజెక్టు గురించి తెలియదు. మేం ఒక సంవత్సరం క్రితం వారిని సంప్రదించాం. కేబినెట్ ద్వారా వారికి 300 ఎకరాల భూమిని కేటాయించాం. దేశంలో ఎవరూ ఊహించని ధరకు భూమిని అందించాం. ఈ స్టార్టప్‌పై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నా కేబినెట్ సహచరులను ఒప్పించడానికి నాకు 30 నిమిషాలు పట్టింది. ఇలాంటి ధైర్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం. క్వాంటం విషయంలో కూడా ఇదే విధమైన కృషి జరుగుతోంది. కామకోటి నాయకత్వంలో మేము అద్భుతమైన పురోగతి సాధిస్తున్నాం. క్వాంటం రంగంలో భారత్‌కే కాదు, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయిలో ఎకోసిస్టమ్‌ను నిర్మించబోతున్నాం.

**మా నిబద్ధతక నిదర్శనం సాగర్ డిఫెన్స్ :** టెక్స్‌టైల్, షిప్‌బిల్డింగ్, డిఫెన్స్ వంటి రంగాల్లో కూడా భారీ అవకాశాలు ఉన్నాయి. మజగాన్ డాక్, గోవా షిప్ యార్డు వంటి సంస్థలు ఇక్కడ షిప్‌బిల్డింగ్ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయి. సాగర్ డిఫెన్స్ అనే ఆసక్తికరమైన సంస్థ ఉంది. వారు మారిటైమ్ డ్రోన్స్ తయారు చేస్తున్నారు. వారికి నీటికి అనుసంధానమైన స్థలం కావాలి. ఒక ఫిషింగ్ హార్బర్‌లో 150 మీటర్ల ప్రాంతాన్ని వారికి కేటాయించాం. వారు మా దగ్గరకు వచ్చినప్పుడు వారి విలువ దాదాపు రూ.3,000 కోట్లు. ఈరోజు ఆ సంస్థ విలువ రూ.23,000 కోట్లకు చేరుకుంది. ఇదంతా కేవలం 18 నెలల్లో జరిగింది. ఇదే మీ ప్రయాణంలో ప్రభుత్వం తీసుకురాగల మార్పు. ఇదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబద్ధత. మేము మీ ప్రయాణంలో సంధానకర్తగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం.

**వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్‌కు ప్రాధాన్యత :** మేం వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ కు ప్రాధాన్యత ఇస్తున్నాం. వర్టికల్ అంటే ఒక క్లస్టర్‌లోని మొత్తం కంపెనీలను ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడం. మొబైల్ ఫోన్ లో కెమెరా తయారు చేసే కంపెనీ నుంచి గ్లాస్, కేసింగ్, బ్యాటరీ, యాక్సెసరీస్ వరకు మొత్తం సరఫరా వ్యవస్థ ఒకే క్లస్టర్‌లో ఉండాలి. హారిజాంటల్‌లో నా మంత్రిత్వ శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. అది కేవలం ఐటి మాత్రమే కాదు. హెచ్ ఆర్ డి కూడా నా దగ్గర ఉంది. హెచ్‌ఆర్‌డి శాఖ ద్వారా పరిశ్రమలతో కలసి పనిచేస్తూ... కరిక్యులమ్ చేంజెస్, టెస్టింగ్ ఎకోసిస్టమ్, రీసెర్చిపై దృష్టి పెడుతున్నాం. ఐఐటి తిరుపతి ద్వారా యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ తో కలసి ర్యాపిడ్ ప్రోటోటైపింగ్ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని నేను కోరుతున్నాను. యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ సౌరశక్తి రంగంలో దాదాపు 90 శాతం పేటెంట్లకు సంబంధించి కీలక పాత్ర పోషించింది. ఐఐటి తిరుపతిలో మొత్తం రీసెర్చి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. ప్రైవేట్ రంగాన్ని, ఐఐటి తిరుపతిని ఒకచోటికి తీసుకువచ్చి రీసెర్చిపై దృష్టి పెడుతున్నాం. ఇలాంటి విధానాన్ని 23 క్లస్టర్లలో అమలు చేస్తాం, అందుకే మీరు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవాలి. విద్యుత్ వినియోగం విషయంలో కూడా మాకు భారీ సవాళ్లు ఉన్నాయి. అన్ని కంపెనీలు వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించక ముందే మన విద్యుత్ వినియోగ వృద్ధి రేటు సంవత్సరానికి 30 శాతానికి పైగా ఉంది. అందువల్ల గ్రిడ్‌ను నిర్వహించడం చాలా సవాలుగా మారుతోంది. అన్ని కంపెనీలు కమర్షియల్ ప్రొడక్షన్‌కు వెళ్లబోతున్నందున మేము మరింత కష్టపడి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ తనదైన ప్రయాణంలో ముందుకు సాగుతోంది. ఈ ప్రయాణంలో ఐఐటిల నుంచి మార్గదర్శకత్వం పొందడం మాకు ఎంతో ఆనందంగా ఉంది.

**క్లస్టర్ల అభివృద్ధిలో మార్గదర్శకత్వం వహించండి :** నాకు రెండు ప్రత్యేక అభ్యర్థనలు ఉన్నాయి. ఇవి ఇప్పటికే వేదికపై ఉన్న నాయకత్వంతో కూడా పంచుకున్నాను. మొదటిది --- ప్రపంచాన్ని జయించిన మీ గ్రాడ్యుయేట్లు. విద్య నుంచి వ్యవసాయం, హార్టికల్చర్ నుంచి క్వాంటం వరకు అనేక రంగాల్లో వారు అద్భుతమైన విజయాలు సాధించారు. ఈ 23 క్లస్టర్ల కోసం వారితో కలిసి లోతైన, అర్థవంతమైన పరిజ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్ని పొందాలని కోరుకుంటున్నాను. మీ పరిచయాలను మరింత విస్తృతంగా ఉపయోగించండి. ముఖ్యమైన వ్యక్తుల సంప్రదింపు వివరాలను మాతో పంచుకోండి. నేను వ్యక్తిగతంగా కూడా వారిని సంప్రదించి, 23 క్లస్టర్లు దిశానిర్దేశం చేసేలా కృషి చేస్తాను. రెండోది విజిబుల్ గవర్నెన్స్, ఇన్విజిబుల్ గవర్నమెంట్. ూా× యుగంలో ఎంతో చేయగలం. గత రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రయాణాన్ని చూస్తే, మొదట స్పీడ్ ను మా మంత్రంగా తీసుకున్నాం. తర్వాత జుగాడ్ మోడల్‌కు వెళ్లాం. కానీ ఇప్పుడు ప్రతి అంశాన్ని వ్యవస్థీకృతం చేయాలని నేను భావిస్తున్నాను. ప్రతి వ్యవస్థ కాలపరీక్షను, రాజకీయ మార్పులను తట్టుకునేలా ఉండాలి.ఈ విషయంలో మీతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాం. జుగాడ్ నుంచి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ స్పీడ్ వైపు మన ప్రయాణాన్ని కొనసాగిద్దాం. భారతదేశాన్ని గర్వపడేలా చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ మనం చేసే ప్రతి మంచి పని దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఐలాండ్ ఆఫ్ ఎక్సలెన్స్ ను నిర్మించగలిగితే, మిగతా భారతదేశం కూడా దాన్ని స్వీకరిస్తుందని నేను నమ్ముతున్నాను. అదే మన గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి లక్ష్యం కూడా.

**కలసి ప్రయాణిద్దాం... చరిత్ర సృష్టిద్దాం! :** మనమంతా కలిసి చరిత్ర సృష్టిద్దాం. మన పనితీరును పునర్నిర్వచిద్దాం. నిజం చెప్పాలంటే, ఒక యువ భారతీయుడిగా నేను ఇతర దేశాల మోడళ్ల గురించి మాట్లాడటం వల్ల విసిగిపోయాను. ఇతర దేశాల గురించి మాట్లాడటం వల్ల విసిగిపోయాను. భారత్ చేయగలదని ప్రపంచానికి చూపించాలనుకుంటున్నాను. అందుకు ఒక మోడల్ ఇక్కడే ఉంది --- అమరావతిలో, ఆంధ్రప్రదేశ్‌లో. నిన్న కొంతమంది ప్రముఖులతో నేను అమరావతిని సందర్శించాలని చెప్పాను. మీరు కూడా సమయం కేటాయించి అక్కడ జరుగుతున్న పనులను చూడండి. మీకు నిర్మాణంలో ఉన్న ఒక ఆధునిక నగరం కనిపిస్తుంది. భారతదేశం ఇంతకు ముందు చూడని ఒక నగరాన్ని నిర్మిస్తున్నాం. మనకు అత్యుత్తమ ప్లానర్లు, అత్యుత్తమ ఆర్కిటెక్టులు ఉన్నారు. మన అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు వంటి భవనాలను ప్రపంచ ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ నార్మన్ ఫాస్టర్ రూపొందిస్తున్నారు. వారి నుంచి నేర్చుకుంటూనే, భారతీయ కంపెనీలతో భాగస్వామ్యం చేయిస్తున్నాం. దీంతో నాలెడ్జి ట్రాన్స్‌ఫర్ ఇక్కడే జరుగుతుంది. మన స్వంత ప్రమాణాలను, మన స్వంత పరిశ్రమలను నిర్మించుకునేలా ఇది సహాయపడుతుంది. మీకు సమయం దొరికినప్పుడు అమరావతిని తప్పకుండా సందర్శించండి. ప్రతి 100 రోజులకు ఒకసారి మీరు అమరావతిలో జరుగుతున్న మార్పును చూడగలుగుతారు. ఇది జరుగుతున్న వేగం నిజంగా అద్భుతంగా ఉంది. నిన్న మా జ=ణూ కమిషనర్ నాకు ఒక మెసేజ్ పంపారు. "సార్, గత నెలలో మేము కొత్త రికార్డు సృష్టించాం" అని చెప్పారు. వచ్చే నెలలో ఆ రికార్డును కూడా అధిగమిద్దాం. ఇదే ఉత్సాహంతో మేమంతా పనిచేస్తున్నాం. భారతదేశం గర్వపడే స్థాయిలో ప్రమాణాలను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

**అమరావతిలో 5వేల ఎకరాల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు! :** ఎయిర్ పోర్టులు అభివృద్ధి ప్రయాణంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని మేము నమ్ముతున్నాం. అమరావతిలో మీరు చూడబోయేది 5,000 ఎకరాల్లో నిర్మించబోయే గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్. హైదరాబాద్ అభివృద్ధిలో హైదరాబాద్ విమానాశ్రయం పోషించిన పాత్రలాగే ఇది కూడా అమరావతి అభివృద్ధిలో కీలకంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి విమానాశ్రయాన్ని నిర్మించాలనుకుంటున్నాం. చంద్రబాబు గారిని విజనరీ అని ఎందుకు పిలుస్తారో ఒక కారణం ఉంది. హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నప్పుడు 5,000 ఎకరాలు ఎందుకు కావాలని ప్రజలు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్ విమానాశ్రయాన్ని సందర్శించినవారికి ఆయన అప్పట్లో తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యత అర్థమవుతుంది. తెలంగాణ, హైదరాబాద్‌కు ఆయన అందించిన ఆ దూరదృష్టి ఇదే. అదే తరహా మేజిక్‌ను విశాఖపట్నంలోని భోగాపురం విమానాశ్రయంలో కూడా మేము చేస్తున్నాం. ఇటీవల నిర్మితమవుతున్న అత్యంత అందమైన విమానాశ్రయాల్లో ఇది ఒకటి. అమరావతిలో అంతకంటే మెరుగైనదాన్ని నిర్మిస్తాం. మాకు మార్గదర్శకత్వం అందించండి. మేము నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. మమ్మల్ని మెరుగుపరుచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అమరావతిని ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి హబ్ గా తీర్చిదిద్దే దిశగా కూడా మేము ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే ఇక్కడ దీ×ూతో సహా ఆరు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి.క్వాంటమ్ చుట్టూ కూడా మొత్తం ఎకోసిస్టమ్ నిర్మిస్తున్నాం. విద్య, పరిశోధన రంగాల్లో మనం చేస్తున్న పని చాలా ఆసక్తికరంగా ఉంది. ఇక్కడ ఉన్న భాగస్వాములందరితో మాట్లాడేందుకు నేను ఎదురుచూస్తున్నాను. వేదికపై ఉన్న ప్రతి ఆలోచనాపరుడి సహాయం నాకు అవసరం. వచ్చే దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని సాధించడానికి మీ మార్గదర్శకత్వం అవసరమని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## సామాన్య భక్తులే కేంద్రంగా ఉత్సవాల ఏర్పాట్లు

సీతమ్మవారి పాదాలు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్లి ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించారు. భక్తులకు భద్రత, సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం కొండపై నలుగురూ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వినూత్న కార్యాచరణ రూపొందించామని, భక్తుల రాకపోకలు, దర్శనం, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్నిఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా జరగనుందని.. ఈ మేళాకు గౌరవ రాష్ట్రపతి కూడా రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ 2024 నుంచి టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యమిస్తూ వినూత్న ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని... ఈసారి కూడా మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్స్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గౌరవ సీఎం వారి మార్గనిర్దేశం మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తామన్నారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాట్లు చేశామని.. 3,500 మంది సిబ్బందితో బందోబస్తు ఉంటుందని.. యంగ్ అండ్ డైనమిక్ పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారన్నారు. ఈసారి క్రౌడ్ అనలిటిక్స్‌కు ప్రాధాన్యమిస్తూ నిరంతర సమగ్ర ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వీఎంసీ ధ్యానచంద్ర.. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు. ఈవో వీకే శీనా నాయక్.. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

## అమిత్‌షా తెలంగాణ పర్యటన రద్దు..

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## శ్రీసిటీలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్'లో బాయిలర్ పేలుడు

మృతుల్లో ఒక బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ సిబ్బందితో పాటు మరో ఇద్దరు కార్మికులు ఉన్నారన్నారు. మరణించిన వారిలో ఒకరు కోల్‌కతా, ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు స్థానికంగా చెర్వి, తడ ప్రాంతాలకు చెందినవారన్నారు. ?ప్రమాదంలో మరెవరికీ గాయాలు కాలేదన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వెంటనే స్పందించి, బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, సహాయ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలసి ఇతర అధికారులు ఉదయం 10:00 – 10:30 గంటల మధ్యలోనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిందని, దహన సంస్కారాల కోసం శ్రీసిటీ యజమాన్యం తగిన ఏర్పాట్లు చేస్తోందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం రాబోయే 2 రోజుల్లో అందజేయడం జరుగుతుందన్నారు. మృతుల పిల్లల ఉన్నత చదువులతో సహా అన్ని విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యమే భరిస్తుందన్నారు. అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో తక్షణమే ఉద్యోగావకాశం కల్పిస్తారన్నారు. బాధ్యులపై ప్రిలిమినరీ కేస్ నమోదు చేయడంతో పాటు బాయిలర్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్ మరియు పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విచారణ అనంతరం నిర్లక్ష్యానికి కారణమైన వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ?విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత 18 ఏళ్లలో శ్రీసిటీలో ఇటువంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారను, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో వెంటనే థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి, శ్రీ సిటీ ఎండి రవి అన్నా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మచిలీపట్నం రూరల్ మండలంలో అభివృద్ధికి పెద్దపీట**

# రూ.164 కోట్లతో 604 పంచాయతీరాజ్ పనులకు శంకుస్థాపనలు

**❖ మచిలీపట్నం నియోజకవర్గంలో వివిధ శాఖల ద్వారా రూ.330 కోట్ల అభివృద్ధి పనులు ❖ పోర్టు, షిప్‌యార్డ్, బీచ్ టూరిజంతో మచిలీపట్నం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి : మచిలీపట్నం నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా భారీగా అభివృద్ధి పనులను చేపడుతుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.శుక్రవారం మచిలీపట్నం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో మంత్రి మాట్లాడుతూ, గతంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొంత మేరకు నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

**రూ.330 కోట్లతో అభివృద్ధి పనులు**

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల ద్వారా సుమారు రూ.330 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందినట్లు మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు.మచిలీపట్నం రూరల్ మండలంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో MGNREGS, VB-G RAM G, SASCI తదితర పథకాల ద్వారా సుమారు రూ.164 కోట్లతో 604 అభివృద్ధి పనులు మంజూరు చేసి, వాటికి సంబంధించి శంకుస్థాపనలు చేపడుతున్నట్లు వివరించారు.అలాగే ఆర్అండ్‌బీ శాఖ ద్వారా సుమారు రూ.54 కోట్ల పనులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటికే సుమారు రూ.10 కోట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. మరో రూ.80 కోట్ల విలువైన పనులు ప్రభుత్వ అనుమతులతో త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

**అభివృద్ధి–సంక్షేమానికి సమతూక ప్రాధాన్యత**

అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. కొత్త పింఛన్ల కోసం ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారికి త్వరలో పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.అంగన్‌వాడీ భవనాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణాలను కూడా చేపడుతున్నాం. పెద్దపట్నం వెళ్లే దారిలో దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.20 కోట్లతో ప్రారంభించాం. పోలాటితిప్ప - గరాలదిబ్బ మధ్య రూ.15 కోట్ల వ్యయంతో గుండేరు, నడిమేరు మీద రెండు వంతెనలు నిర్మిస్తున్నాం. చిన్నాపురంలో రోడ్ల సదుపాయం కల్పించే లక్ష్యంతో రూ.1.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. ప్రజలకు మేలు జరిగే అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. భోగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి త్వరలో పింఛన్లు మంజూరు చేసే కార్యక్రమాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

**గోవా షిప్‌యార్డ్ ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు..**

మచిలీపట్నం ప్రాంతంలో భారీ పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని మంత్రి తెలిపారు. గోవా షిప్‌యార్డ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు రూ.8 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా దాదాపు 10 వేల ఉద్యోగావకాశాలు స్థానికంగా అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.ఈ ఉద్యోగాల్లో స్థానిక యువతకు అవకాశాలు లభించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందించి, రానున్న ఉపాధి అవకాశాలను స్థానిక యువత సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. షిప్‌యార్డ్‌కు అనుబంధంగా వచ్చే పరిశ్రమలను ఆకర్షించేందుకు MSME పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చిన్న, మధ్యతరహా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విషయంలో మచిలీపట్నం ప్రాంత ప్రజలకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





**వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్'కు ప్రాధాన్యత..**ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో 'వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, వారికి ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు అవసరమైన శిక్షణ, సహకారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**మార్చిలోగా మచిలీపట్నం పోర్టు ప్రారంభానికి చర్యలు..**మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులను వేగవంతం చేసి, వచ్చే సంవత్సరం మార్చిలోగా పోర్టును ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పోర్టు, షిప్‌యార్డ్, అనుబంధ పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధితో మచిలీపట్నం భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

**బీచ్ టూరిజానికి ప్రత్యేక ప్రోత్సాహం**

మచిలీపట్నం తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇటీవల నిర్వహించిన మసుల ఫెస్టివల్ విజయవంతమైందని, అలాగే 63 అడుగుల సాగర మహాగణపతి విగ్రహ ఏర్పాటు ద్వారా మచిలీపట్నం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందేలా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.బీచ్ టూరిజాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలను పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.సముద్రతీరంలో 750 ఎకరాలను గుర్తించాం. ఫలితంగా గోల్ఫ్ సంస్థ, స్టూడియో ఏర్పాటుకు ఓ సంస్థ వచ్చింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న పెట్టుబడులు, అభివృద్ధి నిధుల్లో మచిలీపట్నానికి పెద్దపీట వేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న భారీ ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధితో మచిలీపట్నం మరింత అభివృద్ధి చెంది మహానగరంగా రూపుదిద్దుకునే దిశగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

మచిలీపట్నం రూరల్ మండలంలో మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేసిన ముఖ్యమైన పనులు:- ఆర్.గొల్లపాలెం–రుద్రవరం: SASCI నిధులతో రూ.60 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం.- చిన్నాపురం–జీలిగలగండి: SASCI నిధులతో రూ.1.16 కోట్లతో రహదారి నిర్మాణం.- రుద్రవరం గ్రామ పంచాయతీ సచివాలయం: VB-G RAM G నిధులతో రూ.2.45 లక్షలతో రోడ్డు నిర్మాణం.- నెలకుర్రు–మాజేరు, నెలకుర్రు–పెదయాదర: SASCI నిధులతో రూ.2.25 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం.- భోగిరెడ్డిపల్లి–పిల్లనసాగర్: SASCI నిధులతో రూ.48 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం.- వాడపాలెం: SASCI నిధులతో సుమారు 15.2 కిలోమీటర్ల మేర BT రోడ్డు పనులకు రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన.- వాడపాలెం: VB-G RAM G నిధులతో రూ.29 లక్షల అంచనా వ్యయంతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.ఈ కార్యక్రమాల్లో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వర రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ.. విద్యకు భరోసా

**- ప్రశస్త యాప్ ద్వారా స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి**
**- ఎంఈవోలకు అవగాహన కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చిన్న వయసులోనే గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు, వసతులు కల్పిస్తూ సాధారణ పిల్లలతో సమానంగా విద్యను అభ్యసించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్య, గుర్తింపు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై జిల్లాలోని ఎంఈవో-1, ఎంఈవో-2లకు శనివారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఉపాధ్యాయులు చిన్న వయస్సులోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడంతో పాటు, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వైద్యం, పునరావాసం తదితర సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి భవిత సెంటర్‌లో సుమారు 20 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. భవిత సెంటర్ల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఐదు మున్సిపాలిటీలకు ఒక ఆటిజం సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 2,351 మందికి పైగా సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తోందని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున, బాలికలకు రూ. 2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.






# సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత**

ప్రజాభూమి ప్రతినిధి,ప్రొద్దుటూరు/కడప :

ప్రొద్దుటూరులో రూ.30 వేల కోట్ల జల జీవన్ మిషన్ నిధులతో తాగునీటి కల్పన ప్రాజెక్టును ఈ నెల 5వ తేదీన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లాలో ఉన్న అన్ని నియోజక వర్గాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలు తరలొస్తున్నారన్నారన్నారు. సీఎం,డిప్యూట సీఎం రాక నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు తరలొస్తుండడడంతో పటిష్ట బందోబస్తు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సీఎంచంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విస్తృతంగా చేపడుతోందన్నారు. రాయలసీమలో పెద్ద ఎత్తున సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రెండ్రోజుల కిందట రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్ కు శ్రీకారం చుట్టామని మంత్రి సవిత గుర్తిచేశారు. పల్లెపండుగ 3.0 పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రహదారులు నిర్మిస్తున్నామన్నారు. ప్రొద్దుటూరులో తాగునీటి కల్పనకు రూ.30 వేల కోట్ల జలజీవన్ మిషన్ నిధులు వెచ్చించనున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఈ నెల 5వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, పలువురు మంత్రులు పాల్గొనబోతున్నట్లు మంత్రి సవిత తెలిపారు. అధికారులతో సమీక్ష..అంతకుముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత నేతృత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏర్పాట్లను మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి,కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, లక్షకు పైగా ప్రజల వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో మార్గమధ్యంలో తాగునీటి ట్యాంకులు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో చల్లని గాలి వీచేలా కూలర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. అనంతరం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను మంత్రులు నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డితో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చిన్నారుల సంక్షేమమే సమాజ ప్రగతికి పునాది

**చిన్న భారంగి అంగన్వాడీ ఉత్సవంలో మాజీ ఎంపీటీసీ వంశి కుంజం**

ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

రంపచోడవరం మండలం ముసురుమిల్లి పంచాయతీ పరిధిలోని చిన్న భారంగి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ స్థాయి అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమనికి పిసా ఉపాధ్యక్షులు వికా నాగేశ్వరావు మరియు మాజీ ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం పాల్గొన్నారు.ఈ సందర్భంగా వంశి కుంజం మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా సేవలు అందించడంలో అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషణపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన ప్రసవం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.అదేవిధంగా ప్రజలకు, గ్రామానికి ఐదు సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించిన మాజీ ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజంను అంగన్వాడీ సిబ్బంది, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తనపై చూపిన ఆత్మీయతకు వంశి కుంజం కృతజ్ఞతలు తెలిపారు. "పదవి ముగిసినా ప్రజలతో నా అనుబంధం, ప్రజా సేవ పట్ల నా బాధ్యత ఎప్పటికీ కొనసాగుతుంది. ముఖ్యంగా తల్లులు, చిన్నారుల సంక్షేమం కోసం నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని వంశి కుంజం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీడీస్ సూపెర్వైసోర్ కుసుమ,ఏ ఎన్ ఏం క్షమిమా,ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీ మహిళలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# SGF స్పోర్ట్స్ మరియు గేమ్స్ లో కె. సాయి మౌనిక ఎంపిక



ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం

ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల రంపచోడవరం విద్యార్థులు SGF స్పోర్ట్స్ మరియు గేమ్స్ లో ఎంపిక కావడం జరిగింది. 30-09-2026 తేదీలో జరిగిన U -17 అథ్లెటిక్ లో SHOT PUT లో K.సాయి మౌనిక పదవ తరగతి స్టేట్ కి సెకండ్ ప్లేస్ లో సెలెక్ట్ చేయడం జరిగింది. 01-10-2026 తేదీన Wrestling (రెజిలింగ్) U - 14 విభాగంలో కర్రి శివలింగేశ్వరి 9 తరగతి స్టేట్ కి ఫస్ట్ లో సెలెక్ట్ అవ్వడం జరిగింది.1).30kgs విభాగంలో కోట్ల ఝాన్సీరాణి 7వ తరగతి.2).39kgs సోముల యామీని తేజ 7వ తరగతి. 3).40kgs విభాగంలో బుడిమల గంగోత్రి 9వ తరగతి.4).46 kgs కొడుతురు నందిని ఎనిమిదో తరగతి.5).42 kgs ఇల్లా కీర్తన 9వ తరగతి. U-17 విభాగంలో 1).53 kgs అన్నిక జాస్మిన్ 7వ తరగతి. 2).61kgs సోముల లావణ్య 9వ తరగతి. ఈ విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్న వీరిని ప్రధానోపాధ్యాయులు ఏం.ఝాన్సీ రాణి, ఉపాధ్యాయుల బృందం, పి.డి. పి .శశికాంత్ రెడ్డి, పి.డి.సురేష్, పి.డి.జి .నాగమణి అభినందించడం జరిగింది.

# వృద్ధాశ్రమాలు తగ్గాలి... ఉన్నవి బాగా వెలగాలి

**పోతుకూచి ఆంజనేయ కుమార్**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

స్థానిక చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అన్నదానం, నారాయణ సేవ మరియు ఆశ్రమ అభివృద్ధికి రూ.15,000/- చెక్కును అందించిన సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ మాట్లాడారువృద్ధాశ్రమాలు తగ్గాలి, అందుకు ప్రతి మనిషి విలువలు కలిగి ఉండాలి. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తాతలను, అమ్మమ్మలను ఉన్నంతలో చూసుకోవాలి. కొన్ని కారణాల వల్ల చూడలేని పరిస్థితిలో వారు వృద్ధాశ్రమంలో ఉంటే, ఆ ఆశ్రమాలు చక్కగా నడవాలి. దానికి ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి ప్రోత్సహించాలి" అని ఆయన పిలుపు నిచ్చారు. మాదాసు రాజ్యలక్ష్మి సంవత్సరీకాన్ని పురస్కరించుకొని ఆమె మనుమరాళ్లు సింహాద్రి పావన లక్ష్మి, కొల్లిపర సాయి మోహిని, రత్నం భరణిలు అన్నదానం, నారాయణ సేవ నిర్వహించారు.అదేవిధంగా వృద్ధాశ్రమ అభివృద్ధికి అర్జ నాగమణి, వారి కుమారుడు మోహన వంశీ రూ.15,000/- చెక్కును ఆశ్రమ నిర్వాహకురాలు కర్రెడ్ల సుశీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధాశ్రమానికి చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోట కృష్ణ ప్రసాద్, లీలా ప్రసాద్, శ్రీహరి, శ్రీనివాసులు, ఎన్. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

ఆదివారం 4 అక్టోబరు 2026


# బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి
- జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు పట్టణ బీజేపీ కార్యవర్గ సమావేశం పట్టణంలోని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత రావూరి సుధ కార్యాలయం వద్ద నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకమన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రజలకు వివరించాలని కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను పాలకొల్లు పట్టణంలో విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని అన్నారు. సమావేశంలో పట్టణంలోని వివిధ



వార్డులు, బూత్‌లలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యలపై స్పందించడం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పాలకొల్లు పట్టణంలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత విస్తరించాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో తోట గంగరాజు, రావూరి సుధ, యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్, వేరుకొండ దుర్గాప్రసాద్, నాళం బాబీ, మల్లవోలు సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు, గవర పవన్ నాయుడు, పసుపులేటి నందబాబు, బోడా సత్యజిత్, అడ్డాల మూర్తి, బెల్లపుకొండ నరసింహారావు, పడవల ఉమా శ్రీనివాస్, ముద్దాల సోమేష్, పవన్, చందాని లక్ష్మీనారాయణ, బేతిరెడ్డి మల్లికార్జున రెడ్డి, నందా అప్పలస్వామి, దూడే హరనాథ్, ఇంకొండ శేషాద్రి, ఆవెన్ జైన్, ఇస్సాకు నాగలక్ష్మి, పులఖండం శ్యామల, వసంతాల పద్మజ, కోరాడ సూరిబాబు ,సిరిగినీడి రామారావు, యడ్ల జగన్నాథం,చేగొండి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడు గురుస్వామికి రెడ్డి అప్పలనాయుడు పరామర్శ

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**



ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తడికమళ్ళ ప్రసాద్ గురుస్వామిని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన నియోజకవర్గ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు పరామర్శించారు. శాతవాహన నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. గురుస్వామి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దోనేపూడి లోవరాజు, కావూరి వాణిశ్రీ, వాసా సాయి, కొనికి మహేష్, జనసేన రవి, కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో శ్రీ ఆదిత్య విద్యార్థుల ప్రతిభ




**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి,జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ,ద్వితీయ బహుమతులు సాధించారు.కళాశాలకు చెందిన కె. శన్ముఖ్ ప్రథమ బహుమతి, ఆర్. సుకీర్తి ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నల్లమెల్లి శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్. సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా. బి.వి.ఎల్. నాయుడు, ప్రిన్సిపల్ జి. చంద్రరావు, వైస్ ప్రిన్సిపల్ వి.సుభాష్ రావు,అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ద

## వినాయక చవితి అన్నదాన కార్యక్రమం

-కుండీ బొమ్మ సెంటర్‌లో 10 వేల మందికి భారీ అన్నదానం



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

కుండీ బొమ్మ సెంటర్‌లో హేలాపురి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా 10 వేల మందికి పైగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదానం మహాదానమని, సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. 20వ వార్షికోత్సవంలో భాగంగా అన్నదానాన్ని ఏర్పాటు చేసిన హేలాపురి ఉత్సవ కమిటీ సభ్యులను రెడ్డి అప్పలనాయుడు అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంప చల్లారావు, గాది రాంబాబు,గొర్రెల సతీష్,గల్లా రామకృష్ణ, రాయు మల్లికార్జున్ తదితరులు,జనసేన నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## 7న విజయవాడలో దేవాలయ భూముల కౌలు రైతుల రాష్ట్ర సదస్సు.

**ప్రజాభూమి బ్యూరో -ఏలూరు జిల్లా.**

ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని రాఘవయ్య పార్క్ వద్ద గల ఎం.బి విజ్ఞాన కేంద్రంలో దేవాలయ భూముల కౌలు రైతుల రాష్ట్ర సదస్సు జరుగుతున్నదని, ఈ సదస్సుకు దేవాలయ కౌలు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాలయ భూముల కౌలు రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వ్యవసాయం గిట్టుబాటు కాక పెరిగిన కౌలు రేట్లు, ఎరువులు, పురుగు మందుల ధరలు దారుణంగా పెరిగిపోయి సాగు భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయ భూములు సాగు చేసే కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వడ్డీ లేని పంట రుణాలు, పంటల బీమా పరి హారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందస్తు కౌలు కాకుండా పంట వచ్చిన తర్వాత కౌలు తీసుకోవాలని కోరారు. దేవాలయ భూముల కౌలు రైతుల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించిన జరుగుతుందని, ఈ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

## చదువుతోనే పేదరికం దూరం: ఎమ్మెల్యే చింతమనేని



**ప్రజా భూమి ప్రతినిధి-దెందులూరు**

పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి ఉన్నత విద్య అందించినప్పుడే పేదరికం దూరమవుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం సూర్యారావుపేట ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ట్రేస్ ఇండియా, టుగెదర్-ఇండియన్ ఆధ్వర్యంలో 41 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు,బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రేస్ ఇండియా వ్యవస్థాపకులు డాక్టర్ దిడ్ల ఆంజిలోతో కలిసి ఎమ్మెల్యే 26 కేజీల బియ్యం బస్తాలు, ఐదు రకాల నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. తల్లిదండ్రులు పిల్లలను పనులకు, యాచనకు పంపకుండా చదివించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి రూ.1.50 లక్షలు: సూర్యారావుపేట పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.1.50 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. పనులను త్వరితగతిన ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పోషకాహారంతో రక్తహీనత నివారణ సాధ్యం

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



నెక్కలం గొల్లగూడెం గ్రామంలోని అంగన్వాడీ-2 కేంద్రంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జి. రాగమయి అధ్యక్షతన అంగన్వాడీ ఉత్సవం, సేవా సంకల్ప అభియాన్, పోషణ మాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగమయి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరిస్తూ చిన్నారుల ఎదుగుదలలో సమస్యలను ముందుగానే గుర్తించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సంబంధిత లబ్ధిదారులే వినియోగించుకోవాలని, తద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ మాట్లాడుతూ మునగాకు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రాధాన్యతను, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు అందిస్తున్న సేవలను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బి. అంజలి, నూజివీడు అర్బన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ రాధాకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగం వలన అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన.



**ప్రజా భూమి ప్రతినిధి-చాట్రాయి.**

చాట్రాయి మండలం, మర్లపాలెం గ్రామం లో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను గురించి, సైబర్ నేరాలు - సోషల్ మీడియా,పోక్సో చట్టం బాల్య వివాహాలు పోలీస్ అవగాహన సదస్సును శనివారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది.ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల పై, నూజివీడు డీఎస్పీ ప్రసాద్ నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ కార్యక్రమాము లో చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ , ఇతర పోలీస్ సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులకు పలు కీలకమైన అంశాలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం మానసిక, శారీరక నష్టాలు , చట్టపరమైన పరిణామాలు అతి వేగముగా వాహనాల నడపడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్ డ్రైవింగ్ పై చట్టపరమైన నిషేధం,పోక్సో చట్టం పరిధిలో చిన్నారుల రక్షణకు చట్టాలు,, సైబర్ నేరాలు సోషల్ మీడియా, ఫోన్ స్కామ్స్, ఫిషింగ్ మెసేజెస్ నుంచి జాగ్రత్తలు, బాల్య వివాహాలు పై చట్ట నిబంధనల అవగాహన,ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో న్యాయ అవగాహన, సామాజిక బాధ్యత పట్ల చైతన్యం పెరిగేలా సూచనలు సలహాలు ఇచ్చిన పోలీస్ అధికారులు విద్యార్థులకు భద్రతా పరంగా మీరే ముందు జాగ్రత్త వహించాలి. సమస్యలు ఎదురైతే వెంటనే 112 లేదా శక్తి యాప్ ద్వారా పోలీసులను సంప్రదించండి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మర్లపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిజిక్స్ విద్యార్థులకు కెరీర్ అవకాశాలపై అవగాహన

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు.**



స్థానిక సర్ సి.ఆర్.రెడ్డి మహిళా కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం,ఐక్యూఏసీ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రం మెజర్ చదువుతున్న విద్యార్థినులకు "ఫిజిక్స్ టు ప్రొఫెషన్: ఎక్స్‌ప్లోరింగ్ కెరీర్ అవకాశాలు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.దుర్గారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ఫిజిక్స్ టూ ప్రొఫెషన్ " ద్వారా భౌతిక శాస్త్రంలో చదివిన జ్ఞానాన్ని వివిధ ఉద్యోగ, ఉన్నత విద్యా అవకాశాలకు ఎలా అన్వయించుకోవచ్చో వివరించారు. ఉన్నత విద్యతో పాటు బోధనా రంగం,పరిశోధన, విద్యా సంస్థలు,శాస్త్రీయ సంస్థల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే స్పేస్, ఆస్ట్రానమీ రంగాల్లో ఫిజిక్స్ విద్యార్థులు స్పేస్ సైన్స్ , ఆస్ట్రానమీ, అస్ట్రోఫిజిక్స్ వంటి విభాగాల్లో కెరీర్ చేయవచ్చన్నారు. పోటీ పరీక్షల ద్వారా ప్రభుత్వ రంగంలోనూ అవకాశాలు పొందవచ్చని వివరించారు. అలాగే శాస్త్రీయ,సాంకేతిక సంస్థల్లో సంబంధిత పోస్టులకు అర్హత సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కిలారు ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ జి.నిర్మల పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారం కోసం ఐక్యంగా పనిచేయాలి

- రాబోయే తరాలదే బహుజన రాజ్యాధికారం
- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**



బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా పనిచేస్తే రాబోయే రోజుల్లో బహుజన రాజ్యాధికారం సాధించవచ్చని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. ఏలూరులోని డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అధ్యక్షతన బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీల ఆత్మీయ సదస్సు శుక్రవారం జరిగింది. సదస్సు ప్రారంభానికి ముందు మహాత్మా ఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మాన్యశ్రీ కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోషేన్ రాజు మాట్లాడుతూ చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి బహుజన కులాలన్నీ ఐక్యంగా ఉండాలని, భావితరాల భవిష్యత్తు కోసం పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి రాజకీయంగా ఎదగాలని,అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళిత బహుజనుల కోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని,గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సదస్సుకు బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆత్మీయ విందు నిర్వహించారు.

# వాడపాలెంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

**ముఖ్య అతిథులుగా బండారు కమలారాణి, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్.**

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. సేవా సంకల్ప అభియాన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజా సేవ పూర్తి చేసుకొన్న సందర్భంగా వాడపాలెం కాపు కళ్యాణ మండపంలో శనివారం కొత్తపేట ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడి ఉత్సవ్, పోషణ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సతీమణి కమలారాణి, కొత్తపేట జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలు పాటించడంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. తల్లి, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. తృణధాన్యాలు, ఆకుకూరలు, పౌష్టికాహార వంటకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో



ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేదిరేశ్వరంలో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

**గర్భిణులకు సామూహిక సీమంతాలు, అంగన్వాడీ సిబ్బందికి సన్మానం.**

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా వేదిరేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఏ. గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కే. నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని



గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, రాగిజావ వంటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగుపడి, శిశువుల ఎముకలు బలపడతాయని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలూరి సత్యానందం మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలు అభినంద నీయమని, ప్రజలు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ల్యాం ప్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ భావితరం ఆరోగ్యంగా ఎదగాలంటే బలమైన యువత అవసరమని, ఐసీడీఎస్ ద్వారా ఆ దిశగా కృషి జరుగుతోందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నా రు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల సేవలను గుర్తిస్తూ ఆత్మ కమిటీ డైరెక్టర్ మద్దంశెట్టి శ్రీనివాసరావు వారి ని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పం చాయతీ కార్యదర్శి సబిత, టీడీపీ నాయకు డు రామకృష్ణంరాజు, రాష్ట్ర యువమోర్చా నాయ కుడు పాలూరి జయప్రకాశ్ నారాయణ, జిల్లా సంచార జాతుల కన్వీనర్ వీర్నాల రమణ, లక్ష్మీనారాయణ, ఉమెన్ పోలీస్ ఎన్. నాగర త్నం, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ వేడుకలో వృద్ధ దంపతులకు షష్టిపూర్తి

## దగ్గరుండి జరిపించిన మంత్రి నిమ్మల ఆత్మీయత.



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

ఉపాధి హామీ పనులతో పల్లె అభివృద్ధికి చెమటోడ్చే శ్రామికుల ఆనంద వేడుకలకు సైతం మంత్రి నిమ్మల రామానాయుడు అండగా నిలిచారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శ్రామికులకు నిర్వహిస్తున్న ఆత్మీయ భోజన కార్యక్రమాల్లో భాగంగా శనివారం పాలకొల్లు మండలం లంకలకోడేరులో నిర్వహించిన కార్యక్రమం ఓ వృద్ధ పుణ్య దంపతుల షష్టిపూర్తి మహోత్సవానికి వేదికగా మారింది. శ్రామికుల కష్టాన్ని గుర్తించడమే కాదు.. వారి ఇంటి శుభకార్యాన్నీ తన ఇంటి వేడుకగా భావించిన మంత్రి నిమ్మల రామానాయుడు దగ్గరుండి షష్టిపూర్తి వేడుక నిర్వహించి దంపతులను ఆశీర్వదించారు. ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న శ్రామికులతో ఆత్మీయంగా మమేకం కావడంతో పాటు, వారి కుటుంబాల్లో జరిగే ముఖ్యమైన శుభకార్యాలను కూడా తన కుటుంబ కార్యక్రమాలుగా భావించి నిర్వహించాలనే ఉద్దేశంతో మంత్రి నిమ్మల రామానాయుడు ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన గోడి రామారావు, సత్యవతి వృద్ధ దంపతులకు షష్టిపూర్తి వేడుకను సాంప్రదాయ పద్ధతిలో పెళ్లి వేడుకగా మంత్రాల మధ్య ఆకులు, కూరగాయలతో కూడిన దండలు మార్చుకోవడం, తలంబ్రాలు, ఆకాశంలో నక్షత్రం చూడడం వంటివి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి జరిపించిన మంత్రి నిమ్మల నూతన వస్త్రాలు అందజేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దంపతులు కూడా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితంలో ఎంతో ప్రత్యేకమైన షష్టిపూర్తి వేడుకను మంత్రి దగ్గరుండి నిర్వహించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ వృద్ధ దంపతులను ఆశీర్వదించి నగదును అందజేశారు. పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ శ్రామికమహిళలు, గ్రామస్తులు ప్రోత్సాహాల మధ్య ఈ కార్యక్రమం నడిచింది. అనంతరం ఉపాధి హామీ శ్రామికులతో మంత్రి నిమ్మల రామానాయుడు ఆత్మీయంగా మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులు, పిల్లల చదువులు, గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పనిచేసే శ్రామికుల చెంతకు వెళ్లి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే నిజమైన ప్రజాసేవ అని మంత్రి పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది కుటుంబాలకు ఉపాధి లభిస్తోందని, ఎండా, వానలను లెక్కచేయకుండా శ్రామికులు చేస్తున్న కృషి గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. శ్రామికుల కష్టానికి గుర్తింపు ఇవ్వడంతో పాటు, వారి కుటుంబాల్లో ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆత్మీయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి వారికి చీరలను అందజేశారు. అనంతరం ఉపాధి హామీ శ్రామికులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ భోజనం చేశారు. ఉపాధి హామీ శ్రామికులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడటం, వారి జీవితంలోని ముఖ్యమైన వేడుకల్లో భాగస్వామి కావడంతో కార్యక్రమానికి హాజరైన శ్రామికుల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రజాప్రతినిధి అంటే కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా ప్రజల సంతోషంలోనూ, కష్టాల్లోనూ భాగస్వామి కావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, పెనుమత్స వెంకట సూర్య నారాయణ రాజు, పెనుమత్స సత్యనారాయణ,రాజు ఎంఈఓ వీరాస్వామి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాముల రజిని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు,పితల శ్రీను నే క్కంటి ఆదినారాయణ , నే క్కంటి దుర్గారావు, ఇంటి శ్రీరాముడు అందెకోటి వీరభద్రరావు, సాగ సత్యనారాయణ , బిఎస్ఎన్ఎల్ రాజు, ఆకుల బ్రహ్మాజీ, ఆదూరి శ్రీనివాసరావు, నల్లమోతు సత్యప్రసాద్ కునపు రెడ్డి బాబు, సేవాసాధికార బూత్ కన్వీనర్స్, గ్రామ ప్రజలు తదితర నాయకులు పాల్గొన్నారు. కూటమి నాయకులు, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు, శ్రామికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## హ్యాండ్‌బాల్‌లో ఆగిరిపల్లి విద్యార్థుల ప్రతిభ

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

విజయవాడలోని పటమట కేబీసీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆగిరిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆగిరిపల్లి ఉన్నత పాఠశాల నుంచి ఈ పోటీల్లో మొట్టమొదటి సారిగా విద్యార్థులు పాల్గొనడం విశేషం. పాఠశాల నుంచి 23 మంది విద్యార్థులు పాల్గొనగా, కే. లికేష్, ఎన్. నందిని, ఎస్‌కే. జోయా అన్వర్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు శివ నాగేంద్రరావు, సుగుణరావు, సాయి కిషోర్‌లను గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు పులి పుష్పలత, ఉపాధ్యాయులు అభినందించారు.

## రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్

# జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశం



ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.

జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో శనివారం రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాలు, పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్లు, ఐవిఆర్ ఎస్ కాల్స్, స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు సచివాలయాలు, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, తదితర రెవిన్యూ పరమైన అంశాలుపై " రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్" జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి రెవెన్యూ అధికారి యం.ముక్కంటి, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న లు పాల్గొన్నారు. ఒక్కొక్క అంశం మీద మండలాలు వారీగా సుదీర్ఘంగా సమీక్షించి, ప్రగతి సాధించ లేకపోయిన అధికారులు వివరణలుపై జిల్లా కలెక్టరు అసహనం వ్యక్తం చేశారు. ఒక్కొక్క అంశానికి టార్గెట్స్ పెట్టి, పది రోజుల్లోగా ప్రగతిని చూపించాలని అన్నారు. ఇకనుండి మూడు నెలలకు ఒక్కసారి రెవెన్యూ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేసి ఒక కాఫీని అందించాలని తహశీల్దార్లను ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాలు, పిజిఆర్ఎస్, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని, అందుకు అనుగుణంగా లక్ష్యాలు సాధించుటలో అధికారులు సమన్మ యంతో, సమర్థవంతంగా పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌరసేవలు అందించుట లో మనస్సుపెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. అలసత్వం, నిర్లక్ష్యం వహించే అధికారులకు చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాదాలకు తావులేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు రూపొందించాలని, అర్హులు అయిన వారందరికీ అందజేయ్యాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్. దేవకీదేవి, ఆర్డీవోలు కె.లక్ష్మీప్రసన్న, యం.వి. రమణ, సర్వే సహాయ సంచాలకులు అన్సారీ, తహశీల్దార్లు, డివిజనల్, మండల సర్వేయర్లు, జిల్లా కలెక్టరేటు వివిధ విభాగాలు సూపర్డెండులు, తదితరులు పాల్గొన్నారు.

# రెన్యువల్ కాని మద్యం దుకాణానికి దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ముసునూరు మండలంలో రెన్యువల్ కాని గెజిట్ సీరియల్ నంబర్ 93 మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ గడువును అక్టోబర్ 6వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటల వరకు పొడిగించినట్లు నూజివీడు ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య తెలిపారు. సదరు మద్యం దుకాణానికి లాటరీ పద్ధతిలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి లైసెన్స్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం నూజివీడు ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు సదరు మద్యం దుకాణానికి సంబంధించి మొత్తం 14 దరఖాస్తులు అందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఒక్కో దరఖాస్తుకు రూ.3,00,000 దరఖాస్తు రుసుము, రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మొత్తాలను డిమాండ్ డ్రాఫ్ట్, చలాన్ లేదా ద్వారా చెల్లించవచ్చని, ఒకే అభ్యర్థి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చని వివరించారు. సదరు మద్యం దుకాణానికి వార్షిక లైసెన్స్ రుసుము రూ.71.50 లక్షలు, పర్మిట్ రూమ్ రుసుము రూ.7.50 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 6వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య సూచించారు.

# శ్రీ విజయ డయాగ్నస్టిక్ ల్యాబ్ అధినేత మురళీకృష్ణకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

## సీఎం చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరణ



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు శ్రీ విజయ డయాగ్నస్టిక్ మెడికల్ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ కు స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నట్లు మురళీకృష్ణ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత 30 సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది అని తెలిపారు. తన సేవా కార్యక్రమాలకు ఏపీ రాష్ట్ర మంత్రి స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తనకు స్ఫూర్తి అని, ఆయన స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యత పెరిగిందని మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. గతంలో తాను రెండుసార్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా కూడా సేవ పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు. లయన్స్ సేవా కార్యక్రమాలు కారణంగా ఎన్నో పుర స్కారాలు వచ్చాయని తెలిపారు. తన ల్యాబ్ కు సెంట్రల్ గవర్నమెంట్ గుర్తింపు ఎన్ ఏ బి ఎల్ కూడా లభించిందని తెలిపారు. త్వరలోనే క్యాన్సర్ రోగాల బారిన పడకుండా ముందుగా గుర్తించి స్త్రీపురుషులకు సేవా కార్యక్రమాలు అందించేందుకు అమ్మ సేవా ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలు విజయ దశమి నుంచి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేసినందుకు మంత్రి నిమ్మలకు, సీఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# పోలవరంలో అంగనవాడి ఉత్సవం

ప్రజాభూమి ప్రతినిధి–చాట్రాయి.

చాట్రాయి మండలంలోని పోలవరం గ్రామంలోని అంగనవాడి మెయిన్ కేంద్రంలో శనివారం అంగనవాడి పోషణ మాసం, అంగనవాడి ఉత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పి గాయత్రీ దేవి పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీ స్త్రీలకు ,పిల్ల తల్లులకు పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. అంగనవాడి పోషణ మాసం అంగనవాడి ఉత్సవం ఈ నెల ఎనిమిదవ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పలు ఆహార పదార్థాలను స్టాల్ పెట్టి వివరించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి గాయత్రీ దేవి , బిజెపిపార్టీ నాయకులు చాగంటి వాసుదేవ్ ,గడ్డం సంజీవరెడ్డి ,తెలుగుదేశం పార్టీ నాయకులు ఎర్ర ప్రసాదరావు ,అంగన్వాడీ కార్యకర్తలు ఏ జ్యోతి , శ్రీ.ఎం. రాజేశ్వరి కే సరోజినీ బాయ్, ఏఎన్ఎం , అంగన్వాడి సహాయకులు, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు ,బాలింతలు ,పిల్లలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం.



ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయగూడెం

స్థానిక సంస్థల ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని బూసరాజుపల్లి లో ఉన్న పోలవరంనియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై అత్యవసర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన విధానాలను వివరించారు. గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌ను మరింత క్రియాశీలకం చేయడంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మండలం పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, సీనియర్ నేతలు మంగిన వెంకటరమణ, పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ,అధికార ప్రతినిధి జారం చాందిని, తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూసేవలో ఉత్తమ ప్రతిభకు 'బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డులు.



ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శనివారం ప్రజా సమస్యలు పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి చేర్చడం, ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను అమలను నిబద్ధతతో పనిచేసిన అధికారులకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డులను అందజేశారు. వీరికి జ్ఞాపికలు ఇచ్చి, శాలువాలను కప్పి జిల్లా కలెక్టరు ఘనంగా సన్మానించారు. "బెస్ట్ పెర్ఫార్మెన్స్"అవార్డులు పొందిన వారు1, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, 2, ఏలూరు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న 3, జంగారెడ్డిగూడెం ఆర్డీవో యం.వి.రమణ, తహశీల్దార్లు భీమడోలు బి.రమాదేవి, చాట్రాయి జి.స్వాతి, ఉంగుటూరు యం.సన్యాసిరావు, నూజివీడు షేక్ సంసిద్దీన్, లింగపాలెం మండలం డిప్యూటీ తహశీల్దారు స్రవంతిలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, ప్రభుత్వ లక్ష్యాలను అమలు చేసి బాధ్యతాయుతమైన పనితీరును కనబరిచే వారికి ఎల్లప్పుడూ సరైన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా అధికారులు, ఉద్యోగులు పనిచేయ్యాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టరు యల్.దేవకీదేవి, సర్వే సహాయం సహాయ సంచాలకులు అన్సారీ, తహశీల్దార్లు, డివిజన్, మండల సర్వేయర్లు, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు పాల్గొన్నారు.

## పాత ముప్పర్రు పాఠశాలలో ఐ లవ్ యు పోలీస్.

ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు



ఏలూరు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదవేగి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. రాజశేఖర్, పెదపాడు ఎస్.ఐ. ఆర్. శ్రీను పెదపాడు మండలం పాత ముప్పర్రు గ్రామ పాఠశాల లో "ఐ లవ్ యూ పోలీస్" వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించడం మరియు పోలీసుల పట్ల సదభిప్రాయం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం తెలిపారు. ఈ సందర్భంగా పెదవేగి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. రాజశేఖర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాస దశ నుండే ప్రాథమిక చట్టాలు, మంచి–చెడుల స్పృహ కలిగి ఉండాలని సూచించారు. సమాజంలో నేరాలకు దూరంగా ఉంటూ, మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఎలాంటి భయం లేకుండా పోలీసులు ఎప్పుడూ విద్యార్థులకు రక్షణగా ఉంటారని భరోసానిచ్చారు. పాఠశాల విద్యా ర్థులకు ఆపద సమయంలో లేదా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందేందుకు ఉపయోగపడే కీలక టోల్–ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే కాకుండా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, సామాజిక అవగాహన కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు గ్రామస్థుల నుంచి, ఉపాధ్యాయుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంటున్నాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీవై పార్టీ సర్వసన్నద్ధం



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో బీసీవై పార్టీ తరఫున పోటీ చేసేందు కు సర్వసన్నద్ధంగా ఉన్నామని ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లా బీసీవై పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి యాదవ్ తెలిపారు. ఏలూరు నగరంలోని లేడీస్ క్లబ్ ఆవరణలో శుక్రవారం బీసీవై పార్టీ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వెంకటస్వామి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీలైన టీడీ పీ, వైసీపీ,జనసేనలకు గట్టి పోటీ ఇచ్చేలా బీసీవై పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయని అన్నా రు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దించి ప్రజా మద్దతు పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు.పార్టీ రాష్ట్ర కో–కన్వీనర్ నేరుసు నాగమణి యాదవ్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీవై పార్టీ అభ్యర్థు లు పోటీ చేస్తారని తెలిపారు.పార్టీ బలోపేతా నికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేస్తున్న పలువురికి నియామ క పత్రాలను అందజేశారు.

## అనారోగ్యంతో ఉన్న స్నేహితురాలిని ఆదుకున్న బాల్య స్నేహితులు.

ప్రజా భూమి ప్రతినిధి–బుట్టాయిగూడెం



అనారోగ్యంతో బాధపడుతున్న చిన్ననాటి స్నేహితురాలికి ఆమె బాల్య స్నేహితులందరూ కలిసి ఆర్థికంగా చేయూతనిచ్చిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉర్రింకకు చెందిన ఆదివాసీ మహిళ నడపాల మౌనిక ఇటీవల ఒక బిడ్డకు జన్మనిచ్చింది. బాలింతరాలైన మౌనిక అనారోగ్యంతో బాధపడుతూ, జంగారెడ్డిగూడెం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మౌనిక చికిత్స కు ఎక్కువ మొత్తంలో ఖర్చు కావడంతో పేదరికంతో బాధపడుతున్న మౌనిక కుటుంబానికి వైద్య ఖర్చులు భారమయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న (1995 టెన్త్ బ్యాచ్ ) కోట రామచంద్రపురం ఏపీఆర్ స్కూల్లో చదువుకున్న చిన్ననాటి స్నేహితులు అప్పటికప్పుడు స్పందించి, రూ.13 వేల రూపాయలు శనివారం మౌనిక కుటుంబానికి అందించారు. చిన్ననాటి స్నేహితులు అందించిన ఈ ఆర్థిక సహాయానికి మౌనిక, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెల్లం గంగరాజు, బుద్ధుల లక్ష్మణరావు, కంప సుబ్బారావు, కూరం వెంకటేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు సాధించాల్సిందే

### -సుప్రీంకోర్టులో న్యాయపోరుకు కూటమి ప్రభుత్వం సిద్ధం-మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేస్తోందని, సుప్రీంకోర్టును ఆశ్రయించాలన్న నిర్ణయం బీసీలకు న్యాయం జరిగే దిశగా కీలక అడుగని మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో లభించే ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని నిష్ణాతులైన న్యాయవాదులతో సుప్రీంకోర్టులో సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం సిద్ధం కావడం హర్షణీయమన్నారు. హిందూపురంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయంలో శనివారం టీడీపీ బీసీ నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే కట్టుబడి పనిచేస్తోందని రమేష్‌కుమార్ తెలిపారు.




1987లో 20 శాతం, 1995లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీ ప్రభుత్వాలకే దక్కుతుందని పేర్కొన్నారు. బీసీలు అంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలు అన్న విధంగా పార్టీకి, బీసీలకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడమే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. 34 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ వర్గాలు హర్షిస్తున్నాయని తెలిపారు. రిజర్వేషన్ల పెంపు విషయంలో ఏ చిన్న అవకాశం వచ్చినా న్యాయపరంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు న్యాయపోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల రిజర్వేషన్ల విషయంలో ప్రతికూల తీర్పు వచ్చినప్పుడు సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని రమేష్‌కుమార్ ప్రశ్నించారు. బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే అప్పుడే న్యాయపోరాటం చేసి ఉండేవారని అన్నారు. గత ప్రభుత్వ నిర్వాహకం కారణంగా రాష్ట్రంలో బీసీలు 16,800 రాజకీయ పదవులు కోల్పోయారని ఆరోపించారు. బీసీల పట్ల వైసీపీది కపట ప్రేమ, మోసపూరిత హామీలు తప్ప వాస్తవంగా చేసిందేమీ లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల కోసం న్యాయపోరాటం కొనసాగుతున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, బీసీలకు రిజర్వేషన్ల ఫలాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రమేష్‌కుమార్ తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజల అండదండలతో కూటమి ప్రభుత్వం విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు పరిమళ, భాస్కర్, రాజు, రామాంజనేయులుతో పాటు పలువురు బీసీ నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బొందలవాడలో గ్రీన్ అంబాసిడర్లకు ప్రత్యేక శిక్షణ

### ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి: అధికారులు

ప్రజా భూమి నార్పల




నార్పల మండలం బొందలవాడ గ్రామపంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల నుంచి పంచాయతీ అభివృద్ధి అధికారులు, ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఒక గ్రీన్ అంబాసిడర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణను క్రమం తప్పకుండా నిర్వహించడం, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తను ఇంటి వద్దే తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వడం వల్ల పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందని వివరించారు. అలాగే చెత్త సేకరణ విధానం, బిన్ బ్యాగ్ విధానం, నాడెప్ ఫిల్లింగ్, బెడ్డింగ్ విధానం, వర్మీ కంపోస్టు తయారీ తదితర అంశాలపై గ్రీన్ అంబాసిడర్లకు ప్రాక్టికల్‌గా శిక్షణ అందించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంలో గ్రీన్ అంబాసిడర్లు కీలకపాత్ర పోషించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐ. మమతాదేవి, ఉప మండల అభివృద్ధి అధికారి గట్టు శ్యామల, బొందలవాడ పంచాయతీ అభివృద్ధి అధికారి బండారు శ్రీనివాసులుతో పాటు మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పంచాయతీ అభివృద్ధి అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## రూ.50 లక్షల రహదారికి నాలుగు నెలల్లోనే ప్యాచ్ వర్కులు!

### నార్పల--కేసేపల్లి మీదుగా నాయనపల్లి రహదారిలో పరిస్థితి

ప్రజా భూమి నార్పల,



నార్పల నుంచి కేసేపల్లి మీదుగా నాయనపల్లి వరకు సుమారు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారి పనులు పూర్తయి నాలుగు నెలలు కూడా గడవకముందే కేసేపల్లి వద్ద పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతలు ఏర్పడిన ప్రాంతాల్లో ప్యాచ్ వర్కులు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతనంగా నిర్మించిన రహదారికి ఇంత తక్కువ సమయంలోనే మరమ్మతులు చేయాల్సి రావడంపై స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో గుంతలు ఉన్న ప్రాంతాల్లో సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్లే రహదారి దెబ్బతింటోందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా అధికారులు వెంటనే స్పందించి గుంతలను శాశ్వతంగా పూడ్చడంతో పాటు రహదారి నిర్మాణ నాణ్యతను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా నిర్వహించిన కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాభూమి, పుట్లూరు.



కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) 28వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్లూరు మండలంలోని ఎంపీడీవోఆఫీసు, ముందు ,కడవకల్లు, ఓబులాపురం గ్రామాల్లో కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి కే. నాగభూషణం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. సూరి, కేవీపీఎస్ మండల కార్యదర్శి కే. నాగభూషణం మాట్లాడుతూ, 1998లో కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ ఆవిర్భవించిందని, నేటికి 28 సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలతో సమానత్వం, సామాజిక న్యాయం కోసం కేవీపీఎస్ పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. దళితులు, అణగారిన వర్గాలపై కుల వివక్ష, అంటరానితనం, సామాజిక వెలివేతను అరికట్టాలని, దాడులను నిరోధించి చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, భూమి హక్కులు కల్పించాలని, విద్య, ఉపాధి మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం ప్రతి ఒక్కరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.కుల వివక్ష, అంటరానితనం నిర్మూలనకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టి. పెద్దయ్య, బి. భాస్కర్ రెడ్డి, జే. పెద్దయ్య, టి. ఆదినారాయణ, వెంకట చౌదరి తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 3.0 కింద పశువుల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ..

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్,

ప్రజా భూమి శింగనమల




శింగనమల మండలంలోని బండమీదపల్లి గ్రామంలో శనివారం పల్లె పండుగ 3.0 కార్యక్రమం కింద పశువుల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డ్వామా పిడి సలీమ్ భాష, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశువులు ఉన్న రైతులు ఇలాంటి షెడ్లు నిర్మించుకుంటే ఆదాయంతో పాటు పశువులకు రక్షణ ఉంటుందని తెలిపారు. అన్ని పనులను 1 - 2 నెలలలోపు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ, మండలానికి విబిజిరాంజీ కింద సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పశువులు ఉన్న రైతులు షెడ్లు నిర్మించుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తాగునీరు, పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ కావాలని, పలు సమస్యలపై జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఎపిడి, ఎంపిడిఓ, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

### -న్యాయమైన డిమాండ్ల సాధనకు సంపూర్ణ మద్దతు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సహాయకుల పోరాటానికి మద్దతుగా శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 19,359 మంది గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 ఏళ్లుగా గ్రామ రెవెన్యూ సహాయకులు కేవలం రూ.10,500 చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2018లో వేతనాలు పెంచిన తర్వాత ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం అన్యాయమన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేల్ అమలు



చేయడంతో సుమారు రూ.32 వేల వేతనం అందుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రూ.10,500తోనే పనిచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు చేయించడంతోపాటు రాత్రివేళల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద కాపలా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు పర్యటనకు వచ్చినప్పుడు వారు ఆర్అండ్‌బీ బంగ్లాల వద్దకు వెళ్లి తిరిగి వెళ్లే వరకు విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. వరదలు, తుఫాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో 24 గంటలూ విధులు నిర్వహిస్తున్నా అందుకు తగిన వేతనాలు, సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు గ్రాట్యుటీ అమలు చేయాలని, వయసు మళ్లిన వారి స్థానంలో నామినీలుగా పనిచేస్తున్న కుమారులు, కుమార్తెలను గ్రామ రెవెన్యూ సహాయకులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, నైట్‌వాచ్‌మెన్ తదితర పోస్టుల్లో వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. వన్‌టైం సెటిల్‌మెంట్‌ను అమలు చేసి వారి ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గ్రామ రెవెన్యూ సహాయకులు 14 రోజులుగా కార్యాలయాల వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించి గ్రామ రెవెన్యూ సహాయకుల పోరాటాన్ని విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనరసప్ప, నారాయణప్ప, నరసింహమూర్తి, గంగాధరప్ప, లక్ష్మయ్య, చలివెందుల నరసింహులు, మణి, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

## పవిత్రకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలంలోని పుట్లూరు గ్రామానికి చెందిన పెద్ద నాగిరెడ్డిగారి అశ్వర్థ రెడ్డి ద్వితీయ కుమార్తె పవిత్రకు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. భౌతిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ బి. దేవప్రసాద్ రాజు పర్యవేక్షణలో “స్ట్రక్చరల్, ఆప్టికల్ అండ్ ల్యూమినిసెన్స్ ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్ డైస్ప్రోసియం డోప్డ్ మల్టీకాంపోనెంట్ గ్లాసెస్ ఫర్ వైట్ లైట్ ఎమిటింగ్ అండ్ గెయిన్ మీడియా అప్లికేషన్స్” అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఆమె రూపొందించిన పలు పరిశోధనా పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితం అయ్యాయి. ఈ సందర్భంగా పవిత్రను అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు సహచర పరిశోధకులు అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## చేదుళ్ల గ్రామంలో విబి జి రాంజీ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలంలోని చేదుళ్ల గ్రామంలో శనివారం విబిజిరాంజీ పనులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. గ్రామంలోని చెక్ డ్యాం డిసిల్టింగ్ (పూడిక తీత) పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో దాదాపు 70 మంది వేజ్ వర్కర్స్ (ఉపాధి కూలీలు) పనులు చేస్తుండగా, వారితో జిల్లా కలెక్టర్ ఇంటరాక్ట్ అయ్యారు. కూలీలకు సగటు రోజువారీ వేతనం రూ. 312 వరకు వస్తుందని, పని చేసిన వారికి వేతనం సరిగా పడుతోందని అధికారులు తెలిపారు. ఈ మధ్య కాలంలో గ్రామంలో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) జరిగిందా అని కూలీలను అడగగా, సుమారు 6 నెలల కిందట సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 125 రోజులు పూర్తయిన వారికి, రైతుల సొంత పొలాల్లో (బీడు భూములు) హాఫ్ మౌంటర్ పనులు చేసుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి జిల్లా కలెక్టర్ ను కూలీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డ్వామా పిడి సలీమ్ భాష, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో ఎన్.ఎస్.పి.ఆర్ విద్యార్థికి గిన్నిస్ అవార్డు

### -అభినందించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పట్టణంలోని ఎన్.ఎస్ మ.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని జి. హేమశ్రీ కరాటేలో గిన్నిస్ రికార్డు సాధించింది. కళాశాలలో బీఎస్సీ రెండవ సంవత్సరం కెమిస్ట్రీ మేజర్ చదువుచున్న హేమశ్రీ వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 ఆగస్టు 2026 న చెన్నైలో నిర్వహించిన కరాటే వరల్డ్ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమానికి కరాటే మాస్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో హాజరయ్యారు. అక్కడ తన ప్రతిభను ప్రదర్శించి కరాటే వరల్డ్ గిన్నిస్ రికార్డు 2026వ సంవత్సర అవార్డు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలీదేవి తెలిపారు. ఈ విద్యార్థినికి శనివారం పోస్ట్ ద్వారా మెడల్, సర్టిఫికెట్ అందాయి. దీంతోపాటు అధ్యాపకులు విద్యార్థిని అభినందించి ఆమెకు మెడల్, సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. వెంకటేశులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.యశోద రాణి, అధ్యాపకులు డాక్టర్ పి సరస్వతి, డాక్టర్ శ్రీలక్ష్మి, భోజప్ప, యన్.యస్.యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నగర్ అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్కి స్వచ్ఛ అవార్డ్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం నగరంలోని శ్రీనివాసనగర్ లోని అర్బన్ ౖానజ మెరుగైన వైద్య సేవలు, పరిశుభ్రత నెలకొల్పినందుకు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లో భాగంగా శుక్రవారం జిల్లా స్థాయిలో ఉత్తమ కేటగిరీ లో అవార్డుకు ఎంపికైనదని వైద్యాధికారి డా. శ్రావణి తెలియజేశారు. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో డా.శ్రావణి అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, కలెక్టర్ ఓ. ఆనంద్ చేతుల మీదుగా అవార్డును అందుకొన్నారు. వైద్య సిబ్బంది ఆదిమూర్తి, సురేష్, గణేష్, అరుణ, ప్రీతి సునైన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీసుల్లో రూ.116కే కనకదుర్గ అమ్మవారి ప్రసాదం

### -తపాలా శాఖ సూపరింటెండెంట్ రెడ్డి భాష

ప్రజాభూమి, హిందూపురం టౌన్



దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి దసరా ప్రసాదం ప్యాకెట్లు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులోకి వచ్చాయని హిందూపురం డివిజన్ తపాలా సూపరింటెండెంట్ రెడ్డి బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ప్రసాదాన్ని అన్ని తపాలా కార్యాలయాల్లో భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒక్కో దసరా ప్రసాదం ప్యాకెట్ ధర రూ.116/- (జీఎస్టీతో కలిపి) అని ఆయన వెల్లడించారు. ఒక్కో ప్యాకెట్‌లో కనకదుర్గ అమ్మవారి లాకెట్, శక్తి కంకణం, కుంకుమ, అక్షింతలు, కనకదుర్గ ప్రభ పుస్తకం, అమ్మవారి లడ్డూ ప్రసాదం వంటి అయిదు వస్తువులు ఉంటాయన్నారు. భక్తులకు అమ్మవారి ఆశీస్సులతో పాటు పూజా సంబంధిత వస్తువులను ఒకే ప్యాకెట్‌లో అందించే విధంగా రూపొందించబడిందని తెలిపారు. హిందూపురం డివిజన్ పరిధిలోని భక్తులు సమీప పోస్టాఫీసును సంప్రదించి ఈ దసరా ప్రసాదాన్ని పొందవచ్చని తెలిపారు.

## నాణ్యతగా పనులు చేపట్టాలి- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

### పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ వద్ద ఓ,ఎం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



చాగల్లు రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఓ, ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులను నాణ్యతగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు రిజర్వాయర్ వద్ద ఓ, ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ డ ఎం పనులను పరిశీలించి, నీట్‌గా చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు ఇచ్చారు. పెద్దపప్పూరులోని సచివాలయం-1 తనిఖీ అనంతరం పెద్దపప్పూరు మండల కేంద్రంలోని సచివాలయం-1ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి వచ్చే సంతృప్తి స్థాయిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుతం సచివాలయం పరిధిలో సంతృప్తి స్థాయి 77 శాతంగా ఉండగా, సంతృప్తి స్థాయి 90 శాతం దాటేలా సిబ్బంది అందరూ కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సచివాలయం ద్వారా నాణ్యమైన సేవలను అందించాలని, అర్జీలను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తహసీల్దార్ బాలాజీరాజు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల విషయంలో వైకాపా, కూటమి సర్కార్లు విఫలం

## పులివెందుల మెగా లేఔట్‌లో 89 కోట్లు రాళ్లపాలు -కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన నర్రెడ్డి తులసిరెడ్డి, ధ్రువకుమార్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల

పేదల ఇళ్ల నిర్మాణంలో అటు వైకాపా, ఇటు టీడీపీ కూటమి ప్రభుత్వాలు రెండూ ఘోరంగా విఫలమయ్యాయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి మండిపడ్డారు. శనివారం పులివెందుల మెగా లేఔట్ ఇళ్ల కాలనీని కాంగ్రెస్ నేతలతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది ప్రతి మనిషికి, ముఖ్యంగా పేదవానికి జీవితాశయమని అన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించే 1975లోనే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రారంభించిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో అందరికీ ఇల్లు అనే అంశాన్ని చేర్చారని తెలిపారు. ఆ స్ఫూర్తితో 2004-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏకంగా 60 లక్షల ఇళ్లు పేదలకు నిర్మించి ఇచ్చాయని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం, వైకాపా ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం పులివెందుల మెగా లేఔట్ కాలనీనే అన్నారు. ఈ మెగా లేఔట్‌లో మొత్తం 6950





ఇళ్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ బాధ్యతను రా క్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, కొమెర రామచంద్ర సంస్థ, శ్రీ వినాయక కన్‌స్ట్రక్షన్స్, డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు ఏజెన్సీలకు అప్పగించారని తెలిపారు. వైకాపా ఐదేళ్ల పాలన ముగిసే నాటికి 6950 ఇళ్లకు గాను కేవలం 951 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, అందులో ఒక్క లబ్ధిదారుడు కూడా చేరలేదని అన్నారు. 1735 ఇళ్లు పునాది స్థాయిలో, 1988 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో, 1920 ఇళ్లు ఆర్‌సీ లెవెల్‌లో ఆగిపోయాయని వివరించారు. పనులు పూర్తి కాకుండానే రూ. 89 కోట్లు ఖర్చు చేశారని, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులు అసలు మొదలే కాలేదని ఆరోపించారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక 27 నెలలుగా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని, పూచికపుల్ల పని కూడా జరగలేదని, ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లు కూడా నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయని, దీంతో ప్రజాధనం రూ. 89 కోట్లు రాళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గత 27 నెలలుగా ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని అన్నారు. పులివెందుల పట్టణంలో, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని అన్నారు. జేఎన్‌టీయూ కళాశాల, భూగర్భ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, బటర్ ఫ్లై దీపాలు, శిల్పారామం, అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రం, సిమెంట్ రోడ్లు, పులివెందుల- కడప ఫోర్ లేన్ రోడ్డు, చిత్రావతి రిజర్వాయర్, లింగాల కెనాల్, పైడిపాలెం రిజర్వాయర్, పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ, ట్రిపుల్ ఐటీ ఏర్పాటు వంటివన్నీ కాంగ్రెస్ హయాంలో జరిగినవేనని, వైకాపా, కూటమి ప్రభుత్వాలు చేసింది శూన్యమని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పులివెందుల మెగా లేఔట్ ఇళ్ల కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరు నెలల్లో పూర్తి చేసి పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల అధ్యక్షుడు ఖాదర్ భాషా, లింగాల మండల అధ్యక్షుడు శంకర్ రెడ్డి, వేంపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణ, వేముల మండల అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, హౌసింగ్ డీఈ వాసుదేవరెడ్డి, ఏఈ రామసూరారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, నాయకులు అనూష, చంద్రబాబు నాయుడు, జిలానీ, నాగరాజు, వెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల దరఖాస్తు గడువు 6 వరకు పొడిగింపు



ప్రజాభూమి, సిద్దవటం: ఎక్సైజ్ పరిధిలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు గడువును ఈ నెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. శనివారం సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మాచుపల్లి, భాకరాపేట, ఒంటిమిట్ట, మాధవరం గ్రామాల పరిధిలో మొత్తం ఐదు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తుదారులు గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిబ్బంది లేక మూతపడిన పశువైద్యశాల

## - పాడి రైతుల ఆవేదన



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాచుపల్లి గ్రామీణ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో శనివారం తలుపులు మూసి ఉండటంపై పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు, మేకలకు వైద్యం చేయించేందుకు వచ్చిన రైతులకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. లింగంపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, తన మేకలకు అనారోగ్యం రావడంతో మందుల కోసం మాచుపల్లి పశువైద్యశాలకు వచ్చానని, అయితే అక్కడ పశువులను పరీక్షించే సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుదిరగాల్సి వచ్చిందని తెలిపారు. పాడి రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవిని వివరణ కోరగా, మాచుపల్లి పశువైద్యశాల డాక్టర్ విజయ్‌కుమార్ వైజాగ్‌లో శిక్షణకు వెళ్లారని తెలిపారు. అటెండర్ పుల్లయ్య వ్యాక్సినేషన్ పంపిణీ కోసం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడంతో వైద్యశాల తలుపులు మూసి ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్య సిబ్బంది అందుబాటులోనే ఉన్నారని ఆమె తెలిపారు.

# చీకట్లో ఉన్న కాలనీకి వెలుగులు నింపిన వైఎస్ మనోహర్ రెడ్డి

## సొంత నిధులతో వీధి దీపాల ఏర్పాటు - స్థానికుల హర్షం

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో వీధి దీపాలు వెలగక చీకట్లో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మనోహర్ రెడ్డి ఆ ప్రాంత వైకాపా నాయకుడు రవికుమార్‌ను పిలిపించి సొంత నిధులతో వీధి దీపాలను తెప్పించి ఏర్పాటు చేయించారు. దీంతో ఆ ప్రాంతానికి వెలుగులు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ వైఎస్ మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో ఏ సమస్య ఉన్నా సొంత నిధులతో పరిష్కరించే నాయకులు వైఎస్ కుటుంబ సభ్యులేనని అన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



ప్రజాభూమి, సిద్దవటం: వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపద పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శనివారం సిద్దవటం మండల కేంద్రంలోని నలంద పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప డీఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సిద్దవటం ఇన్చార్జ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నయీం అలీ తెలిపారు. ఈ సందర్భంగా నయీం అలీ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణుల సంరక్షణపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల ప్రాముఖ్యత, అడవుల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. 'అడవుల ప్రయోజనాలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. వన్యప్రాణులు నీటి కోసం గ్రామాల వైపు వచ్చినప్పుడు వాటికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. అటవీ సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని, విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముక్తార్ భాష, నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, అటవీశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

## స్థానికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: తూగుట్ల మధుసూదన్ రెడ్డి

ప్రజాభూమి, పులివెందుల:



పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో నెలకొన్న డ్రైనేజీ, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువ పొంగిపొర్లి కలుషిత నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని స్థానికులు మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులను పిలిపించి నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టించారు. వర్షం కురిసిన ప్రతిసారీ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. మురుగు కాలువ నుంచి నీరు ఇళ్ల వైపు వెళ్లకుండా గోడ నిర్మాణం, ఛాంబర్ ఏర్పాటు, మురుగు నీరు సక్రమంగా కాలువలోకి వెళ్లేందుకు పైప్ లైన్ ఏర్పాటు చేయించి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని, అవసరమైన చోట అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు టీడీపీ ఇంచార్జి షేక్ అక్రమ్, ఫిజియోథెరపీ డాక్టర్ సాయి కిషోర్, అసిఫ్, శ్రీనివాసులు, నామా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయా కరుణించవయ్యా

## కోతి సమాధి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్డులోని కోతి సమాధి వద్ద గల అభయాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. మహా మంగళహారతి అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. శనివారం ఆంజనేయ స్వామికి నిర్వహించే పూజలకు, తీర్థ ప్రసాదాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన దాతలకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఘనంగా డాక్టర్ ఈసీ గంగిరెడ్డి వర్ధంతి

## దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో దుప్పట్లు, బిర్యాని పంపిణీ చేసిన వైకాపా నేతలు



ప్రజాభూమి, పులివెందుల

మానవ సేవే మాధవ సేవ అని నిరూపిస్తూ వైకాపా నాయకులు మానవత్వం చాటుకున్నారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పులివెందుల పట్టణంలో సేవా కార్యక్రమం ఘనంగా జరిగింది. పట్టణంలోని పార్నపల్లె రోడ్డు సమీపంలో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో వైకాపా చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, బిర్యానీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, సింహాద్రిపురం మండల ఇన్చార్జ్ దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మాజీ చైర్మన్లు వరప్రసాద్, చిన్నప్ప, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్ , మాజీ కౌన్సిలర్ కోడి రమణ, రిషికేశవ రెడ్డి లు పాల్గొని అందరి చేతుల మీదుగా మానసిక వికలాంగులకు దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పులివెందులలో అందించిన వైద్య సేవలు మరువలేనివని కొనియాడారు. దాసరి ఈశ్వరయ్య ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, ఇలాంటి సేవలు మరెన్నో చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మదర్సాలో ప్రత్యేక ప్రార్థనలు, బిర్యానీ పంపిణీ



ప్రజాభూమి, వేముల

వేముల మండలం వేల్పుల గ్రామ సమీపంలో ఉన్న మదర్సాలో శనివారం డాక్టర్ యూ సి గంగిరెడ్డి ఆరవవర్ధంతి సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు నూరుల్లా, మాజీ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకు శాంతి చేకూరాలని ఈ ప్రార్థనలో నిర్వహించడం జరిగిందన్నారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడిన గొప్ప మహానుభావుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి అన్నారు. వర్ధంతి సందర్భంగా ఈ ప్రార్థన నిర్వహించి ఇక్కడున్న వారికి బిర్యానీ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గండి క్షేత్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

## - శ్రీ వీరాంజనేయ స్వామివారి దర్శనం

ప్రజాభూమి, చక్రాయపేట



గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామివారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ సి. విశ్వనాథ్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా రమేష్ స్వామి, ఆలయ పాలకమండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి ఆలయ మర్యాదలతో ఆయనను సత్కరించారు. అనంతరం రామచంద్రా రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు పొందారు. ఆలయ చరిత్ర, క్షేత్ర మహిమలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. గండి క్షేత్రం ఎంతో పవిత్రమైనదని, రాయలసీమలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమని ఆయన కొనియాడారు.

# మానవత్వానికి మారుపేరైన డాక్టర్ ఈసీ గంగిరెడ్డికి ఘన నివాళి

## సమాధి వద్ద నివాళులర్పించిన కుమార్తె వైఎస్ భారతిరెడ్డి, కుటుంబ సభ్యులు

ప్రజాభూమి, పులివెందుల

ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె వైఎస్ భారతిరెడ్డి, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. పులివెందుల పట్టణంలో లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులోని సమాధుల తోటలో ఉన్న ఆయన సమాధి వద్ద శనివారం వైఎస్ భారతిరెడ్డి, డాక్టర్ సుగుణమ్మ, డాక్టర్ దినేష్, వైఎస్ మనోహర్ రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి అంటే నియోజకవర్గంలో తెలియని వారే లేరన్నారు. ప్రజలకు విశేష వైద్య సేవలందిస్తూ ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలు, మానవతా విలువలు నేటి తరాలకు స్ఫూర్తిదాయ కమన్నారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వృషభాచలేశ్వర స్వామివారికి వెండి ఒడ్డాణం సమర్పణ

## - 443 గ్రాముల వెండి ఒడ్డాణాన్ని అందజేసిన భక్తులు

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పాపాఘ్ని నది తీరాన ఎద్దులకొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి (శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి) దేవస్థానానికి ప్రొద్దుటూరుకు చెందిన భక్తులు ఎలిగండ్ల బాలయ్య, సతీమణి సుశీల వెండి ఒడ్డాణాన్ని సమర్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. రూ. 1,02,350 విలువైన 443 గ్రాముల వెండి ఒడ్డాణాన్ని కుటుంబ సభ్యులు ప్రదీప్‌కుమార్, సతీమణి జయవాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అర్చకులు హరిప్రవీణ్, ఆలయ చైర్మన్ పీవీ రమణకు అందజేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో దాతలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సుభాష్, చైర్మన్ పీవీ రమణ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని తెలిపారు. దాతలు అందిస్తున్న సహకారం ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. భక్తులు ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో ఘనంగా వన్యప్రాణుల వారోత్సవాలు

ప్రజాభూమి, పులివెందుల



వన్యప్రాణుల వారోత్సవంలో భాగంగా దొరిగల్లు ఈస్ట్ బీట్ పులివెందుల సెక్షన్ రాణి తోపులో ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఉన్న ప్రాణుల వారోత్సవాలనునిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దనూరు రేంజ్ ఆఫీసర్ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమూగజీవులూ ప్రకృతిలో భాగమే మనిషి జీవనానికి జంతువులు అనేక విధాలుగా తోడ్పడుతున్నాయి అన్నారు. వ్యవసాయం, పర్యావరణ సమతుల్యత, ఆహార గొలుసు, జీవ వైవిధ్య పరిరక్షణలో జంతువుల పాత్ర ఎంతో కీలకం అని ఆయన అన్నారు. అడవుల్లోని వన్యప్రాణుల నుంచి గ్రామాల్లోని పశువులు, పట్టణాల్లోని వీధి కుక్కలు, పిల్లుల వరకు ప్రతి జీవికి ప్రకృతిలో ఒక ప్రత్యేక స్థానం ఉంది అన్నారు. పట్టణాలు, గ్రామాల్లో అనేక మూగజీవులు ఆహారం, నీరు, వైద్యం వంటి కనీస అవసరాలకు దూరమవుతున్నాయి అలాంటి వారిని నిర్లక్ష్యం చేయవద్దు అన్నారు. ప్రమాదాల్లో గాయపడిన జంతువులను పట్టించుకోకపోవడం, వాటిపై హింసకు పాల్పడటం, వేసవిలో నీటి సౌకర్యం కల్పించకపోవడం వంటి ఘటనలు కనిపిస్తూనే ఉన్నాయి అన్నారు. జంతువుల పట్ల దయ, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ దినోత్సవం గుర్తుచేస్తోంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకింగ్ ఫ్రెండ్స్ తదితరులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు

### -ఎక్సైజ్ సీఐ లావణ్య

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ4 మద్యం దుకాణాల నోటిఫికేషన్ దరఖాస్తు గడువును మరో మూడు రోజుల పాటు పొడిగించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. లావణ్య తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ కింద లాటరీ పద్ధతిలో కేటాయించడానికి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 10 ఏ4 మద్యం దుకాణాలను అందుబాటులో ఉంచినట్లు ఆమె పేర్కొన్నారు. వీటిలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి 3, ఏర్పేడు మండలానికి 3, తొట్టంబేడు మండలానికి 3, బి.ఎన్. కండ్రిగ మండలానికి 1 చొప్పున దుకాణాలను కేటాయించినట్లు వెల్లడించారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 3 లక్షల వెనక్కి ఇవ్వబడని అప్లికేషన్ ఫీజుతో పాటు రూ. 1,000 ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ పద్ధతుల్లో చెల్లించి అప్లై చేసుకోవచ్చని సీఐ వివరించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు అవకాశం కల్పించామని తెలిపారు. ఆ తర్వాత అక్టోబర్ 7న దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, 8వ తేదీన ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీసి విజేతలను ఎంపిక చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్ లేదా హెల్ప్ లైన్ నంబర్ 040-2425520 లేదా స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని కోరారు.

## చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా పవన్ కళ్యాణ్ ప్రకటించడం హర్షనీయం

### గాంధీజీ గ్రామ స్వరాజ్యం పవనన్నతో సాధ్యం మిద్దెల హరి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా చేనేత కార్మి క యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా"డి .రామకృష్ణ అధ్యక్షతన 30 సంవత్సరాలుగా చేనేత రంగాన్ని సంరక్షణ కోసం కృషిచేసిన నాయకుల అభినందన సభలో అతిథిగా పాల్గొన్న మాజీ ఆప్కో డైరెక్టర్ ఊ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి మాట్లాడుతూ అహింసా మార్గంలో, క్విట్ ఇండియా, స్వదేశ వస్త్రాలే ధరించాలని ఉద్యమాన్ని చేపట్టి బ్రిటిష్ పాలకులు నుండి దేశానికి స్వతంత్రం తెచ్చిన మహనీయుడు మహాత్మా గాంధీజీ అని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిజం చేసే విధంగా మన ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయమని. ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవం నాడు చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా నేనున్నానని కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రకటించడం హర్షనీయమని చేనేత వర్గాల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి "నారా చంద్రబాబునాయుడు నేతన్న సేవ పథకం ద్వారా 25000 రూపాయలు అందించడం చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వము ఉన్నది అనడానికి ఇది నిదర్శనం అని కొనియాడారు. అనంతరం 45 మంది పాతతరం చేనేత కార్మిక నాయకులను దుశ్శాలతో సత్కరించడమైనది. 35 సంవత్సరాలుగా చేనేత రంగానికి, కార్మికులకు, అండగా నిలిచిన యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా "డి .రామకృష్ణ దంపతులను శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దుశ్శాలవతో సన్మానించడమైనది. కార్యక్రమంలో ముఖ్య అతిథి మాజీ మంత్రివర్యులు పరసారత్నం, తిరపతి మాజీ శాసనసభ్యులు ఏ మోహన్, గేట్ ,గీతం విద్యాసంస్థల అధినేత జనసేన తిరుపతి పార్లమెంటు పరిశీలకుడు తమ్మినేని వెంకటేశ్వర్లు, రాష్ట్ర చేనేత సమైక్య నేత మాచర్ల మోహన్ రావు, విశ్రాంతి ప్రొఫెసర్స్ డా" రెడ్డప్ప రెడ్డి కుమార్ స్వామి, చేనేత కార్మికులు, నాయకులు పాల్గొనడమైనది. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులకు మొమెంటోలు అందజేయడమైనది.

## వర్మి కంపోస్ట్ తయారీపై అవగాహన పెంచుకోండి- ఎంపీడీవో పులిరాం సింగ్

### చెత్తతో సంపద తయారీ కేంద్రంలో శిక్షణ.



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

చెత్తతో సంపద తయారు చేసే కేంద్రాలలో వర్మీ కంపోస్ట్ తయా రీపై సిబ్బంది అవగాహన పెంపొం దించుకోవాలని ఎంపీడీవో పులిరాం సింగ్ అన్నారు. శనివారం పంచాయతీరాజ్ అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పెరుమాళ్ళపల్లిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సేంద్రియ ఎరువుల తయారీని పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. గ్రామాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వర్తించి, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు. గ్రామాలలోని ప్రజలకు స్వచ్ఛరథంపై అవగాహన కల్పించి, ప్రజలు సద్వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు వెన్నెల, ఝాన్సీ సుమలత, సురేష్, కోనేటి హరి, సుధారాణి, టి సతీష్, ధన్య, శివకుమార్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## గాదంకి టోల్ ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదం..!

### ఒకరు మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు..

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:



చంద్రగిరి మండల పరిధిలోని గాదంకి టోల్ ప్లాజా వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.కంటైనర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, మృతుడు, క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.

## రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే రాయల "హార్టీ కల్చర్ హబ్ లక్ష్యం

### - సీమ రూపురేఖలు మార్చబోతున్న "గ్లోబల్ హార్టికల్చర్ హబ్" -ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ మురళి మోహన్ (చినబాబు)

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే రాయల "హార్టీ కల్చర్ హబ్ లక్ష్యం మని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల డైరెక్టర్ మురళి మోహన్ (చినబాబు) పేర్కొన్నారు. సీమ రూపురేఖలను "గ్లోబల్ హార్టికల్చర్ హబ్"మార్చబోతుందన్నారు. నాపై నమ్మకంతో మదనపల్లి సమావేశం విజయవంతం చేయడంలో భాగంగా నిమ్మ నపల్లి మండలం బాధ్యతలు అప్పగించారు. తాను అందరి సహకారంతో అహర్నిశలు శ్రమించి ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడి రైతులకు హార్టీకల్చర్ హబ్ ఉపయోగాలను, భవిష్యత్తులో కలుగు సౌకర్యాలను వివరించడం జరిగిందన్నారు. ఉన్నత ప్రయోజనాలను రైతులు గ్రహించి ఆదరణ చూపారు. రైతులందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్య,ఐటీ,మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ నాడు "యువగళం"లో రాయలసీమ రైతులు పడుతున్న కష్టాలు చూసి "హార్టీకల్చర్ హబ్ " ఆలోచన వచ్చిందని, ఈ సమాచారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ లకు చేరవేసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా శ్రీకారం చుట్టారని తెలిపారు.

**అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాజధాని** హైదరాబాద్ లో ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్ బి) తరహా మ్యాజిక్ ఇప్పుడు రాయలసీమలో జరగబోతుందన్నారు. ఇక్కడకు రాబోయే గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ( వ్యవసాయరంగ రూపురేఖలు మార్చబోతోందని, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొనడం ఈ ప్రాంత రైతులకు అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన జరగడం మన ప్రాంత అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మంత్రి లోకేష్ విత్తనం దగ్గర నుండి, ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వరకు ఇక్కడ రీసెర్చ్ జరుగుతుందని,ఇక్కడ పండించిన పండ్ల ఉత్పత్తులను ఇతర దేశాలకు ఎగుమతి చేసినప్పుడే మన రైతులకు లాభం వస్తుందని చెప్పటం మనందరికీ ఆనందదాయకంగా ఉందన్నారు. హార్టికల్చర్ హబ్ లక్ష్యం రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే. మనం కేవలం ఇతర రాష్ట్రాలకు కావాల్సిన వెరైటీలే కాకుండా ఇతర దేశాలకు అవసరమైన రకాల పంటలు కూడా పండించాలి. అందుకు అనుగుణంగా మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్,అవకాడో,ఆపిల్, బెర్రీస్ వంటి ప్రతి వెరైటీకి సంబంధించి రీసెర్చ్ జరగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించటంఈ ప్రాంతంపై ఆయనకు వున్న ప్రేమానురాగాలు తెలుపుతున్నాయని తెలిపారు.

**యువగళంలోనే మిషన్ రాయలసీమ ఆలోచన:**

మంత్రి లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించిన గడ్డ రాయలసీమ గడ్డ. ఆనాడు గొడ్డలి పార్టీ వాళ్లు తన మైక్ లాక్కున్న, నా స్టూల్ లాక్కున్న, సోడా బాటిళ్లు, రాళ్లు, గుడ్లతో దాడి చేసినా లోకేష్ అదరక బెదరక యాత్ర సాగించారని, రాయలసీమలో 124 రోజులు, 44 అసెంబ్లీ నియోజకవర్గాలు, 1,587 కి.మీ పాదయాత్ర చేశానంటే దానికి కారణం సీమ ప్రజలు తన పై చూపించిన ప్రేమ, అభిమానం. ప్రతి రోజూ రైతుల్ని కలిశారు, వాళ్లు పడుతున్న కష్టాలు నేరుగా చూశారు. మామిడి,అరటి, టమాటా,దానిమ్మ,ఖర్జూరం,డ్రాగన్ ఫ్రూట్, పుచ్చకాయ,నిమ్మ, అవకాడో పండిస్తున్న అనేక మంది రైతులతో మాట్లాడారు. వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. యువగళం పాదయాత్ర 119వ రోజు 2023 జూన్ 7న కడపలో "మిషన్ రాయలసీమ" ప్రకటించారు.

**హార్టికల్చర్ హబ్ కల నిజం కాబోతుంది**

అందులో ప్రధానమైనది రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చడం. విత్తనం దగ్గర నుండి ప్రపంచానికి కావాల్సిన వెరైటీలు మనం పండించడమే మిషన్ రాయలసీమ లక్ష్యం. రైతుల ఆదాయం పెంచాలన్న అజెండాతో ఆనాడు మిషన్ రాయలసీమ ప్రకటించారు. ఇప్పుడు మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ , ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో



హార్టికల్చర్ హబ్ కల సాకారం కాబోతుంది.ఒక రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు కి రైతు కష్టం తెలుసు. ఇప్పుడు అందరం డ్రిప్ ఇరిగేషన్ గురించి మాట్లాడుతున్నాం. నీటి విలువ తెలిసిన వ్యక్తి మన చంద్రబాబు అందుకే 1997 లోనే సీమకు ఇజ్రాయెల్ డ్రిప్ ఇరిగేషన్ పరిచయం చేశారు. ఆ బిందు సేద్యమే కరువు నేలను బంగారు భూమిగా మార్చింది. సబ్సిడీలో డ్రిప్ ఇరిగేషన్ అందించిన వ్యక్తి చంద్రబాబు గారు.

**...అందుకే చంద్రబాబు వాటర్ మ్యాన్!**

మొన్న ఒక ఇంగ్లీష్ పేపర్లో చంద్రబాబు గురించి రాస్తూ వాటర్ మ్యాన్ అని రాశారు. అది చూసి గొడ్డలి పార్టీ వాళ్లు ఏడుస్తున్నారు.నీటిని దేవుడిలా - ఇరిగేషన్ ప్రాజెక్టులను దేవాలయంలా భావించేది చంద్రబాబు గారు. సీమ ప్రాజెక్టులు ప్రారంభించింది,పూర్తి చేయబోయేది కూటమి ప్రభుత్వమే.తెలుగు గంగ, ఎస్ఆర్బీసీ,హంద్రీ-నీవా,గాలేరు-నగరి, వెలిగొండ,పోలవరం మన ట్రేడ్ మార్క్.ఈ ప్రాజెక్టుల వల్లే రాయలసీమ అరటి వరల్డ్ ఫేమస్ అయ్యింది. ఈ ప్రాజెక్టుల వల్లే కరువు నేలపై కియా కార్లను మనం తయారు చేస్తున్నాం.అందుకే చంద్రబాబు నాయుడుని అందరూ వాటర్ మ్యాన్ అంటున్నారు.

**బాబు ముందుచూపుకు నిదర్శనం ఐఎస్!**

హార్టికల్చర్ అయినా, క్వాంటం అయినా చంద్రబాబు ముందుంటారు. మనం ఈ రోజు గురించి ఆలోచిస్తే... చంద్రబాబు గారు వచ్చే 20 ఏళ్ల గురించి ఆలోచిస్తారు. దానికి ఒక ఉదాహరణే - ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్.దేశంలో ఉన్న గొప్ప పారిశ్రామికవేత్తలు అందరూ కలిసి వరల్డ్ క్లాస్ బిజినెస్ స్కూల్ పెట్టాలి అనుకున్నారు. ఆ విషయం బాబు కి తెలిసింది. వాళ్లు దేశం మొత్తం తిరుగుతున్నారు. హైదరాబాద్ కి రావాలనే ఆలోచనలో అసలు లేరు. కానీ ఐఎస్బిని ఏపీకి తీసుకురావాలని ఆయన ఫిక్స్ అయ్యారు. ఐఎస్బి బోర్డుని అప్రోచ్ కాగా, వాళ్లు ఏపీ అసలు మా కన్సిడరేషన్ లోనే లేదన్నారు. అప్పుడు బాబు వాళ్లని ఒకసారి హైదరాబాద్ కి రమ్మని ఆహ్వానించారు. సీఎం, మంత్రులు ఎయిర్ పోర్టుకి వెళ్లి ఆహ్వానం పలికారు. స్వయంగా సీఎం గారే ప్రజెంటేషన్ ఇచ్చారు. బొంబాయి, హైదరాబాద్, చెన్నై, కర్ణాటక అన్ని చోట్లకి వాళ్లు వెళ్లారు. ఫైనల్ గా హైదరాబాద్ నే సెలెక్ట్ చేసుకున్నారు. దట్ ఈజ్ బ్రాండ్ సీబీఎన్. ఇప్పుడు ఐఎస్బి ప్రపంచంలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ బిజినెస్ స్కూల్.

**చంద్రబాబుతో అంబానీలది 3 తరాల అనుబంధం**

చంద్రబాబుకి, అంబానీ కుటుంబానికి మధ్య ఉన్న సంబంధం మూడు దశాబ్దాల నాటిది. ధీరూభాయ్ అంబానీ గారితో ఆయనకున్న అనేక పరిచయాల నుండి, ముఖేష్ అంబానీతో ఉన్న బంధం వరకు, ఇప్పుడు అది తరువాతి తరంతో కొత్త భాగస్వామ్యంగా ఎదిగింది. ఐఎస్బి వ్యాపార రంగానికి ప్రపంచ స్థాయి సంస్థగా ఎలా మారిందో, చంద్రన్న నాయకత్వంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ మన రైతుల కోసం ప్రపంచ స్థాయి సంస్థగా మారుతుంది. ఈ సంస్థను నిర్మించడానికి చంద్రబాబు గారు ఇచ్చిన కట్టుబాటుకు, అంతకంటే ముఖ్యంగా ఆంధ్రా రైతుల సామర్థ్యంపై ఆయన ఉంచిన నమ్మకానికి తామంతా ధన్యవాదాలు తెలుపుతున్నాము.రాయలసీమ రైతును ఆంధ్రప్రదేశ్ పొలాల నుండి ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్దాం. రాయలసీమ రైతు సత్తా ప్రపంచానికి తెలిసేలా చేద్దామని మంత్రి లోకేష్ అన్న మాటలను మనం స్ఫూర్తిగా తీసుకుందాం.మనం పండించే ఉద్యానవనం పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చినప్పుడు అమ్ముకుందాం.ధరలు లేనప్పుడు పంటలను చెడిపోకుండా నిల్వ చేసుకోవటానికి శీతలీకరణ గోదాంలు ఏర్పాటు చేయటం ఈ వ్యవస్థలో ముఖ్య అంశంగా చెప్పవచ్చు. ఏదిఏమైనా సీమ అభివృద్ధికి "హార్టీ కల్చర్ హబ్" ముఖ్య బిందువుగా మారుతోంది అనటంలో అతిశయోక్తి లేదు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ 10 జిల్లాలను కవర్ చేస్తుంది. అనంతపురం,అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల,శ్రీ సత్యసాయి,తిరుపతి, వైఎస్సార్ కడప,ప్రకాశం,మార్కాపురం .ఈ హబ్ 201 క్లస్టర్లు, 303 మండలాలు, 5,869 గ్రామాలను కవర్ చేయనుంది.

## ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ - వైద్య సేవలు, మందుల పంపిణీ, మౌలిక వసతులపై పరిశీలన

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవలు, రోగులకు అందుతున్న సదుపాయాలు, మందుల పంపిణీ, మౌలిక వసతులపై సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ ల్యాబ్‌ను పరిశీలించిన కలెక్టర్, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అందుతున్న పరీక్షలు, సేవల తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలపై కూడా ఆరా తీశారు. అనంతరం సిటీ స్కాన్ విభాగం, ఫార్మసీ, ఫార్మసీ స్టోర్ తదితర విభాగాలను పరిశీలించి, రోగులకు మందులు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఎంఆర్ఐ బ్లాక్‌లో మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, ఆపరేషన్ థియేటర్‌ను కూడా సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఏపీఎంఎస్‌డీసీ అధికారులు, డీఈఈఈ, ఎస్‌టీఎఫ్ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాత ఫార్మసీని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) ట్రైనింగ్ స్కూల్, హాస్టల్‌ను కూడా సందర్శించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మాట్లాడి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు.అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పారిశుధ్య నిర్వహణపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ, ఈ తనిఖీలో ఏపీఎంఎస్‌డీసీ అధికారులు, డీఈఈఈ, ఎస్‌టీఎఫ్ సభ్యులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, అపోలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసిటీలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్'లో బాయిలర్ పేలుడు .. ఐదుగురు మృతి

### బాధితులకు ఒక్కొకరికి రూ.50 లక్షల నష్ట పరిహారం. . ప్రమాద ఘటన పై విచారణకు ఆదేశం -జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి లిశ్రీసిటీ,

శ్రీసిటీ పరిధిలోని 'టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్' పరిశ్రమలో శనివారం ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఆకస్మిక పేలుడు సంభవించడంతో దురదృష్టవశాత్తు 5 మంది మరణించారని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శ్రీ సిటీ పరిధిలో గల విదేశీ ఎగుమతులు చేపట్టే ఔషధాల తయారీ పరిశ్రమలోని 2 టన్నుల సామర్థ్యం గల బాయిలర్ ఆకస్మికంగా పేలిపోవడంతో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. పేలుడు ధాటికి బాయిలర్ వద్ద పనిచేస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, ఎగసిపడిన శిథిలాలు తగలడంతో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ సిబ్బందితో పాటు మరో ఇద్దరు కార్మికులు ఉన్నారన్నారు. మరణించిన వారిలో ఒకరు కోల్‌కతా, ఇద్దరు తమిళనాడు, మరో ఇద్దరు స్థానికంగా చెర్వి, తడ ప్రాంతాలకు





చెందినవారన్నారు. ప్రమాదంలో మరెవరికీ గాయాలు కాలేదన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు వెంటనే స్పందించి, బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని, సహాయ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారన్నారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలసి ఇతర అధికారులు ఉదయం 10:00 - 10:30 గంటల మధ్యలోనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయిందని, దహన సంస్కారాల కోసం శ్రీసిటీ యజమాన్యం తగిన ఏర్పాట్లు చేస్తోందని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షల చొప్పున పరిహారం రాబోయే 2 రోజుల్లో అందజేయడం జరుగుతుందన్నారు. మృతుల పిల్లల ఉన్నత చదువులతో సహా అన్ని విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యమే భరిస్తుందన్నారు. అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో తక్షణమే ఉద్యోగావకాశం కల్పిస్తారన్నారు. బాధ్యులపై ప్రిలిమినరీ కేస్ నమోదు చేయడంతో పాటు బాయిలర్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్ మరియు పోలీస్ శాఖల ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విచారణ అనంతరం నిర్లక్ష్యానికి కారణమైన వారిపై తగిన కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన తిరుపతి బాయిలర్ ఇన్స్పెక్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. గత 18 ఏళ్లలో శ్రీసిటీలో ఇటువంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారను, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో వెంటనే థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు.ఈ సమావేశంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి, శ్రీ సిటీ ఎండి రవి అన్నా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం ఇంట మంత్రి పెందుర్తి వెంకటేష్ కుటుంబం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాల నిర్వహణ శాఖా మంత్రివర్యులు మరియు తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్ మరియు వారి సతీమణి పెందుర్తి అన్నపూర్ణ తమ సమీప బంధువైన శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, గుడ్లూరు ఐశ్వర్య లక్ష్మి ఇంటికి విచ్చేసి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. పెందుర్తి వెంకటేష్ గుడ్లూరు ఐశ్వర్య లక్ష్మికి స్వయానా చిన్నాన్న అవుతారు. వారికి ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు స్వాగతం పలికిన అనంతరం శ్రీకాళహస్తి ఎంజీఎం గ్రూప్ నిర్మిస్తున్న సిబిఎస్ఇ స్కూల్ ని సందర్శించి పలు సూచనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ వున్నదని అభివృద్ధికి కేంద్రంగా మారిందని అందువల్ల అనేకమంది ఈ ప్రాంతంలో పరిశ్రమలు నిర్మించుటకు ముందుకు వస్తున్నారని నందమూరి తారక రామారావు తీసుకొచ్చిన తెలుగుగంగ ప్రాజెక్ట్ మూలంగా వ్యవసాయ పరంగాను, విద్యా రంగంలోనూ, పారిశ్రామిక పరంగాను, ఆధ్యాత్మిక పరంగాను ఇలా ఎన్నోరంగాలలో అభివృద్ధి చెందుతున్నదని, అలాగే శ్రీకాళహస్తి లో ఎంజీఎం గ్రూప్ చేస్తున్న ఎన్నో సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని తెలిపారు.



# ప్రజా ప్రయోజనమే జర్నలిజం ప్రధాన లక్ష్యం

## -: సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

## ప్రజలకు--ప్రభుత్వానికి వారధులుగా పాత్రికేయులు: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని






ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

సామాన్య ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడమే జర్నలిజం ప్రధాన ఉద్దేశమని సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో శనివారం సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుపతి జిల్లా గ్రామీణ విలేకరుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల్లో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నానితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ జర్నలిజంపై ప్రేమతో పనిచేస్తున్న గ్రామీణ విలేకరులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, సమాచార ప్రసార విధానాలకు అనుగుణంగా జర్నలిస్టులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వార్తలను సంక్షిప్తంగా, స్పష్టంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా అందించడం జర్నలిస్టులకు అవసరమైన ముఖ్యమైన నైపుణ్యమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామీణ విలేకరులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు, స్థానిక పరిస్థితులు, సామాజిక అంశాలను సమగ్రంగా తెలుసుకుని వాస్తవాలను ఆధారంగా చేసుకుని వార్తా కథనాలను రూపొందించాలని సూచించారు. రాజ్యాంగం ప్రజలకు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛలోనే పత్రికా స్వేచ్ఛ ఇమిడి ఉందని, ఆ స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని తెలిపారు.

**ప్రజలకు-ప్రభుత్వానికి వారధులుగా పాత్రికేయులు:ఎమ్మెల్యే పులివర్తి నాని**

చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పాత్రికేయులు పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో గ్రామీణ విలేకరుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికంగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు దోహదపడగలరని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జర్నలిస్టులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధిగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించాలి**

కృత్రిమ మేధ వినియోగంపై విజయ్ కుమార్ కుర్రా విలేకరులకు అవగాహన కల్పించారు. మానవ మేధతో కృత్రిమ మేధను సమన్వయం చేసుకుని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ సాధనాలు జర్నలిస్టుల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఉపయోగపడతాయని, అయితే ఏఐ ద్వారా అందే సమాచారాన్ని పూర్తిగా నమ్మకుండా వాస్తవ నిర్ధారణ చేసిన తర్వాతే వార్తల్లో వినియోగించాలని తెలిపారు. ఏఐలో కూడా తప్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ఫ్యాక్ట్ చెకింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చాట్‌జీపీటీ, జెమిని, క్లాడ్, గ్రోక్ వంటి వివిధ ఏఐ సాధనాల వినియోగం, వాటి ప్రత్యేకతలను సోదాహరణంగా వివరించారు. అవసరానికి అనుగుణంగా స్పష్టమైన, నిర్మాణాత్మకమైన ప్రాంప్ట్‌లను రూపొందించడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చని తెలిపారు. ఫొటోల ఆధారంగా సమాచారాన్ని పరిశీలించడం, ఫ్యాక్ట్ చెకింగ్ చేయడం కోసం గూగుల్ లెన్స్ వంటి సాధనాలను వినియోగించుకోవచ్చని వివరించారు. వార్తల రూపకల్పన, మంచి హెడ్‌లైన్ల తయారీ, ఇంటర్వ్యూలకు అవసరమైన ప్రశ్నల రూపకల్పన వంటి అంశాల్లో నోట్‌బుక్ ఎల్‌ఎం తదితర ఏఐ సాధనాలు ఉపయోగపడతాయని తెలిపారు. అయితే వ్యక్తిగత, సున్నితమైన సమాచారాన్ని ఏఐ సాధనాల్లో నమోదు చేయడం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. 'మానవీయ కథనాలు' అంశంపై సీనియర్ జర్నలిస్ట్ సురేష్ పిళ్లై ప్రసంగించారు. మానవీయ కథనాలు రాసేటప్పుడు సంబంధిత వ్యక్తులు, ప్రాంతాల పట్ల సహానుభూతితో వ్యవహరించాలని సూచించారు. సాధారణ వార్తకు మానవీయ కోణాన్ని జోడించడం ద్వారా మరింత ప్రభావవంతమైన కథనాన్ని రూపొందించవచ్చని తెలిపారు. సమస్యకు సంబంధించిన వ్యక్తులను స్వయంగా కలిసి మాట్లాడటం, వారి అనుభవాలను తెలుసుకోవడం, అవసరమైన సమాచారాన్ని సేకరించడం, తగిన పరిశోధన చేయడం ద్వారా పాఠకులను ఆకట్టుకునే కథనాలను రూపొందించవచ్చని వివరించారు. కేవలం విషాదం లేదా జాలిగొలిపే కథనాలే మానవీయ కథనాలు కాదని, విజయగాథలు, కళలు, నైపుణ్యాలు, స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల జీవితాలు కూడా మానవీయ కథనాల పరిధిలోకి వస్తాయని తెలిపారు. జర్నలిస్టులు నిరంతరం కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపన కలిగి ఉండాలని, సమాజంలో మార్పుకు దోహదపడే విధంగా ఆలోచన రేకెత్తించే కథనాలను రాయాలని సూచించారు.

**రాజ్యాంగం, పత్రికా చట్టాలపై అవగాహన అవసరం**

'రాజ్యాంగం-పత్రికా చట్టాలు' అంశంపై సీనియర్ జర్నలిస్ట్ డా. టి. జనార్దన్ ప్రసంగించారు. దేశ పౌరులందరికీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ద్వారా కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను పత్రికా రంగం కూడా వినియోగించుకుంటుందని తెలిపారు. అదే సమయంలో ఆర్టికల్ 19(2)లో పేర్కొన్న పరిమితులు, వార్తల ప్రచురణకు సంబంధించిన నియమ నిబంధనలపై జర్నలిస్టులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వార్తలు రాసే సమయంలో వాస్తవాలను నిర్ధారించుకోవడంతో పాటు రాజ్యాంగపరమైన నిబంధనలు, పత్రికా చట్టాలు, వృత్తిపరమైన ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ప్రజలకు సమాచారాన్ని అందించే క్రమంలో బాధ్యతాయుతమైన పాత్రను పోషించాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పునశ్చరణ తరగతుల్లో గ్రామీణ జర్నలిజం, కృత్రిమ మేధ వినియోగం, మానవీయ కథనాలు, రాజ్యాంగం--పత్రికా చట్టాలు తదితర అంశాలపై నిపుణులు గ్రామీణ విలేకరులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర బ్యూరో చీఫ్ డా. ఎం. ప్రసాద్, జిల్లా విలేకరులు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు, సి.ఆర్. మీడియా అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా అధునాతన వైద్య సేవలు

## రుద్ర నారాయణ చారిటబుల్ ట్రస్ట్ 'సంపూర్ణ ఆరోగ్య రక్ష' పోర్టబుల్ మిషన్ డెమోను పరిశీలించిన తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సాంకేతికతను జోడించి, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్య పరీక్షలను అత్యంత తక్కువ ఖర్చుతో చేరువ చేయాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా రుద్ర నారాయణ చారిటబుల్ ట్రస్ట్ మెడికల్ వింగ్ ఆధ్వర్యంలో 'సంపూర్ణ ఆరోగ్య రక్ష' వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తుడా కార్యాలయంలో తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి సమక్షంలో అత్యాధునిక పోర్టబుల్ హెల్త్ స్క్రీనింగ్ మిషన్ డెమో కార్యక్రమాన్ని ట్రస్ట్ ప్రతినిధులు నిర్వహించారు. ఈ డెమో కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ ప్రతినిధులు తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డికి స్వయంగా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మిషన్ ఎలా పనిచేస్తుందో ప్రత్యక్షంగా చూపించారు. సాధారణంగా ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లలో ఈ స్థాయి సమగ్ర పరీక్షలు చేయించుకోవాలంటే దాదాపు రూ. 6,500 పైగా ఖర్చు అవుతుంది. గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, విద్యాసంస్థలు మరియు ఉద్యోగ సంస్థల వద్దకే నేరుగా వెళ్లి ఈ సేవలు అందించేలా పోర్టబుల్ వ్యవస్థను రూపొందించామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. పరికరం యొక్క పనితీరు, వేగవంతమైన స్క్రీనింగ్ విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి ట్రస్ట్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

# స్విమ్స్‌లో గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహణ..!






ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి: (చంద్రగిరి ) శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కార్డియాలజీ విభాగం, అనస్థీషియాలజీ, కార్డియో థొరాసిక్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్యా విద్య కార్యక్రమం (సిఎంఇ) శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్ తెలియజేశారు. ఈ సిఎంఇ కార్యక్రమంను స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా॥ గుడారు జగదీష్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. కార్డియాలజీ విభాగాధిపతి డా॥ వనజాక్షమ్మ, అనస్థీషియాలజీ విభాగాధిపతి డా॥అలోక్ సమంత్ రే, సి.టి.సర్జరీ విభాగాధిపతి డా॥ సత్యవతి. డా.పి. వహీద్ ఖాన్, డా. కె. అనిల్ కుమార్, డాక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి,బి. బ్రహ్మ జానా రెడ్డి, డాక్టర్ ఎన్. సునీల్, డాక్టర్ టి. చిరంజీవి, డా॥ మాధవి, డా॥సుధారాణి సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ వనజాక్షమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో... కార్డియాలజీ విభాగం, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ పి. వహీద్ ఖాన్ కార్డియాలజీ, "మీ హృదయం చెప్పేది వినండి- హెచ్చరిక సంకేతాలను విస్మరించకండి" అనే అంశంపై మాట్లాడుతూ, గుండెపోటుకు సంబంధించిన ముందస్తు హెచ్చరిక సంకేతాలను గుర్తించడం, ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు, అకస్మాత్తుగా అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాల్సిన అవసరాన్ని వివరించారు. కార్డియాలజీ విభాగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. అనిల్ కుమార్ – గుండె ఆరోగ్యానికి యోగా మీ లయను కనుగొనండి. గుండె ఆరోగ్యానికి సంబంధించిన యోగ గురించి అనే అంశంపై మాట్లాడుతూ, యోగా, ధ్యానం, శ్వాస వ్యాయామాలు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో, ప్రశాంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంలో, గుండె ఆరోగ్య పరిరక్షణలో సహాయపడతాయని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.కార్డియాలజీ విభాగం, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి ఈట్ స్మార్ట్ కిప్ ది బీట్ అనే అంశంపై మాట్లాడుతూ, సమతుల్య ఆహారం, తాజా పండ్లు, కూరగాయలు, తక్కువ ఉప్పు, తక్కువ సంతృప్త కొవ్వులు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధుల ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను తెలియజేశారు.కార్డియాలజీ విభాగం, సీనియర్ రెసిడెంట్,డాక్టర్ బి. బ్రహ్మ జాన రెడ్డి సెట్ బ్యాక్ టు స్ట్రెంత్ అనే అంశంపై మాట్లాడుతూ, గుండె సంబంధిత సమస్యల నుంచి కోలుకుంటున్న రోగులు వైద్యుల సూచనల మేరకు క్రమబద్ధమైన వ్యాయామం, తగిన విశ్రాంతి, మందుల వినియోగం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా క్రమంగా సాధారణ జీవనానికి చేరుకోవచ్చని వివరించారు.అనస్థీషియాలజీ విభాగం, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ ఎన్. సునీల్ "పెరియోపరేటివ్ అరిథ్మియాస" అనే అంశంపై మాట్లాడుతూ, శస్త్రచికిత్సకు ముందు, శస్త్రచికిత్స సమయంలో, అనంతరం గుండె లయలో సంభవించే మార్పులు, వాటిని ముందుగానే గుర్తించడం, నిరంతర పర్యవేక్షణ, తగిన వైద్య నిర్వహణ ఆవశ్యకతను పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.కార్డియోథొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జరీ (సి.టి.వి.ఎస్), అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ టి. చిరంజీవిలి "గుండె లయలో అసాధారణతలకు శస్త్రచికిత్స" కార్డియాక్ అరిథిమియాస్ అనే అంశంపై మాట్లాడుతూ, గుండె లయకు సంబంధించిన కొన్ని సమస్యల్లో శస్త్రచికిత్సా విధానాలు, అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతులు, రోగి పరిస్థితిని బట్టి చికిత్సను ఎంపిక చేసే విధానాల గురించి వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా గుండె ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన ఆహారపు అలవాట్లు, యోగా, శారీరక వ్యాయామం, ఆధునిక వైద్య చికిత్సా విధానాలపై పాల్గొన్న వారికి అవగాహన కలిగింది. గుండె సంబంధిత వ్యాధులను నివారించడంలో అవగాహన, ముందస్తు పరీక్షలు, సమయానికి వైద్య సహాయం పొందడం కీలకమని వైద్య నిపుణులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్డియాలజీ, అనస్థీషియా, సి.టి.సర్జరీ విభాగపు వైద్యులు, పి.జి.వైద్య విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి గ్రామోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి వరమాల పేట

తిరుమల తిరుపతి దేవస్థానం రూపొంది ఆలయమైన అప్పలాయ గుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్సేవ, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామి వారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి అలంకరణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుతీర్చారు. శ్రీనివాసుడు గంట పాటు సిద్వచలాసంగా ఊయలలూగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి శ్రీనివాసుడు పురవీధుల్లో విహరించారు. స్థానిక భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమం టెంపుల్ సూపర్డెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్, అర్చకులు తిప్పయాచార్యులు, రమణాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## సి ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ శిక్షణా తరగతులు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

సి ఆర్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్ లో గ్రామీణ పాత్రికేయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా రెండో రోజున ఆదివారం శిక్షణ తరగతులు కొనసాగనుందని డి ఐ పి ఆర్ ఓ పి.గురుస్వామి చెట్టి తెలిపారు.

తిరుపతిలో అక్టోబర్ 3, 4 తేదీలలో నిర్వహిస్తున్న గ్రామీణ పాత్రికేయుల శిక్షణ తరగతులలో భాగంగా మొదటి రోజు తరగతులు విజయవంతంగా పూర్తి అయిందని రెండో రోజు శిక్షణ తరగతులు యధావిధిగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. రెండవ రోజు శిక్షణా తరగతులలో భాగంగా అక్టోబర్ 4వ తేదీ ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి 11:00 వరకు సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ ద్వారా పత్రికా భాష పై, ఉదయం 11.15 నుండి 12.15 వరకు నరేష్ నందన్ ద్వారా ఫ్యాక్ట్ చెక్ పై, మధ్యాహ్నం 12:30 నుంచి 1:30 గంటల వరకు శ్రీశైలం రమేష్ ద్వారా క్రైమ్ రిపోర్టింగ్ పై, మధ్యాహ్నం 2.30 నుండి 3.30 గంటల వరకు సోమ సుందరం ద్వారా గ్రామీణ వార్తలు కథనాలు పై శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, పాత్రికేయులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని డి ఐ పి ఆర్ ఓ పై ప్రకటనలో కోరారు.

## నందనం అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 300 అట్లాస్ పుస్తకాల పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

నందనం అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి ఆధ్వర్యంలో పవిత్రమైన శ్రీవేంకటేశ్వర స్వామి వారి మూడవ శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని కరకంబాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 300 అట్లాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందనం అకాడమీ అధినేత డా. వివేక్ పత్తిపాటి మాట్లాడుతూ "పిల్లలకు అట్లాస్ పుస్తకం అనేది కేవలం పుస్తకం కాదు, ప్రపంచాన్ని చూసే కిటికీ అని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏ విధంగానూ వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఈ చిన్న ప్రయత్నం చేశామన్నారు. శ్రీవారి ఆశీస్సులతో ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని సంకల్పించామన్నారు. విద్యార్థులకు ఇవి ఎంతో అవసరమని గుర్తించి పంపిణీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయులు రవీంద్ర, ముత్యాలరెడ్డి, నీలకంఠయ్య తదితరులు పాల్గొని డా. వివేక్ సేవలను అభినందించారు. విద్యార్థుల చదువుకు ఉపయోగపడే విధంగా అట్లాస్ పుస్తకాలు అందించడం ఎంతో అభినందనీయమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**- : పీజీఆర్ఎస్ పిటిషన్ ల పరిశీలన.. సరిగా ఎండార్స్మెంట్లు ఇవ్వని కారణంగా మండల సర్వేయర్, తహసీల్దార్, ఎంపీడీవోలకు మెమో జారీ..**

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం జిల్లా తాడిపత్రి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) అర్జీల డిస్పోజల్ నాణ్యతను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పిజిఆర్ఎస్ అర్జీలకు సరిగా ఎండార్స్మెంట్లు ఇవ్వని కారణంగా మండల సర్వేయర్, తహసీల్దార్, ఎంపీడీవోలకు మెమో జారీ చేశారు. పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి స్పీకింగ్ ఆర్డర్స్ సరిగా ఇవ్వని కారణంగా తహసిల్దార్ కు, అర్జీలకు సంబంధించి సర్వే చేసి సరైన ఎండార్స్మెంట్ ఇవ్వని కారణంగా మండల సర్వేయర్ కు, అర్జీలను పరిశీలించకుండా ముందుకు పంపించినందుకు ఎంపిడిఓలకు జిల్లా కలెక్టర్ మెమోలు జారీ చేశారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం నాణ్యతగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో ప్రభుత్వ ఆసుపత్రికి ప్రథమ స్థానం

### -పారిశుద్ధ్య కార్మికుల సేవలే ఈ గుర్తింపునకు కారణం - మెడికల్ సూపరింటెండెంట్ అఫ్తాఫ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రి స్వచ్ఛతలో ప్రథమ స్థానంలో నిలవడానికి నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులే ప్రధాన కారణమని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అఫ్తాఫ్ పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రతిక్షణం ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ఆయన అభినందించారు. స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాల్లో హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి స్వచ్ఛతలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఇందుకు గుర్తింపుగా శుక్రవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అఫ్తాఫ్ స్వచ్ఛ అవార్డును అందుకున్నారు. ఆసుపత్రిలో పరిశు



భ్రత ప్రమాణాలను పాటించడం, రోగులు, వారి సహాయకులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, వ్యర్థాలను క్రమబద్ధంగా తొలగించడం తదితర అంశాల్లో ఆసుపత్రి సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అఫ్తాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు శాలు వాలు కప్పి అభినందనలు తెలిపారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. రోగులకు వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన వాతావరణం అందించడం కూడా ఆసుపత్రి నిర్వహణలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ప్రతి విభాగం, వార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, రోగుల రాకపోకలు ఉండే ప్రాంతాలను నిరంతరం శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ ఆసుపత్రి పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్న కార్మికుల సేవలకు దక్కిన గుర్తింపుగా ఈ అవార్డును భావిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛతను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. వైద్యులు, నర్సులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు, పారిశుద్ధ్య కార్మికులు సమన్వయంతో పనిచేస్తే ఆసుపత్రిని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఆర్ఎంఓ, పారిశుద్ధ్య విభాగం కాంట్రాక్టర్ యుగంధర్, ఆసుపత్రి సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా విద్యార్థినులకు అవగాహన

- మహిళా భద్రత, శక్తి యాప్‌పై అవగాహన.
- డ్రగ్స్, ర్యాగింగ్, లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన.
- సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన.
- చదువుపై దృష్టి సారించి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచన.

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ శ్రీనివాసులు, అదనపు ఎస్పీ శ్రీమతి శ్రీలత, ఈగల్ టీమ్ అధికారులు, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలుశ్రీనివాసులు, శ్రీలత విద్యార్థినులతో మాట్లాడుతూ మహిళల భద్రత, శక్తి యాప్, ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ పెట్టుబడుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులు, అనుమానాస్పద వీడియో కాల్స్‌ను స్వీకరించవద్దని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఓటీపీలువంటి సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

# స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్రలో మెప్మాకు మూడు అవార్డులు

### -అభినందించిన మున్సిపల్ కమిషనర్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎస్ఏఎస్ఏ (స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర) అవార్డుల్లో శ్రీ సత్యసాయి జిల్లా మెప్మాకు మూడు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. హిందూపురం వివేకానంద ఎస్ఎల్ఎఫ్ ఈ అవార్డుల్లో గుర్తింపు సాధించి జిల్లాకు, మెప్మాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. శనివారం హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వి. మల్లికార్జున చాంబర్‌లో అవార్డులను ప్రదర్శించిన సందర్భంగా మెప్మా ప్రతినిధులు మాట్లాడారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో పట్టణాల్లో స్వచ్ఛత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత తదితర అంశాల్లో చేపడుతున్న కార్యక్రమాలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత లబ్ధిదారులు, ఆర్పీలు అవార్డులను మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. నాగరాజు తదితరుల చేతుల మీదుగా స్వీకరించినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలను స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, ప్రజల్లో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల ద్వారా మెప్మా చేస్తున్న కృషికి ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఎస్ఎల్ఎఫ్‌లు, ఆర్పీలు, లబ్ధిదారులు, ఆర్పీలు, మెప్మా సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ గంగులయ్య, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

# కసనూరు, సింహాద్రిపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు

### బీటెక్ రవి ఆధ్వర్యంలో బసవతారకం ఆస్పత్రి సేవలు

ప్రజాభూమి, పులివెందుల



ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పులివెందుల టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ - మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ సహకారంతో ఈ క్యాంపులు జరగనున్నాయ కసనూరులో అక్టోబర్ 5 మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో,సింహాద్రిపురంలో అక్టోబర్ 6, 7 తేదీల్లో - ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు చోట్ల ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు కొనసాగుతాయి.క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు ఇది మంచి అవకాశమని, నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని బీటెక్ రవి పిలుపునిచ్చారు.

# సుబ్బలక్షుమమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించిన ప్రసాద్ బాబు

ప్రజాభూమి, రాయచోటి

రాయచోటి పట్టణం కొత్తపేట రోడ్డు, పిండిమిషన్ సందులో నివాసముంటున్న మట్టా సుబ్బారావు తల్లి మట్టా సుబ్బలక్షుమమ్మ మరణించిన విషయం తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు వారి స్వగృహానికి వెళ్లి మట్టా సుబ్బలక్షుమమ్మ భౌతిక కాయానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ అపారమైన దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, మట్టా సుబ్బలక్షుమమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.సుబ్బలక్షుమమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్‌లో దేశ, విదేశీ ప్రముఖ వైద్య నిపుణుల సేవలు..!

### దుబాయ్ నుంచి పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ నిపుణుడు.. తెలంగాణ నుంచి జనరల్ మెడిసిన్ నిపుణుడు..

### గుంటూరు మెడికల్ కాలేజీ నుంచి కమ్యూనిటీ మెడిసిన్ నిపుణుల సేవలు..

### అత్యున్నత వైద్య నిపుణుల అనుభవాన్ని స్విమ్స్ రోగులకు చేరువ చేస్తున్నాం:స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్..

ప్రజాభూమిప్రతినిధి తిరుపతి:( చంద్రగిరి)

శ్రీవారి వైద్య సేవలో భాగంగా దేశ, విదేశాల్లో వైద్య రంగంలో విశేష అనుభవం కలిగిన ప్రముఖ వైద్య నిపుణులను స్విమ్స్‌కు ఆహ్వానించి, వారి ప్రత్యేక వైద్య పరిజ్ఞానం, అనుభవం, నైపుణ్యాన్ని పేద, మధ్యతరగతి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ తెలిపారు. స్విమ్స్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలకు మరింత బలం చేకూర్చేలా దేశ, విదేశీ ప్రముఖ వైద్య నిపుణులతో నిపుణుల సంప్రదింపులు, క్లిష్ట కేసులపై ప్రత్యేక వైద్య సలహాలు, తదుపరి చికిత్సా విధానాలపై సూచనలు అందించేలా శ్రీవారి వైద్య సేవలను విస్తరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి స్విమ్స్‌కు వచ్చే రోగులకు తమ ప్రాంతాల్లో సులభంగా అందుబాటులో లేని ప్రత్యేక వైద్య నైపుణ్యాన్ని స్విమ్స్‌లోనే పొందే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని డా. గుడారు జగదీష్ తెలిపారు.







**దుబాయ్ నుంచి పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ నిపుణుడి సేవలు**

శ్రీవారి వైద్య సేవలో భాగంగా దుబాయ్ సిటీ హాస్పిటల్‌లో కన్సల్టెంట్ పి ఐ సి యు మెడిసిన్‌గా, ఎం బి ఆర్ యు మెడికల్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. రమేష్ కుమార్ రామచంద్రన్ స్విమ్స్‌లో సేవలు అందించారు. 16 సంవత్సరాల వైద్య అనుభవం కలిగిన డా. రమేష్ కుమార్ రామచంద్రన్ పీడియాట్రిక్ క్రిటికల్ కేర్, చిన్నారుల అత్యవసర వైద్యం, ఇంటెన్సివ్ కేర్ తదితర రంగాల్లో ప్రత్యేక అనుభవం కలిగి ఉన్నారు.స్విమ్స్‌లో చిన్నారులను పరిశీలించిన ఆయన వారి ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక వైద్య సలహాలు, చికిత్సా సూచనలు అందించారు. తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో చిన్నారులకు అందించాల్సిన అత్యవసర వైద్యం, క్రిటికల్ కేర్‌కు సంబంధించిన అంశాలపై స్విమ్స్ వైద్యులతో తన అనుభవాన్ని పంచుకున్నారు.

జనరల్ మెడిసిన్‌లో డా. శ్రీకాంత్ నిపుణుల సేవలు

తెలంగాణకు చెందిన డా. శ్రీకాంత్ జనరల్ మెడిసిన్‌లో సుమారు 15 సంవత్సరాల అనుభవం కలిగిన వైద్య నిపుణులు. ప్రస్తుతం డిప్యూటీ సివిల్ సర్జన్, డైరెక్టర్, సెకండ్ హెల్త్‌తో పాటు వికారాబాద్‌లోని ఆదర్శ్ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్‌లో రోగులను పరిశీలించిన ఆయన సాధారణంతో పాటు సంక్లిష్ట ఆరోగ్య సమస్యలపై నిపుణుల వైద్య సలహాలు అందించారు. అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సా విధానాలు, తదుపరి వైద్య సంరక్షణకు సంబంధించిన సూచనలు చేశారు.

**ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి - డా. బండి శివ గోపాల్**

గుంటూరు మెడికల్ కాలేజీలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా. బండి శివ గోపాల్ కూడా శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్‌లో సేవలు అందించారు. ఆరు సంవత్సరాల వైద్య అనుభవం కలిగిన ఆయన ప్రజారోగ్యం, వ్యాధుల నివారణ, ఆరోగ్య అవగాహన, వ్యాధుల నియంత్రణ, సమాజ ఆధారిత వైద్య సేవలు తదితర అంశాల్లో తన నైపుణ్యాన్ని వినియోగించారు.రోగులకు ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవసరమైన సూచనలు అందించారు. అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో ప్రత్యేక వైద్య సేవలు శ్రీవారి వైద్య సేవలో భాగంగా అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో ఈ ముగ్గురు వైద్య నిపుణులు స్విమ్స్‌లో రోగులను పరిశీలించి, ప్రత్యేక వైద్య సలహాలు మరియు సేవలు అందించారు.

**ప్రముఖ నిపుణుల అనుభవం.. స్విమ్స్ వైద్య సేవలకు మరింత బలం**

దేశ, విదేశాల్లోని ప్రముఖ వైద్య నిపుణుల సేవలను స్విమ్స్‌కు అనుసంధానం చేయడం ద్వారా అత్యంత సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలపై నిపుణుల అభిప్రాయాలు, ప్రత్యేక వైద్య సలహాలు, ఆధునిక చికిత్సా విధానాలపై మార్గదర్శకత్వం రోగులకు అందుబాటులోకి వస్తుందని డా. గుడారు జగదీష్ తెలిపారు."స్విమ్స్‌కు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, ఆధునిక వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. దేశ, విదేశాల్లో విశేష అనుభవం కలిగిన వైద్య నిపుణుల సేవలను స్విమ్స్‌కు అనుసంధానం చేయడం ద్వారా వారి ప్రత్యేక వైద్య పరిజ్ఞానం రోగులకు చేరువవుతుంది. ముఖ్యంగా క్లిష్టమైన కేసుల్లో నిపుణుల అభిప్రాయాలు రోగుల చికిత్సకు ఎంతో ఉపయోగపడతాయి. భవిష్యత్తులో మరిన్ని వైద్య విభాగాలకు చెందిన ప్రముఖ నిపుణుల సేవలను స్విమ్స్‌లో అందుబాటులోకి తీసుకువస్తాం" అని ఆయన తెలిపారు. శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్‌లో అందుబాటులోకి వస్తున్న ప్రముఖ వైద్య నిపుణుల సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని డా. గుడారు జగదీష్ కోరారు.

# కేంద్ర ప్రభుత్వ పథకం వేజీ రామ్ జీ పథకం కింద 223 అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం కౌకుంట్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉరవకొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించాము. ఈ సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడాను. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ ద్వారా కృషి చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకం వేజీ రామ్ జీ పథకం కింద 223 అభివృద్ధి పనులకు సుమారు రూ.13 కోట్ల మేర ప్రభుత్వ అనుమతులు తీసుకుని సిమెంట్ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. ఉరవకొండ నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి






చేస్తున్నాను. గాలి విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాల్లో ప్రముఖ సంస్థలతో చర్చించి సుమారు 3,500 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు కృషి చేశాం. దీనివల్ల యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుంది. రాబోయే 100 రోజుల్లో ఇరిగేషన్ కాలువల విస్తరణకు చర్యలు చేపట్టి జిల్లాకు మరింత సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న కృషికి మనమంతా అండగా నిలవాలి. అదేవిధంగా మదనపల్లిలో గ్లోబల్ హార్టికల్చర్ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా రాయలసీమలో ఉద్యానవన రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, జిల్లా ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ ఏరాస ప్రతాప్ రెడ్డి, స్థానిక నాయకులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రజల సంక్షేమం, ఉరవకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం సమష్టిగా ముందుకు సాగుదాం.

# జగన్ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం

### - వైసిపి పదవులుపొందిన వారికి గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాభూమి, రాయచోటి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు, దిగువ అబ్బవరం గ్రామ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.రాయచోటి రూరల్ మండలం దిగువ అబ్బవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు చేపట్టిన నాయకులు, కార్యకర్తలకు శ్రీకాంత్‌రెడ్డి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిగువ అబ్బవరం గ్రామ పరిధిలో క్రికెట్ స్టేడియం, ఎంఐజీ లేఅవుట్ వంటి విలువైన ప్రజా ఆస్తులను



నిర్మించామని తెలిపారు. గ్రామంలో 250 కు పైగా పక్కా ఇళ్లను మంజూరు చేసి పేద కుటుంబాలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అప్పటి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేసిందన్నారు.పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో ముందుకు సాగాలని శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలకు ఎప్పుడూ పెద్దపీట వేస్తామని, వారికి అప్పగించిన బాధ్యతలకు ఈ గుర్తింపు కార్డులు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.గుర్తింపు కార్డులు పొందిన పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే, వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తారని తెలిపారు. పార్టీ గుర్తింపు కార్డు పొందిన కార్యకర్త ప్రమాదంలో మృతి చెందితే రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని పది రోజుల్లోగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా భావిస్తూ, వారి సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, నాయకులు ఎం.వెంకట్రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్రమణ్యం, వెంకటరమణ, చిన్నరవి, మల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, చిరంజీవి, రవి, సాయిరాం, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# ఆట స్థలం లేక గురుకుల విద్యార్థుల అవస్థలు



**❖రాళ్ల మధ్య.. చెట్ల నీడన క్రీడా సాధన ❖శిథిలావస్థలో విద్యుత్ స్తంభాలు.. భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన**

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు, వ్యాయామం కూడా ఎంతో అవసరం. అయితే అడ్డతీగల గురుకుల పాఠశాల విద్యార్థులకు కనీసం క్రీడా మైదానం కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన ఆటస్థలం లేక రాళ్లతో కూడిన ప్రదేశంలో, చెట్ల నీడన విద్యార్థులు సమయం గడపాల్సిన పరిస్థితి నెలకొంది.గురుకుల పాఠశాల, గురుకుల కళాశాల విద్యార్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిమిత స్థలాన్ని వేర్వేరుగా వినియోగించుకోవాల్సి వస్తోంది. దీంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో క్రీడలు, వ్యాయామం చేసే అవకాశం లేకుండా పోతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశా లలో క్రీడా మైదానం లేకపోవడం వల్ల విద్యార్థుల శారీరక దారుఢ్యంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇటీవల పాఠశాల ప్రాంగణంలోని శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని తొలగించారు. ప్రస్తుతం ఆ స్థలం ఖాళీగా ఉండటంతో దాన్ని విద్యార్థుల కోసం క్రీడా మైదానంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తల్లిదండ్రులు సూచిస్తున్నారు. అవసరమైన నిధులు కేటాయించి స్థలాన్ని చదును చేసి, క్రీడా మైదానంగా తీర్చిదిద్దితే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు.

**శిథిల విద్యుత్ స్తంభాలతో ముప్పు...**మరోవైపు పాఠశాల ప్రాంగణంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలు కూడా ఆందోళనకు కారణమవుతున్నాయి. కొన్ని స్తంభాలు ఒరిగిపోగా, మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యార్థులు నిత్యం సంచరించే ప్రాంగణంలో ఇటువంటి స్తంభాలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు ఖాళీగా ఉన్న స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అక్టోబర్ 2 ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కానీ ఉద్యోగస్తులకు మూడు రోజులు సెలవు...?

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలంలోని ప్రభుత్వ కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కిందిస్థాయి సిబ్బంది నుండి పెద్ద స్థాయి సిబ్బంది వరకు అక్టోబర్ రెండు ప్రభుత్వ సెలవు అని తెలుసుకొని శనివారం కార్యాలయాలకు దుమ్మా కొడితే ఆదివారం సెలవు కావున దీని అదునుగా చేసుకొని అటు కొన్ని పంచాయితీ లలో సచివాలయ సిబ్బంది తప్ప ఇంకెవరు కనిపించలేదు మండల పరిషత్ కార్యాలయంలో అయితే అసలు క్రింది సిబ్బంది తప్ప ఇంకెవరూ కనిపించలేదు కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు కూడా కనిపించలేదు అంటే అక్టోబర్ 2 ఒక్కరోజు సెలవు కాదు రెండు రోజులు సెలవులు ఇచ్చింది ప్రభుత్వం అని ప్రజలు అనుకుంటున్నారు<.

పోలవరం ముంపు ప్రాంతం ఏజెన్సీ అవ్వడంతో అందరూ కూడా మైదాన ప్రాంతం నుండి ఇక్కడికి ఉద్యోగరీత్యా వచ్చినవారే కదా అందుకే ఒక్కరోజు సెలవు వస్తే తరువాత ముందు రోజు సెలవు ఉంది అని తెలుసుకొని ఆ రెండో రోజు కార్యాలయాలకు సెలవు ప్రకటించి వారు క్రింది సిబ్బందికి పనులు అప్పగించి దుమ్మా కొడుతున్నారు ఇది మండల స్థాయి అధికారుల పనితీరు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఎవరైతే శనివారం సెలవు ప్రకటించారు విధులకు తెలుసుకొని వారిపై తగు చర్య తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నాను

# కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

## అడ్డతీగల సీహెచ్‌సీలో జేఏసీ వినతిపత్రం



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

వైద్య, ఆరోగ్య శాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య పర్యవేక్షకుడు డాక్టర్ మహేష్‌రెడ్డికి జేఏసీ నాయ కులు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,600 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు 16 ఏళ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. పూర్తి వేతనం పునరుద్ధరించాలని, 2018 నుంచి అమల్లో ఉన్న వేతన తగ్గింపుపై సమీక్ష జరిపి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్ శాశ్వత నియామకాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి ప్రాధాన్యత కల్పించాలని, జేఏసీతో చర్చించి సమస్యలకు కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.డిమాండ్లు పరిష్కరించకపోతే అక్టోబర్ 4 నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. 4న కలం పక్కన పెట్టి నిరసన, 5న శాంతియుత నిరసనలు, 6న అత్యవసర సేవలను మినహాయించి సాధారణ సేవల బహిష్కరణ, 7న అన్ని రకాల సేవలను బహిష్కరించే కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గొట్టిపల్లి రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంగన్‌వాడీ, పోషణ మాసోత్సవాలు

## గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల ప్రాజెక్టు, అడ్డతీగల సెక్టార్ పరిధిలోని కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ ఉత్సవాలు, పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ పి. అరుణలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. 7 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల తల్లులు, మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లల తల్లులకు పిల్లల ఎదుగుదలలో పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల టీడీపీ అధ్యక్షుడు జర్తా వెంకటరమణారెడ్డి తల్లులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.అనంతరం ఇద్దరు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. అరుణలత, కొత్తపాలెం అంగన్‌వాడీ టీచర్ జె. పార్వతి, అరకు పార్లమెంట్ కోఆర్డినేటర్ తోకల సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు కట్ట శ్రీను, గజ్జి వెంకటరమణతో పాటు గ్రామస్తులు, లబ్ధిదారులు, చిన్నారులు పాల్గొన్నారు.






# విశాఖలో గురుకుల విద్యార్థుల ఎక్స్‌పోజర్ విజిట్

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులను విశాఖపట్నం తీసుకెళ్లారు.ఈ సందర్భంగా విద్యార్థులకు విశాఖపట్నంలోని పలు చారిత్రక, విజ్ఞానపరమైన ప్రదేశాలను సందర్శింపజేశారు. ముఖ్యంగా సబ్‌మెరైన్‌తో పాటు ఇతర ప్రదేశాలను చూపించి వాటి ప్రాధాన్యత, విశేషాల ను వివరించారు. పాఠ్యాంశాలకు అనుబంధంగా ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు ఈ పర్యటన నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. ప్రభాకర్ తెలిపారు. ఈ ఎక్స్‌పోజర్ విజిట్ విద్యార్థుల్లో విజ్ఞానం, పరిశీలనా దృష్టిని పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

# నిరుపయోగంగా పాత ఎక్సైజ్ కార్యాలయం

**పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం.. దోమలకు ఆవాసంగా డ్రైనేజీ**

ప్రజాభూమి ప్రతినిధి, అడ్డతీగల

మండల కేంద్రమైన అడ్డతీగలలో గతంలో ఎక్సైజ్ కార్యాలయంగా వినియోగించిన భవనం ప్రస్తుతం నిరుపయోగంగా మారడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు సమస్యగా మారింది. కార్యాలయ ప్రాంగణం నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దోమలు, విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఎక్సైజ్ కార్యాలయ కార్యకలాపాలకు ఉపయోగించిన ఈ భవనాన్ని ప్రస్తుతం అధికారులు వినియోగించకపోవడంతో పట్టించుకునే నాథుడే లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. కార్యాలయ ప్రాంగణంలో కొందరు చెత్తను పడేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలు, ఇతర కీటకాలు చేరుతున్నాయని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, కార్యాలయానికి ఎదురుగా ఉన్న డ్రైనేజీ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. డ్రైనేజీలో గడ్డి పెరిగిపోవడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో మురుగునీరు సక్రమంగా వెళ్లక అక్కడక్కడే నిలిచిపోతోంది. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతుండటంతో పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉందని ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దోమల వ్యాప్తితో మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికా రులు తక్షణమే స్పందించాలని గ్రామ స్తులు కోరుతున్నారు. పాత ఎక్సైజ్ కార్యాలయ ప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కార్యాలయ పరిసరాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే డ్రైనేజీలో పేరుకుపోయిన గడ్డి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.







# చింతూరులో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలి

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

విలీన మండలాల ప్రజల చిరకాల కోరిక నెరవేర్చేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ముందుకు రావాలని, చింతూరు డివిజన్ కేంద్రంగా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ క్రిమినల్ కోర్టు మొబైల్ మరియు ( సివిల్) కోర్టులను ఏర్పాటు చేయాలని, విలీన మండలాల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో, శనివారం మండల కేంద్రం రేకపల్లిలో గల ఏ ఎస్ డి ఎస్ ప్రాంగణంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాది మోసం సంజీవరావు అధ్యక్షతన నిర్వహించగా, అడ్వకేట్ ఇళ్ల చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయవాదుల ఆధ్వర్యంలో దీనిని ఒక ప్రజా ఉద్యమంగా మలచాలని కేవలం తీర్మానాలకే పరిమితం కాకుండా దీన్ని మీ అందరి సమస్యగా భావించి ప్రజా ఉద్యమంగా మార్చాలని ఈ సమావేశంలో వారు నిర్ణయించారు. మండల అఖిలపక్ష భేటీలో సమీక్షించి సేకరించిన అభిప్రాయాలలో జిల్లా కలెక్టర్ హైకోర్టు ప్యానల్ న్యాయశాఖ మంత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి వినతి పత్రాన్ని ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్, వాళ్ల రంగారెడ్డి ఎక్స్ జెడ్పిటిసి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పాయం రామారావు, రంపచోడవరం నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాష్ రావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, వైసిపి సీనియర్ నాయకులు ముత్యాల మురళి, మాజీ ఉప సర్పంచ్ వడ్డాణపు చిన్న రాజారావు, వైసిపి నాయకులు మోడెమ్ నరేష్, సిపిఎం సీనియర్ నాయకుడు సోడే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు





ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

మండలంలోని పెద్దమటపల్లి పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తుర్రం వెంకట నారాయణ అన్నారు. శనివారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో వినియోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్య తపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. తమ పరిశీలనలో 12ఎంఎం రాడ్లు ఉపయోగించాల్సిన చోట 10 ఎంఎం రాడ్లు వినియోగిస్తున్నట్లు కనిపిస్తోందని, బీజేపీ నాయకులు ఉయిక రత్తయ్య, తుర్రం వెంకట నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ భవనం, అందులోనూ ప్రజలకు వైద్య సేవలు అందించే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని వారు అన్నారు. నిర్మాణ పనులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఆమోదించిన నిర్మాణ ప్రమాణాల ప్రకారం మెటీరియల్ వినియోగిస్తున్నారా లేదా అనే విషయాన్ని సాంకేతికంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందా అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ నాయకులు కోరారు. నిర్మాణంలో నాణ్యతా లోపాలు ఉన్నట్లు సాంకేతిక తనిఖీలో నిర్ధారణ అయితే, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన భవనం కావడంతో నిర్మాణ నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బీజేపీ నాయకులు కోరారు.

# నిరవదిక సమ్మె కు సిద్ధం అవుతున్న వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు

**విధులు బహిష్కరణకు సిద్ధంగా ఉన్నామని ఉన్నత అధికారులకు వినతి పత్రాలు అందజేత**



ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్నా కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరు నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఉన్నత అధికారులకు సమ్మెకు సంబంధించిన వినతి పత్రాన్ని అందించడం జరిగింది.

పోలవరం జిల్లాలో ఉన్న సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ (ఎస్ పి)వారికి, డి సి హెచ్ వారికి, అలాగే మెడికల్ సూపరింటెండెంట్ వారికి,లోకల్ పోలీస్ స్టేషన్ వారికి సమ్మె షెడ్యూల్ కు సంబంధించిన వినతి పత్రాలు అందించడం జరిగింది గత నాలుగు నెలలుగా కాంట్రాక్ట్ ఉద్యో గులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు 100 శాతం గ్రాస్ సాలరీ ఇవ్వాలని, ఇంకా అనేక రకాల న్యాయమైన డిమాండ్లు తో కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని ప్రభు త్వం మా సమ స్యలను పరిష్కరించక పోవడం వలన తప్పని పరిస్థితిలో నిరవదిక సమ్మె కి వెళ్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ వారు తెలియజేశారు. రాష్ట్రం లో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అందరు ఈ సమ్మెలో పాల్గొనడం జరుగుతుంది అని తెలియజేశారు.



# పొదుపు అలవాటుతోనే పేదరికం నుంచి విముక్తి

❖ చిరు వ్యాపారులు, విద్యార్థుల్లో పొదుపు అలవాటును పెంపొందించాలి

❖ జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి ప్రతినిధి చిరు వ్యాపారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ కుటుంబాలు, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పొదుపు అలవాటును పెంపొందించడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ), తపాలా, విద్యాశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పొదుపు ప్రాముఖ్యతపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి యూనిట్లు నిర్వహిస్తున్న అనేక కుటుంబాలకు నెలవారీగా కొంతమేర స్థిర మైన ఆదాయం ఉన్నప్పటికీ, పొదుపు అలవా టు లేకపోవడం వల్ల అత్యవసర సమయంలో అప్పులపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. వచ్చిన ఆదాయాన్ని పూర్తిగా ఖర్చు చేయ కుండా, రోజువారీగా లేదా వీలైనంత తరచుగా కొంత మొత్తాన్ని పొదుపు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వం లో అమలులో ఉన్న పిగ్మీ పొదుపు విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, తపాలాశాఖ ద్వారా 'మైక్రో సేవింగ్స్' విధానాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. తపాలా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బయోమెట్రిక్ పరికరాల ద్వారా పొదుపు మొత్తాలను ఖాతాల్లో జమ చేసే సౌకర్యాన్ని ప్రజలకు వివరించి, ఆసక్తి ఉన్నవారితో ఖాతాలు తెరిపించాలని చెప్పారు. రోజుకు రూ.50, రూ.100 లేదా వారి సామర్థ్యానికి అనుగుణంగా చిన్న మొత్తాలను క్రమం తప్పకుండా పొదుపు చేసే అలవాటు ఏర్పడితే భవిష్యత్తులో కుటుం బాలకు ఆర్థిక భద్రత ఏర్పడు తుందన్నారు.

మండల స్థాయిలో ఏపీఎంలు, తపాలా శాఖ అధికారులు సమన్వ యంతో పనిచేసి గ్రామా ల్లోని వీవోఏలు, పోస్టుమాస్టర్లను అనుసంధానం చేయాలని కలెక్టర్ సూచించారు. చిరు వ్యాపా రులు, జీవనోపాధి యూనిట్లు నిర్వహిస్తున్న వారు, రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులను గుర్తించి పొదుపు ఖాతాలు తెరిపించాలని ఆదేశించారు. అవసరమైన చోట డీఆర్డీఏ అధికారులు, తపాలా శాఖ అధికారులు క్షేత్రస్థా యిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు.విద్యార్థుల్లో కూడా చిన్న వయసు నుంచే పొదుపు అలవాటు పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గుర్తించిన సుమారు 19 వేల మంది విద్యార్థుల్లో ఇప్పటివరకు సుమారు 1,200 మందికి మాత్రమే ఖాతాలు తెరిచిన నేపథ్యంలో మిగిలిన అర్హులైన విద్యార్థులకు కూడా పొదుపు ఖాతాలు తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పొదుపు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించి, వారు తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని వివరించేలా చూడాలన్నారు.పొదుపు అనేది కేవలం డబ్బు దాచుకోవడం మాత్రమే కాదని, కుటుంబాలకు ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేయడం ద్వారా పేదరికం నుంచి బయటపడే సామర్థ్యాన్ని పెంచే సాధనమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల ద్వారా నిరంతరం సహాయం అందించడం కంటే, కుటుంబాలు స్వయం సమృద్ధి సాధించి భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఆర్థికంగా బలోపేతం కావడమే అసలు లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ, తపాలా, విద్యాశాఖల అధికారులు పాల్గొని గ్రామస్థాయిలో చేపట్టనున్న కార్యాచరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పొదుపు ఖాతాల ప్రారంభం, డిపాజిట్లపై మండలాల వారీగా, గ్రామాల వారీగా రోజువారీ నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీఎంల వారీగా ఎన్ని ఖాతాలు ప్రారంభించారు, ఎంత మొత్తంలో పొదుపు ప్రారంభమైంది అనే వివరాలతో గూగుల్ స్ప్రెడ్‌షీట్‌లో రోజువారీ సమాచారాన్ని నమోదు చేసి సమర్పించాలని సూచించారు. ప్రారంభ దశలో ప్రతిరోజూ నివేదికలను పరిశీలించి, కార్యక్రమం గాడిలో పడే వరకు నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, తపాల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డీఈఓ యువి సుబ్బారావు, మండల విద్యాధికారులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా మహా అన్నసంతర్పణ

### పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

మండల కేంద్రమైన అడ్డతీగలలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆదివాసీ భవన్ వద్ద ఆది వినాయక యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అడ్డతీగలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి దాతలు తమవంతు సహకారం అందించారు. కంబాల శ్రీనివాసరావు రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. అలాగే స్థానిక వ్యాపా రులు, ఉద్యోగులు, పెద్దలు ఆర్థిక సహకారం అందించారు.యూత్ కమిటీ అధ్యక్షులు బేలం వెంకటేష్, పల్లాల రాహుల్ సత్యానందరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నసంతర్పణ ఏర్పాట్లు చేశారు.

## అంగన్‌వాడీ ఉత్సవాల్లో స్వప్నకుమారి

### మహిళలు, చిన్నారులకు కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల



మండలంలోని గొండోలు పంచాయతీ పరిధి చేనుపాకలలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన నెల సందర్భంగా నిర్వహి స్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్నకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.చేనుపాకల, గొండోలు, రాజానగరం, సరంపేట, లోతవరివీధి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను స్వప్నకుమారి అభినందించారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో వారి సేవలు కీలకమని పేర్కొన్నారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కూటమి నాయకురాలు, మాజీ ఎంపీటీసీ పుడిగి ఆదిలక్ష్మి, మండల కార్యదర్శి గుజ్జె లక్ష్మి, భవాని, బాతు పండు బాబు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.



ఇటీవల వచ్చినటువంటి వరదలకు ముంపుకి గురైనటువంటి గ్రామాలకు, అధికారులు, కూటమి నాయకులు వారి చేతుల మీదుగా శనివారం వరద బాధితులకు పంపిణీ చేశారు. వడ్డీగూడెం, శ్రీరామగిరి, చొక్కనపల్లి, రామవరం, రామవరం పాడు, చొపల్లి, సోములగూడెం, కోపల్లి, అడివివెంకన్నగూడెం, పోచవరం, చింతరేవుపల్లి, గుండుగూడెం,పత్తిపాక, తుష్టివారిగూడెం తదితర వరద ప్రభావిత గ్రామాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమం లో తహసీల్దార్ వై సరస్వతి, కూటమి నాయకులు బొర్రా నరేష్ కుమార్, శేఖర్, ఆదినారాయణ, ప్రమీల, సూరిబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు లాటరీ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:



కృష్ణా జిల్లా పరిధిలోని 135 మద్యం దుకాణాల్లో 100 దుకాణాలు 2026-27 సంవత్సరానికి పునరుద్ధరణ కాగా, మిగిలిన 35 దుకాణాలకు లాటరీ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. అక్టోబర్ 8వ తేదీ ఉదయం 8 గంటలకు మచిలీపట్నంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు దుకాణాలకు, గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని రెండు దుకాణాలకు కనీసం ఆరు దరఖాస్తుల చొప్పున వచ్చాయని అధికారులు తెలిపారు. మిగిలిన దుకా ణాలకు కూడా నిబంధనల ప్రకారం దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల దరఖాస్తు రుసుముతో పాటు రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.లాటరీలో దుకాణం దక్కిన అభ్యర్థులు అదే రోజు నిర్ణీత గడువులో లైసెన్స్ ఫీజు చెల్లించి దుకాణాన్ని నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. మచిలీపట్నం కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాలకు లైసెన్స్ ఫీజు రూ.7.50 లక్షలు, నగర పంచాయతీ పరిధిలోని దుకాణాలకు రూ.5 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు.లాటరీకి సంబం ధించిన దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని అధికారులు వెల్లడించారు. మచిలీపట్నం కార్పొరేషన్‌లో 3, మచిలీపట్నం గ్రామీణ ప్రాంతంలో 1, గుడివాడ మున్సిపాలిటీలో 2, పెడన మున్సిపాలిటీలో 2, కోడూరు మండలంలో 1, మోపిదేవి మండలంలో 1, ముండ్లపాలెం మండ లంలో 1, గుడివాడ మండలంలో 1, పామర్రు మండలంలో 2, గుడ్లవల్లేరు మండలంలో 3, పెదపారుపూడి మండలంలో 1, గన్నవరం మండలంలో 2, బాపులపాడు మండలంలో 2, ఉంగుటూరు మండలంలో 1, ఉయ్యూరు నగర పంచాయతీలో 3, ఉయ్యూరు మండలంలో 2, పమిడిముక్కల మండలంలో 1, కంకిపాడు మండలంలో 4, పెనమలూరు మండలంలో 1 దుకాణాలకు లాటరీ నిర్వహించనున్నట్లు అధికారులు వివరించారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయం, మచిలీపట్నం లేదా సంబంధిత ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8466981837 నంబరులో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## కొండ ప్రాంతాల్లో వైద్య శిబిరం

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండలలోని కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కొత్త కార్మన కొండ, పాత కార్మానకొండ మరియు గబ్బిలాలగొంది అనే క్లిష్టాత్మక కొండ గ్రామాల్లో సాహసోపేతంగా కాలినడక వెళ్ళి కొండరెడ్ల తెగ కి చెందిన గిరిజనులకి అత్యవసర వైద్యశిబిరం కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీనివాస మూర్తి నిర్వహించి, 76 మంది చిరు వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణి చేశారు.11 మంది జ్వర పిడితులకు పరిక్షలు చేశారు అందులో 3 మలేరియా జ్వరం కేసులు నిర్ధారణ అయినవి వాటికి చికిత్స అందించడం జరుగుతుంది. గర్భిణీలకు, బాలింతలకు పరీక్షించి, తగిన మం దులు ఇవ్వడమైనది.గ్రామస్థులకు ఆరోగ్యం కోసం అవగాహన కల్పించి తగిన సమయం లో వైద్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు తీసుకోవలసినదిగా సూచిండమైనది అలాగే అధిక ఆల్కాహాలు వినియోగం వలన మానసిక, శారీరక రుగ్మతలు సంభవి స్తాయి. కనుక తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమం లో వైద్య శిబ్బంది ఏ ఎన్ యం లు హైల్త్అసిస్టెంట్ల్ ఆశ కార్యకర్తలు . అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రతి నిర్వసితుడికి న్యాయం జరిగే వరకు సీపీఎం పోరాటం

### మోటార్ సైకిల్ యాత్రలో కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం..

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం :-



మండలంలో సిపిఎం బైక్ ర్యాలీలో భాగంగా మా మట్టి మా నీరు మా హక్కు అనే నినాదం తో అక్టోబర్ 1 న ప్రారంభమైన మోటార్ సైకిల్ యాత్ర మండలంలో ముల్లూరు గ్రామంలో 3 వ రోజు మొదల య్యింది.. ఈ యాత్రకు ప్రతి గ్రామంలో పూల మాలలతో, పుష్ప గుచ్చాలతో,హారతులతో ఘన స్వాగతం పలికారు. పెద్దార్కూర్ గ్రామంలోని పాయం సీతమ్మ,పల్లూరు గ్రామంలోని ఆవుల నాగమ య్య అమర వీరుల స్తూపాలకు అంజలి ఘటిస్తూ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రేపాక గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు లోక నాథం మాట్లాడుతూ ప్రతి ఒక్క నిర్వసితుడికి న్యాయంం జరిగే వరకు సీపీఎం పార్టీ పోరాడుతుందని స్పష్టం చేసారు.పోలవరం నిర్వసిత గ్రామాలు నష్టపోయే రైతులకు, నిర్వసితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాయని అన్నారు.గ్రామాలు తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. రాష్టానికి 'జీవ నాడి 'ప్రాజెక్టు అని చెప్తూ సర్వం త్యాగం చేస్తున్న నిర్వసితులకు మాత్రం అన్యాయం చేస్తున్నాయని అన్నారు. గతంలో యాట



పాక నుండి విజయవాడ వరకు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పాదయాత్ర చేసారని దాని ఫలితంగానే 10 గ్రామాలను ప్రయారటి గ్రామాల్లో కలిపి ప్యాకేజీ ఇచ్చారని గుర్తు చేసారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 2 ఏళ్ళు దాటిందని కాని జీ. ఓ. నెంబర్ 3కి ప్రత్యామ్నాయంగా చట్టాన్ని తీసుకోస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పటికి గిరిజనలకు న్యాయం చేయడంలో విఫలమయ్యారని అన్నారు. విలీన మండలాల్లో రోడ్లు దుర్భరంగా ఉన్నాయని పేర్కొన్నారు పోలవరం పేరుతో ఈ ప్రాంతాల్లో అభివృద్ధి కరువైందని అన్నారు. ఈ ప్రాంత ప్రజలను తరలించే వరకు ఈ ప్రాంత వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమం లో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు, లోతా రామారావు, పల్లపు వెంకట్,గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు పూనెం ప్రదీప్, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, నాగమణి, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, తదితరులు భారీ ఎత్తున యాత్రలో పాల్గొన్నారు..




## మచిలీపట్నంలో సినీ షూటింగ్ సందడి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి ప్రతినిధి :



నగరంలో శనివారం సినీ షూటింగ్ సందడి నెలకొంది. 'చెన్నై లవ్ స్టోరీ' ఫ్రేమ్ హీరో కిరణ్ అబ్బ వరం నూతన సినిమా సన్నివేశాలను మచిలీపట్నంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో చిత్రీకరించింది. జిల్లా కోర్టు సెంటర్, బస్టాండ్ సెంటర్, కోనేరు సెంటర్, రైతుబజార్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి షూటింగ్ నిర్వహించారు.



హీరో కిరణ్ అబ్బవరం నగరంలో షూటింగ్‌లో పాల్గొంటున్న విషయం తెలుసుకున్న అభిమానులు, నగరవాసులు ఆసక్తిగా షూటింగ్‌ను తిలకిం చారు. షూటింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. షూటింగ్ అనంతరం కిరణ్ అబ్బవరం అభిమానులతో మమేకమయ్యారు. పలువురు అభిమానులు ఆయన నుంచి ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడంతో పాటు ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపించారు. హీరోను చూసేందుకు వచ్చిన అభిమానులతో ఆయా ప్రాంతాలు కొద్దిసేపు సందడిగా మారాయి.మచిలీపట్నం నగరంలోని వివిధ ప్రాం తాలు ఇప్పటికే చారిత్రక ప్రాధాన్యతతో పాటు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో సినీ చిత్రీకరణలు జరగడం వల్ల నగరానికి సినీ రంగంలోనూ మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో మరిన్ని చిత్రాల షూటింగ్‌లకు మచిలీపట్నం వేదికగా మారాలని నగరవాసులు ఆకాంక్షిస్తున్నారు.'బంగారు బందర్'గా మచిలీపట్నం అభివృద్ధి చెందుతున్న తరుణంలో నగరంలో సినీ షూటింగ్‌లు జరగడం పట్ల బందరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని చారిత్రక, సుందర ప్రాంతాలను సినీ చిత్రాల్లో చూపిం చడం ద్వారా మచిలీపట్నానికి మరింత ప్రచారం, గుర్తింపు లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## పోచవరంలో వన్యప్రాణి అవగాహన వారోత్సవాలు

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.



శనివారం వి.ఆర్.పురం రేంజ్ తుమ్మిలేరు పంచాయతీ పోచవరం గ్రామం వద్ద వన్యప్రాణి అవగాహన వారోత్సవాలు కార్యక్ర మాన్ని అటవీశాఖ అధికా రుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2 నుండి 8వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాలలో భాగంగా వి. ఆర్. పురం రేంజ్ సిబ్బంది అటవీ పరిసర ప్రాంతాల ప్రజలకు వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ ఓ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే భవిష్యత్ తరాలను కాపాడినట్లే అని, వన్యప్రాణులను కాపాడుట మన అందరి బాధ్యత, వన్యప్రాణులను వేటాడుట చట్టరీత్యా నేరము కావున చెట్లను నరుకుట, వన్య ప్రాణుల వేటాడుట చేయరాదనీ, జీవవైవిధ్యం సమతుల్యతను కాపాడుట ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడిగుప్ప వీఆర్వో ఎం శ్రీనివాస్ రెడ్డి, తుమ్మి లేరు ఎఫ్ ఎస్ ఓ బి చుక్కయ్య, జీడి గొప్పు ఎఫ్బి ఓ ఆదిలక్ష్మి, దారపల్లి ఎఫ్బి ఓ పి భాస్కర్, తుమ్మి లేరు ఎఫ్బి ఓ ఐ నాగార్జున, పోచవరం ఎఫ్ బి ఓ ఎం సావిత్రి, దారపల్లి బేస్ క్యాంప్ వాలంటీర్లు, యానిమల్ ట్రాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలు లేకుండా రీ-సర్వే చేయొద్దు: ఆదివాసీ నేత తెల్ల రాంబాబు

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల



ఏజెన్సీ ప్రాంతాల్లో కొనసాగుతున్న భూ రీ-సర్వేలో చట్ట నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదివాసీ నేత తెల్ల రాంబాబు కోరారు. గిరిజనేతరులకు అనుకూలంగా సరైన ఆధారాలు లేకుండా కేవలం భూమి ఆధీనంలో ఉందనే కారణంతో రీ-సర్వే చేయరాదన్నారు. తప్పుడు విచారణలు, రికార్డుల సృష్టికి పాల్పడే వీఆర్వోలు, సర్వేయర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రీ-సర్వే అనంతరం గ్రామసభ నిర్వహించి, గిరిజనేతరుల భూములకు సంబంధించి పరిశీలించిన ఆధారాలను ప్రజల ముందు వెల్లడించాలని కోరారు. ప్రజలకు తెలియకుండా రికార్డులు సమర్పించి తప్పుడు పట్టాలు జారీ చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని, గిరిజనులకు అన్యాయం జరిగితే చట్టపరంగా పోరాడతామని రాంబాబు స్పష్టం చేశారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# క్షేత్రస్థాయి ప్రజా ఫిర్యాదులకు వేగంగా పరిష్కారం చూపాలి

- పెద్దాపురంలలో నిర్వహించిన ఒక నెల గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమానికి 32 అర్జీలు..
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి-పెద్దాపురం

ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం కింద అందిన అర్జీలను వేగంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దాపురం నియోజకవర్గం స్థాయిలో పెద్దాపురం మండలం ఎంపీడీవో నిర్వహించిన 'ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. ప్రజల నుంచి అర్జీలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలు మేరకు క్షేత్రస్థాయిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారించే లక్ష్యంతో ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమాని నిర్వహించడం జరుగుతుందన్నారు. నెలలో ఒక నియోజకవర్గం చొప్పున నాలుగు వారాల పాటు ఆ నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ స్థాయిలో ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం కింద నేటితో వరుసగా నాలుగు వారాలపాటు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం కింద అందిన అర్జీల పట్ల అధికారులు ప్రత్యేక



దృష్టి పెట్టి, వెగంగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.వివిధ శాఖల్లో నమోదు అయిన అర్జీలను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రజా సమస్యలకు సంతృప్తికరమైన పూర్తి పరిష్కారం అందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 32 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఇవన్నీ కూడా ప్రధానంగా భూవివాదాలు, రీసర్వేలో గతంలో జరిగిన సమస్యలు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రోడ్లు, తాగు నీరు, వ్యవసాయం అంశాలపై వచ్చాయన్నారు. వీటితోపాటు గత మూడు వారాలుగా నమోదైన వాటన్నింటినీ అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి, అక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులు పరిశీలించి, నిర్దిష్ట సమయంలోపు తగు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణ మూర్తి,డీడీవో కె.స్వప్న ఇతర అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎంపీడీవో కెవీ. సూర్యనారాయణ, తహసీల్దార్ పి.శ్రీనివాసు, నియోజకవర్గంలోని ఇతర మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తీరనున్న శీల, ఒంటితాడి, మంజేరు,గ్రామాల త్రాగునీటి సమస్య

- శీల గ్రామంలో చెరువు ఆధునికరణకు 50 లక్షలు సిఎస్ఆర్ నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామాల ప్రజలు.
- సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యంకు ఘన సత్కారం
- మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు.

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

ఏళ్ల తరబడి సరైన త్రాగునీటికి నోచుకోలేని శీల, ఒంటితాడి మంజేరు , గ్రామాల ప్రజలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో తీసుకున్న నిర్ణయంతో ఆయా గ్రామాలకు త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది దీంతో ఆయా గ్రామాల ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు .మంచినీటి సమస్యపై ఆయా గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న సమస్యకు పరిష్కారం లభించక పోవడంతో మంత్రి వాసంశెట్టి శుభాష్ దృష్టికి ఆయా గ్రామాల చెందిన పలువురు కూటమికి చెందిన నేతలు ఇటీవల తీసుకెళ్లారు. దీంతో మంత్రి సమస్యను పరిగణంలోకి తీసుకుని స్పందిస్తూ శీల గ్రామ పంచాయతీ పరిధిలో గల చెరువులను ఆధునికరించి సమస్య పరిష్కారం నిమిత్తం కోరమండలం నుంచి సి ఎస్ ఆర్ ఫండ్ నుండి 50 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగిందని పలువురు కూటమికి చెందిన నేతలు పేర్కొన్నారు.త్వరలో ఈ చెరువు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని శీల గ్రామానికి చెందిన జనసేన కాజులూరు మండల యువత అధ్యక్షులు కోనపరెడ్డి



శివకృష్ణ, ఒంటితాడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జల్లి సత్యనారాయణ, మంజేరు గ్రామానికి చెందిన దడాల నాగార్జున తదితర కూటమి నాయకులు మంత్రి వాసంశెట్టి సుభాష్ ,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాశంశెట్టి సత్యం లకు ఆయా గ్రామాల ప్రజల తంఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

**వాసంశెట్టి సత్యంకు ఘన సత్కారం.**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఎన్జీవో గా స్వచ్ఛ ఆంధ్ర -2026 అవార్డు అందుకున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంను కాజులూరు మండలానికి చెందిన శీల, ఒంటితాడి, మంజేరు గ్రామాలకు చెందిన పలువురు కూటమికి చెందిన ప్రముఖులు, వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఒకపక్క సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా, మరోపక్క మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా, సి ఎస్ ఆర్ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గానికి చేస్తున్న సేవలు ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరన్నారు. ఈ కార్యక్రమంలో జల్లి సత్యనారాయణ, దడాల నాగార్జున, కాజులూరు మండలం జనసేన యువత అధ్యక్షులు కూనపరెడ్డి శివకృష్ణ, గుండారపు శ్రీనివాస్, ఆకుల నారాయణరావు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నశంకర్లపూడి-చిన్నింపేట రోడ్డుకు శంకుస్థాపన

రూ.2.22 కోట్లతో రహదారి నిర్మాణ పనులు



ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామంలో చిన్నశంకర్లపూడి-చిన్నింపేట రహదారి నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏపీఆర్ఆర్ఎస్పీ-పీఆర్ఆర్ ప్లాన్ నిధుల ద్వారా సుమారు రూ.2.22 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు.ఈ రహదారి నిర్మాణ పనులకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే ధ్యేయం..

- ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యం
- హెల్త్ ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలపై పోలీస్ సిబ్బందికి అవగాహన సదస్సు

ప్రజాభూమి ప్రతినిధి-అనకాపల్లి

పోలీస్ సిబ్బంది, హోంగార్డులు మరియు వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో ఎదురయ్యే భారీ వైద్య ఖర్చుల నుంచి ఆర్థిక రక్షణ కల్పించే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ బ్యాంకులతో కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంఓయూ), పోలీస్ శాలరీ ప్యాకేజీ ఆధారంగా సిబ్బందికి అందుబాటులో ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్, టాప్-అప్ పాలసీలు, ఇతర సామాజిక భద్రతా పథకాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన



అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ, సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య చికిత్సల ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు ఆరోగ్య బీమా రక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.వివిధ బ్యాంకులు అందిస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలు, టాప్-అప్ ప్లాన్లను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (గ్రామీణ్), అటల్ పెన్షన్ యోజన (ఇూ) వంటి పథకాలపై కూడా ప్రతి పోలీస్ సిబ్బంది, హోంగార్డు అవగాహన పెంచుకుని ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొని పోలీస్ శాలరీ ప్యాకేజీ ద్వారా లభించే హెల్త్ పాలసీలు, ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, తక్కువ ప్రీమియంతో అధిక కవరేజీ, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ కోసం అందుబాటులో ఉన్న నెట్‌వర్క్ ఆసుపత్రులు, టాప్-అప్ పాలసీల వివరాలను సిబ్బందికి వివరించారు. సిబ్బంది అడిగిన సందేహాలను నివృత్తి చేసి, పాలసీల నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు బాబ్జీరావు, రవికుమార్, సీఐలు రామకృష్ణారావు, లక్ష్మి, శ్రీనివాసరావు, రమేష్ తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ పాలకొల్లుచే పేద రోగులకు మందుల పంపిణీ





ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

అనారోగ్యంతో బాధపడుతూ మందులు కొనుక్కోవడానికి ఇబ్బందులు పడుతున్న ఇద్దరు పేద వ్యాధి గ్రస్తులు కోనసీమ జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన బండారు లక్ష్మణ రావు, పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన కౌరు పెద్ది లక్ష్మి ల గురించి తెలిసిన వారు వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి తీసుకురావడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ తరపున వారికి 12 వేల విలువైన మందులను క్లబ్ సభ్యులతో కలిసి కొత్త కుళాయి చెరువు వద్ద శనివారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, దాసరి వెంకటేశ్వరరావు, చామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మోడరన్లో ఆకట్టుకున్న రోబోటిక్స్ శిక్షణా కార్యక్రమం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో ఎస్.ఎం.డి.జి.ఎం.డి. మోడరన్ హైస్కూల్ లో చుక్కారామయ్య స్పేస్ ప్రోగ్రాం అభ్యసిస్తున్న 90 మంది విద్యార్థులకు వారం రోజులపాటు మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో స్మార్ విక్స్ టెక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బేస్డ్ రోబోటిక్స్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యక్రమ కోఆర్డినేటర్స్ పావులూరి సత్యరాజసాయి, కుడిపూడి రంజిత్ కుమార్ విద్యార్థులకు ఆసక్తికరంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ ప్రాధాన్యతను వివరించారు. రానున్న రోజుల్లో రోబోట్స్ యొక్క పాత్రను విద్యార్థులకు అర్థమయ్యేలా విశ్లేషించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో ప్రదర్శించిన నమూనా రోబోట్ల ప్రదర్శన విద్యార్థులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ రేపటి భవిష్యత్తును ప్రతిబింబింపజేసే శాస్త్రీయ అంశాలను ఈరోజే తరగతి గదుల్లో బోధించాలనే కాన్సెప్ట్ తో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం హైస్కూల్ అకాడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేలా,అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ పట్ల అవగాహన కలిగించేలా ఈ తరహా క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సత్యరాజ్ సాయి, రంజిత్ కుమార్ లను అధినేత జి. వి రావు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ముత్యాల చిట్టిబాబు కోఆర్డినేటర్ వై.రాజు పాల్గొన్నారు.

## వొమ్మంగిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

-పల్లె పండుగ-3.0లో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు

మండలంలోని వొమ్మంగి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పల్లె పండుగ-3.0లో భాగంగా వి.బి.జి. రామ్.జి నిధులతో సుమారు రూ.20 లక్షల వ్యయంతో ఈ రహదారిని నిర్మించనున్నారు.నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో చిలువూరి సతీష్ రాజు?

## కూటమి నుంచి అవకాశం లభించే అవకాశం ఉందంటూ జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చ.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తొలి జిల్లా పరిషత్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చకు తెరలేచింది. కూటమి తరఫున జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి తెలుగుదేశం పార్టీ యువనేత, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావుకు నమ్మకమైన నాయకుడు చిలువూరి వెంకట సత్యనారాయణ రాజు (సతీష్ రాజు) పేరు పరిశీలనలో ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా యువతలో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందిన సతీష్ రాజు, తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కార్యకర్తలకు అండగా నిలిచారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ కష్టకాలంలో కార్యకర్తల్లో మనోధైర్యాన్ని పెంచుతూ, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా పనిచేశారని చెబుతున్నారు.

**పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీల పాత్ర**

తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'బాదుడే బాదుడు', 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి', 'రైతు కోసం తెలుగుదేశం', 'పేదల ద్రోహి జగన్', 'దిశ నువ్వు ఎక్కడ?', 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' తదితర కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా నిర్వహించడంలో సతీష్ రాజు చురుకైన పాత్ర పోషించారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అదేవిధంగా యువత, నిరుద్యోగుల సమస్యలపై కూడా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాబ్‌లెస్ క్యాలెండర్, నిరుద్యోగ రణం, చలో విజయవాడ, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేశారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**భువనేశ్వరి అంశంపై తొలి స్పందన**

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గారిని శాసనసభలో అవమానించారనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరిగిన సమయంలో, కోనసీమ జిల్లాలో సతీష్ రాజు ఆధ్వర్యంలో రావులపాలెం జాతీయ రహదారిపై



నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. భువనేశ్వరి గారికి మద్దతుగా పలు గ్రామాల్లో గౌరవ సభలను నిర్వహించడంలోనూ ఆయన కీలకంగా వ్యవహరించారని చెబుతున్నారు.

**వరద బాధితులకు సహాయం**

కోనసీమ ప్రాంతాన్ని వరదలు ప్రభావితం చేసిన సమయంలో పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, కొత్తపేట నియోజకవర్గాల్లో బాధిత ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారని ఆయన అనుచరులు తెలిపారు. రాజకీయ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల సమయంలోనూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు



ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**'బాబుతో నేను' కార్యక్రమంలోనూ చురుకైన పాత్ర**

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో జిల్లాలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లోనూ సతీష్ రాజు చురుకుగా పాల్గొన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రావులపాలెం జాతీయ రహదారిపై నిరసనతో పాటు జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన ముందున్నారని పేర్కొంటున్నారు. అనంతరం నిర్వహించిన 'బాబుతో నేను' కార్యక్రమాన్ని కూడా విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేసినట్లు చెబుతున్నారు.

**యువగళం పాదయాత్రకు సహకారం**





టీడీపీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు కూడా సతీష్ రాజు తన వంతు సహకారం అందించారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కుప్పం నుంచి విశాఖ పట్నం వరకు పాదయాత్రలో పలు దశల్లో పాల్గొన్న ఆయన, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోకి యువగళం ప్రవేశించిన సమయంలో కార్యక్రమాల నిర్వహణలో ముందుండి పనిచేశారని చెబుతున్నారు. అమలాపురంలో నిర్వహించిన 'హలో లోకేష్' కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించడంలో ఆయన పాత్ర ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా నారా లోకేష్ నుంచి సతీష్ రాజుకు ప్రశంసలు లభించాయని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**జిల్లా పరిషత్ చైర్మన్ పదవిపై ఆసక్తికర చర్చ**

పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ, అనంతరం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేసిన సతీష్ రాజుకు తగిన రాజకీయ గుర్తింపు లభించాలనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి చిలువూరి వెంకట సత్యనారాయణ రాజు (సతీష్ రాజు) పేరు పరిశీలనలో ఉందనే ప్రచారం జిల్లా రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. అయితే అభ్యర్థిత్వం, పదవి విషయంలో తుది నిర్ణయం కూటమి అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడే వరకు దీనిని రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చగానే చూడాల్సి ఉంటుంది. సతీష్ రాజుకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి దక్కితే, అది తన వ్యక్తిగత రాజకీయ గుర్తింపుతో పాటు కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన యువ కార్యకర్తలు, నాయకులకు లభించే గుర్తింపుగా భావించవచ్చని ఆయన అనుచర వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రజాభూమి

జనరల్ 14

ఆదివారం 4 అక్టోబరు 2026


## మందేశ్వర స్వామికి విశేషంగా తైలాభిషేకాలు

-రూ.3.21 లక్షల ఆదాయం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానానికి శనివారం భక్తజనం పోటెత్తారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శనిదోష నివారణకు ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. శనివారం వివిధ పూజలు, ఆన్‌లైన్ సేవలు, అన్నప్రసాద విరాళాల ద్వారా మొత్తం రూ.3,21,064 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు. స్వామివారికి నిర్వహించిన ప్రత్యక్ష పూజల ద్వారా రూ.1,71,785 ఆదాయం వచ్చింది. ఇందులో ముఖమండపం తైలాభిషేకాల ద్వారా రూ.24,500, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.69,500, మహన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.49,525, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.16,720 ఆదాయం సమకూరింది. అలాగే తిలదానం ద్వారా రూ.1,100, స్వయం హోమం ద్వారా రూ.2,400, స్వయం జపం ద్వారా రూ.8,000, కేశఖండన ద్వారా రూ.40 ఆదాయం లభించింది. పరోక్ష (ఆన్‌లైన్) పూజల ద్వారా రూ.1,18,000, అన్నప్రసాదం విరాళాల ద్వారా రూ.31,279 ఆదాయం వచ్చినట్లు ఈవో వెల్లడించారు. దీంతో శనివారం దేవస్థానానికి మొత్తం రూ.3,21,064 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

## రూ.6.39 కోట్లతో రెండు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

-ప్రత్తిపాడు నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం

ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు



ప్రత్తిపాడు మండలంలోని వొమ్మంగి, ధర్మవరం గ్రామాల్లో నూతన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏపీఆర్ఆర్ఎస్పీ-పీఆర్ఆర్ ప్లెయిన్ నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వొమ్మంగి గ్రామంలో ఎన్‌హెచ్-16 నుంచి వొమ్మంగి మీదుగా రాచపల్లి వరకు రహదారి నిర్మాణానికి సుమారు రూ.2.50 కోట్ల నిధులు కేటాయించారు. అలాగే ధర్మవరం గ్రామంలో ధర్మవరం-దొంతమూరు రహదారి నిర్మాణానికి సుమారు రూ.3.89 కోట్ల వ్యయంతో పనులు చేపట్టను న్నారు. ఈ రెండు రహదారుల నిర్మాణానికి కలిపి సుమారు రూ.6.39 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి పేరు చెప్పి దందా.... ముగ్గురు అరెస్టు.

కేసు నమోదు చేసి దర్యాప్తు

రామచంద్రపురంలో వెలుగు చూసిన అక్రమ వసూళ్లు

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం




రామచంద్రపురం పట్టణంలో మంత్రి పేరుచెప్పి టిఫిన్ సెంటర్లు, హోటళ్ల యజమానులను బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు రామచంద్రపురం ఎస్.ఐ నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి పేరుతో దందాకు పాల్పడుతున్న నాగుల చెరువు సురేష్, సంపర శేఖర్, గెద్దాడ రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లో వీరు ఈనెల ఒకటో తేదీన కుడుపూడి అంజిబాబు నడుపుతున్న అంజి కోన సీమ టిఫిన్స్ హోట ల్కు వెళ్లారు. అందులో ఒక వ్యక్తి ఇడ్లీ పార్సిల్ తీసుకుని కొద్దిసేపటి తర్వాత వచ్చి, ఇడ్లీలు పులిసిపోయాని ఇడ్లీ తిన్న తన కూతురుని హాస్పిటల్‌లో చేర్పించామని బెదిరించి, విధ్వంసం సృష్టించి, కౌంటర్లో, ప్లేట్లు పగలకొట్టి రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. చివరికి రూ.20 వేల నగదు, రూ.3 వేలు ఫోన్పే ద్వారా మొత్తం రూ.23 వేలు వసూలు చేశాడు. అదే రోజు రాత్రి 7.30 గంటలకు పాతబ స్టాండ్ సెంటర్ ముబారక్ హోటల్‌కి వెళ్లి యజమాని ఇర్ఫాన్ ఖుర్షీద్ను దుర్భాషలా డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఏడాది జులై 30వ తేదీన ఎల్ఐసీ సెంటర్లోని శ్రీనివాస ఫుడ్ స్టేషన్ వద్ద ఇదే తరహాలో మంత్రి పేరు, ఫుడ్ ఇన్స్పె క్టర్ పేరు చెప్పి రూ.16 వేలు వసూలు చేసినట్లు తేలింది. తోపుడుబండ్ల వ్యాపారుల దగ్గర రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇలాంటి ఘటనలు ఇంకా ఉన్నాయా అని సీసీ ఫుటేజ్ పరిశీలిస్తు న్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడి డబ్బులు ఇవ్వవద్దని అలాంటి సంఘటన ఎదురైతే వెంటనే పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయాలని ఎస్సై నాగేశ్వరరావు ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం.

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం



స్థానిక సంస్థల ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని బూసరాజుపల్లి లో ఉన్న పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శనివారం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై అత్యవసర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన విధానాలను వివరించారు. గ్రామస్థాయిలో పార్టీ కేడర్‌ను మరింత క్రియాశీలకం చేయడంపై దృష్టికేంద్రీకరించాలన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మండలం పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, సీనియర్ నేతలు మంగిన వెంకటరమణ, పారేపల్లి రామారావు, శీలం వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ, అధికార ప్రతినిధి జారం చాందిని, తదితరులు పాల్గొన్నారు.

# ఊరి చివర పాడుబడిన భవనంలో అర్ధరాత్రి క్షుద్రపూజల కలకలం..!

- క్షుద్రపూజల అనుమానంతో తిప్పరాజుపాలెంలో భయాందోళన.
- వింత ముగ్గులు.. రక్తపు మరకలు.. హోమగుండం దృశ్యాలు.
- వికృతాకారంలో ప్లాస్టిక్ బొమ్మలు, గుట్టలుగా వలిచిన కొబ్బరికాయలు
- యువకులను చూసి పరారైన గుర్తుతెలియని వ్యక్తులు.
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన గొల్లపాలెం పోలీసులు.
- స్థానికుని సహాయం తోనే భవనంలో పూజలు?
- గత సంవత్సరం ఇదే తరహాలో జరిగినట్లు సమాచారం.



ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

కాకినాడ జిల్లా కాజులూరు మండలం తిప్పరాజుపాలెం గ్రామంలోని ఊరి చివర ఓ పాడుబడిన భవనంలో అర్ధరాత్రి అనుమానాస్పద పూజలు నిర్వహించడం ఆగ్రామంలో కలకలం రేపింది. హోమగుండం, వింత ముగ్గులు, పూలు, పూజా సామగ్రితో పాటు కోడి రక్తంగా భావిస్తున్న మరకలు కనిపించడంతో క్షుద్రపూజలు నిర్వహించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న గొల్లపాలెం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

**సినిమా నుంచి వస్తుండగా..**

గురువారం అర్ధరాత్రి సినిమా చూసి తిరిగి వస్తున్న గ్రామానికి చెందిన కొందరు యువకులు పాడుబడిన భవనం వద్ద అనుమానాస్పద కదలికలను గుర్తించారు. లోపల కొందరు వ్యక్తులు పూజలు నిర్వహిస్తున్నట్లు గమనించి దగ్గరకు వెళ్లగా, వారిని చూసిన వ్యక్తులు చీకటిని ఆసరాగా చేసుకుని పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం భవనాన్ని పరిశీలించగా హోమం నిర్వహించిన ఆనవాళ్లు, ముగ్గు లు, పూలు, ఇతర పూజా సామగ్రితో పాటు రక్తపు మరక లు కనిపించాయి. దీంతో విషయం గ్రామంలో వ్యాపించి స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

**బయటి వ్యక్తుల రాకపై అనుమానం...**

స్థానిక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులను తీసుకొచ్చి ఇక్కడ ఇలాంటి పూజలు నిర్వహిస్తున్నారంటూ కొందరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో స్థానికంగా ఓ వ్యక్తిపైనా వారు అనుమానం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటన చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలను పోలీసులు నిర్ధారించలేదు. సంబంధిత వ్యక్తుల పాత్ర ఏమిటన్నది విచారణలో తేలాల్సి ఉంది.

గ్రామస్థుల సమాచారంతో గొల్లపాలెం పోలీసులు పాడుబడిన భవనాన్ని పరిశీలించి అక్కడ కనిపించిన వస్తువుల వివరాలు సేకరించారు. అర్ధరాత్రి అక్కడికి వచ్చిన వారెవరు? పూజలు ఎందుకు నిర్వహించారు? వారిని ఎవరైనా రప్పించారా? అనే కోణాల్లో ఆరా తీస్తున్నారు. ఘటనా స్థలంలో కనిపించిన మరకలు కోడి రక్తానికి సంబంధించినవేనా, జంతుబలి జరిగిందా అన్నదీ నిర్ధారణ కావాల్సి ఉంది. సమీపంలో నిఘా కెమెరాలు ఉంటే వాటి దృశ్యాలతో అనుమానితుల రాకపోకలను గుర్తించే అవకాశం ఉంది.

**క్షుద్రపూజలని ఇంకా తేలలేదు...**

భవనంలో అనుమానాస్పద పూజా సామగ్రి కనిపించినప్పటికీ అక్కడ క్షుద్రపూజలే జరిగాయని అధికారికంగా నిర్ధారణ కాలేదు. గ్రామస్థులు వ్యక్తం చేస్తున్న అనుమానాల నేపథ్యంలో పోలీసులు అసలు ఏం జరిగింది, కార్యక్రమం నిర్వహించిన వారెవరు, వారి ఉద్దేశం ఏమిటన్నది తేల్చే పనిలో ఉన్నారు.

## రూ.15.27 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.



రామచంద్రపురం పట్టణంలో వివిధ వార్డుల్లో రూ.15.27 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతోందన్నారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుధ్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మంత్రి సుభాష్ నాయకత్వంలో ఇప్పటికే రామచంద్రపురం పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం మరో విడతలో పలు వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్లు మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం ప్రజల అవసరాలను గుర్తించి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు కూడా ఈ అభివృద్ధిని గమనించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ శ్రీకాంత్, ఏ ఈ సునీల్, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, ఆయా వార్డుల నాయకులు, పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రెన్యువల్ కాని మద్యం దుకాణానికి దరఖాస్తుల గడువు పొడిగింపు



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ముసునూరు మండలంలో రెన్యువల్ కాని గెజిట్ సీరియల్ నంబర్ 93 మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ గడువును అక్టోబర్ 6వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటల వరకు పొడిగించినట్లు నూజివీడు ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య తెలిపారు. సదరు మద్యం దుకాణానికి లాటరీ పద్ధతిలో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి లైసెన్స్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు సదరు మద్యం దుకాణానికి సంబంధించి మొత్తం 14 దరఖాస్తులు అందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఒక్కో దరఖాస్తుకు రూ.3,00,000 దరఖాస్తు రుసుము, రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మొత్తాలను డిమాండ్ డ్రాఫ్ట్, చలాన్ లేదా ద్వారా చెల్లించవచ్చని, ఒకే అభ్యర్థి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించవచ్చని వివరించారు. సదరు మద్యం దుకాణానికి వార్షిక లైసెన్స్ రుసుము రూ.71.50 లక్షలు, పర్మిట్ రూమ్ రుసుము రూ.7.50 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 6వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటలలోపు దరఖాస్తులుసమర్పించాలని ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య సూచించారు.

## ఉద్యోగుల న్యాయమైన సమస్యలను 10-10-2026 లోగా పరిష్కరించాలి

జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం



గ్రామీణాభివృద్ధి శాఖ - వి. బి. జి. రామ్. జి. లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు గత 7 సంవత్సరాలుగా జీతభత్యాలలో ఎలాంటి పెంపుదల లేకపోవడం, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ఈ నెల 10-10-2026 లోగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారికి మరియు ప్రాజెక్ట్ డైరెక్టర్ (పథక సంచాలకులు),కి వినతిపత్రాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ మరియు అన్ని అసోసియేషన్ల ప్రతినిధులు ఉమ్మడిగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం నియామకాలలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులందరి నియామకాలు గతంలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ మరియు రోస్టర్ పాయింట్లను అనుసరించి పారదర్శకంగా జరిగాయి. గత 20 సంవత్సరాలుగా గ్రామీణాభివృద్ధి శాఖలో క్షేత్రస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఉద్యోగులందరూ సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. కమిటీల ఏర్పాటు ఉద్యోగుల సమస్యలపై 19-12-2024న డైరెక్టర్ ఈ. జి. ఎస్. ఆధ్వర్యంలో కమిటీ మరియు 14-07-2026న మెంబర్ సెక్రటరీ ,ఎస్. ఆర్. డి. సి. ఆధ్వర్యంలో ఎంపవర్డ్ కమిటీ లను ఏర్పాటు చేసి అన్ని ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపినప్పటికీ, ఇప్పటివరకు సమస్యలకు తగిన పరిష్కారం లభించలేదని జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడిన అన్ని అసోసియేషన్లు ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగ సంఘాలు సమర్పించిన న్యాయపరమైన కోరికలను 10-10-2026 లోగా పరిష్కరించాలని కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ వారు పాల్గొనడం జరిగింది.

# బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి
- జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



పాలకొల్లు పట్టణ బీజేపీ కార్యవర్గ సమావేశం పట్టణంలోని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత రావూరి సుధ కార్యాలయం వద్ద నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రేలంగి శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకమన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను పాలకొల్లు పట్టణంలో విస్తృతంగానిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని అన్నారు. సమావేశంలో పట్టణంలోని వివిధ వార్డులు, బూత్‌లలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, ప్రజా సమస్యలపై స్పందించడం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పాలకొల్లు పట్టణంలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత విస్తరించాలని నాయకులు సూచించారు. పట్టణ అధ్యక్షులు కొల్లి కొండ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోట గంగరాజు, ఉన్నమట్ల కబర్ధి,రావూరి సుధ, యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్, వేరుకొండ దుర్గాప్రసాద్, నాళం బాబీ, మల్లవోలు సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు, గవర పవన్ నాయుడు, పద్మజ,కోరాడ సూరిబాబు ,సిరిగినీడి రామారావు, యడ్ల జగన్నాథం,చేగొండి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ఏలూరుకు 4వ ర్యాంకు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్-2026లో భాగంగా వాయు సర్వేక్షణ్ కేటగిరీలో ఏలూరు నగరపాలక సంస్థ అవార్డు అందుకుంది. 3 లక్షల లోపు జనాభా ఉన్న పట్టణాల విభాగంలో గతంలో దేశవ్యాప్తంగా 31వ స్థానంలో ఉన్న ఏలూరు, ఈసారి 4వ ర్యాంకుకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ అవార్డును అందుకున్నారు. చెత్త,బయోమాస్ దహనం నివారణ,రోడ్ల దుమ్ము నియంత్రణ,వాహన కాలుష్య నియంత్రణ, వాయు నాణ్యత పర్యవేక్షణ,పచ్చదనం పెంపు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ విజయం ఏలూరు ప్రజలందరిదని కమిషనర్ భాను ప్రతాప్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు,పారిశుద్ధ్య కార్మికులు,స్వచ్ఛంద సంస్థల సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు.

## ఘనంగా జరిగిన సేవాసంకల్ప అభియాన్

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం నందు అంగన్వాడీ ఉత్సవం ,"సేవ సంకల్ప అభియాన్", మరియు పోషణ కార్యక్రమంనిర్వహించడమైనది. ఈ కార్యక్రమమునకు సి డి పి వో పి . విజయ కుమారి నూజివీడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కుంపటి అరుణగారు సూపర్ విశోర్ కే. ధనలక్ష్మి , ఏ ఎన్ ఎం పద్మ, ప్రీ స్కూల్ అంగన్వాడీ టీచర్స్ శాంతకుమారి, జయమని, దుర్గ, కుసుమకుమారి, రోజా లు మరియు గర్భవతులు, బాలింతలు, తల్లులు హాజరైనారు సి పి డి వో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో అందించేట టువంటి సేవలను , మరియు పోస్టికాహార పదార్థములను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టికాహార ప్రాముఖ్యతను గూర్చి వివరించారు. చిన్నారుల్లో ఎదుగుదల సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేసినారు. అరుణకుమారి మాట్లాడుతూ తల్లులు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు చేయుచున్న సేవలనుఅభినందించినారు. లబ్ధిదారులు బిజెపి మహిళా నాయకులు జుట్టు నాగవాసంత , మేడూరు మమత, గొల్లపల్లి సునీత అంగన్వాడీ టీచర్స్ కు సన్మానం చేసినారు.

ప్రజాభూమి

జనరల్ 15

ఆదివారం 04 అక్టోబరు 2026


# సాంకేతిక విప్లవానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

## సాంకేతికతపై పట్టు సాధించాలి -జేఎన్‌టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు





ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతలు భవిష్యత్ ఉద్యోగ రంగాన్ని ప్రభావితం చేస్తున్నాయని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు సూచించారు. ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం మెరుగుపరుచుకోవడంతో పాటు సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. హిందూపురం రూరల్ మండలంలో ఉన్న బి.ఐ.టి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 25 సంవత్సరాల విద్యా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన రజతోత్సవ వేడుకలకు ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల చైర్మన్ డా. పి. చంద్ర మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్‌రావు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం తరగతి గదిలో బోధించే సిలబస్‌కు మాత్రమే పరిమితం కాకుండా పరిశ్రమల్లో వస్తున్న మార్పులను కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు వినియోగం అన్ని రంగాల్లో విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏఐ ఆధారిత సాధనాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు వాటిని బాధ్యతాయుతంగా, సృజనాత్మకంగా వినియోగించే సామర్థ్యాన్ని సాధించాలన్నారు. సాంకేతికతను ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు వినియోగించాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్, డేటా విశ్లేషణ, యంత్ర అభ్యాసం, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, ఇంటర్నెట్ ఆధారిత సాంకేతికతలపై ప్రాథమిక అవగాహన ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థికి ఉపయోగపడుతుందని వక్తలు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంతో పాటు దానిని ప్రాజెక్టుల రూపంలో అమలు చేయడం, పరిశోధన చేయడం, నూతన ఆవిష్కరణలకు ప్రయత్నించడం ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవచ్చన్నారు. ప్రస్తుత పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు విద్యాసంస్థలు పరిశ్రమలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టు ఆధారిత అభ్యసనం, నైపుణ్య శిక్షణ, పరిశోధన, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. డిగ్రీ పూర్తయ్యే నాటికి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఉద్యోగ రంగంలో అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలు ఉండేలా విద్యా విధానం కొనసాగాలని పేర్కొన్నారు. బి.ఐ.టి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 25 సంవత్సరాలుగా విద్యారంగంలో అందిస్తున్న సేవలను పలువురు అతిథులు అభినందించారు. కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు కొనసాగిన విద్యా ప్రస్థానం, విద్యార్థుల విజయాలు, వివిధ రంగాల్లో పూర్వ విద్యార్థులు సాధించిన ప్రగతి, విద్యార్థుల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో అవసరమైన మార్పులను తీసుకువస్తూ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు మానవీయ విలువలను, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలన్నారు. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఐఎస్సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ గోపాలన్ జగదీష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తిని పెంచాలని, ప్రశ్నించేతత్వం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నప్పుడే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన రంగంలో ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించేందుకు నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. ప్రముఖ జీవిత బోధకులు, మోటివేషనల్ స్పీకర్ ఆచార్య అజిత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, బృందంగా పనిచేసే సామర్థ్యం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో అవసరమన్నారు. రిటైర్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఎం. నాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు పరిశ్రమల అవసరాలను తెలుసుకుని ప్రాయోగిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యలో నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమన్నారు. సైకాలజిస్ట్ డా. వై. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై కూడా విద్యాసంస్థలు దృష్టి పెట్టాలని సూచించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ సామర్థ్యాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. పి. చంద్ర మోహన్ మాట్లాడుతూ, 25 ఏళ్ల విద్యా ప్రస్థానంలో కళాశాలకు సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై మరింత శిక్షణ అందించడంతో పాటు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. రమేష్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా విద్యా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అవసరమైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 25 ఏళ్ల విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. పూర్వ విద్యార్థులు తమ కళాశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులు కళాశాల చైర్మన్ డా. పి. చంద్ర మోహన్, ఆయన సతీమణిని ఘనంగా సన్మానించి, 25 ఏళ్ల విద్యా ప్రస్థానానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలి -కష్టపడి చదివి నైపుణ్యాలు సాధించాలి

## -సేవా సంకల్ప్ అభియాన్ పోటీల ముగింపు సమావేశంలో వక్తలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థులు కష్టపడి చదివి నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదిగి దేశ సేవలో భాగస్వాములు కావాలని హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పేర్కొన్నారు. వికసిత్ భారత్--2047 సాధనలో విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా శనివారం హిందూపురంలోని ఆల్ అమీన్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్, వక్తృత్వ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభ, దేశభక్తి, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి ప్రకాష్ తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ నైపుణ్యాలను అలవర్చుకుని భవిష్యత్తులో దేశ అభివృద్ధికి ఉపయోగపడేలా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఐదు విభాగాల్లో నిర్వహించిన జిల్లా స్థాయిణ డ్రాయింగ్, వక్తృత్వ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 127 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. ఐదు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రత్యేక జ్యూరీ అవార్డులకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9న విజయవాడలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ఆల్ అమీన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్ ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జ్యూరీ సభ్యులు మంజుల, రామలింగయ్య, మాలిక్, ఇలియాజ్ బాషా, నటరాజ్, నాగేంద్రబాబు, శోభ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు -ప్రజల ఆరోగ్య భద్రతతో రాజీపడేది లేదు

## -ముబారక్ క్లినిక్, సోని డయాగ్నస్టిక్స్ సీజ్ - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం




ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించడంలో నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హిందూపురంలో శనివారం ప్రైవేట్ వైద్య సంస్థలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని ముబారక్ క్లినిక్, సోని డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ ల్యాబ్‌పై అధికారులు చర్యలు చేపట్టారు. డాక్టర్ ఫైరోజా బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ముబారక్ క్లినిక్‌లో వైద్య సేవలకు సంబంధించిన నిబంధనలు, ప్రమాణాలు, ఇతర అంశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత నిబంధనలకు అనుగుణంగా లేని అంశాలను గుర్తించడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అదేవిధంగా సోని డయాగ్నస్టిక్స్ ల్యాబ్‌లో బయోమెడికల్ ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించిన అధికారులు ల్యాబ్‌ను సీజ్ చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫైరోజా బేగం మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలు, ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని నిబంధనలు, వైద్య ప్రమాణాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వైద్య సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తనిఖీల్లో జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డీపీఎంఓ డాక్టర్ పద్మజ, జిల్లా మాస్ మీడియా అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు

## -హామీలను అమలు చేయాలి -బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శనివారం హిందూపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల సమయంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ అమలులో న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి 50 శాతం పరిమితి ఉందని కోర్టుల తీర్పులు స్పష్టం చేస్తున్నప్పటికీ, ఆచరణ సాధ్యంకాని హామీలను ఇవ్వడం ద్వారా బీసీలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. బీసీ డిక్లరేషన్, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను చట్టబద్ధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని శ్రీరాములు కోరారు. బీసీల రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎస్పీ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు కన్నయ్య, ఎస్‌ఆర్‌పల్లి శ్రీనివాసులు, గంగప్ప, హుసేన్, స్టూడియో గంగాధర్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

# శింగనమల క్రాస్ లో 66వ వారం అన్నదానం





ప్రజా భూమి శింగనమల

శింగనమల క్రాస్‌లోని అమరావతి రహదారిపై శ్రీ ఋష్యశృంగ మహాముని, శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం 66వ వారం అన్నదాన కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జె. రామ్‌చరణ్ యాదవ్ మాట్లాడుతూ 66 వారాలుగా అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. శింగనమల గ్రామానికి చెందిన రామ్ గణేష్ 25 కిలోల,బియ్యం,అందజేశారు కార్యక్రమంలో పెద్దమట్లగొంది సురేంద్ర యాదవ్, శివపురం సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శింగనమల మండలంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి (ఏపీఎస్ఏఎంసిఎస్) ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 44 మంది విద్యార్థులు పాల్గొని 22 బృందాలుగా పోటీ పడ్డారు. నిర్వాహకులు పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ పోటీల్లో బాలయేసు కళాశాల విద్యార్థుల బృందం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బృందం తృతీయ స్థానంలో నిలిచింది. ప్రస్తుత పోటీల్లో విజేతలుగా నిలిచిన మూడు బృందాలు జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలకు అర్హత సాధించాయని నిర్వాహకులు తెలిపారు. ఈశకార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, బాలయేసు కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అశ్వత నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు మల్లిక, చైతన్య ఎన్జీవో ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి, ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ అరుణ్ కుమార్, ఎల్ డబ్ల్యూ ఎస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి

## -ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## -ఎస్టీయూ నాయకుల డిమాండ్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

దీర్ఘకాలంగా ఉద్యోగ, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో హిందూపురం మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఆర్థిక కార్యదర్శి జయకృష్ణ, మున్సిపల్ అధ్యక్షుడు సమీవుల్లా, ప్రధాన కార్యదర్శి రాములు తదితరులు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు బోధనలో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ, పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, మరికొన్ని పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో వెంటనే అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. ఇటీవల విడుదలైన ప్రెసిడెంట్ ఆర్డర్‌లోని నిబంధనలను అమలు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయడంతోపాటు ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

# మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

## -పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించిన ఆర్పీలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మెప్మా ఆర్పీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీయూసీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు శనివారం మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్పీలు పోస్టుకార్డులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఈ సందర్భంగా ఏపిటీయూసీ జిల్లా కోఆర్డినేటర్ బాబు, ఆర్పీల అసోసియేషన్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, కార్యదర్శి ఆసియా బాను మాట్లాడుతూ ఆర్పీలకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు హెల్త్ పాలసీని అమలు చేయాలని కోరారు. అదనపు పని భారాన్ని తగ్గించాలని, యాప్‌ల ద్వారా విధించే ఆన్‌లైన్ పనులకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ప్రతి నెలా సక్రమంగా జీతాలు ఆర్పీల ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మెప్మా పరిధిలో పట్టణ పేదల సంక్షేమం, మహిళా సంఘాల బలోపేతం తదితర కార్యక్రమాల్లో ఆర్పీలు కీలకంగా పనిచేస్తున్నప్పటికీ తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ అసోసియేషన్ యూనియన్ కోఆర్డినేటర్ ఆయేషా, సుమతి, షాదర్, లక్ష్మీ సుమయ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

